ఈనాడు విశాఖపట్నం

సిటీ ఆదివారం 7 జనవరి 2018 24 పేజీలు





హాయ్ బుజ్జీ!



బాబోయ్... బాంబ్ సైక్లోన్!

అమెరికాని బాంబ్ సైక్లోన్ భయపెట్టేస్తోంది. అట్లాంటిక్ సముద్రం నుంచి తీరం వైపు దూసుకొస్తున్న ఈ తుపాను బీభత్సానికి భారీగా మంచుకురుస్తోంది. ఇళ్లు... రోడ్లు... చెట్లు ఇలా ఎక్కడ చూసినా మంచే కనిపిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మంచుతో మంచు మేటలు పేరుకుపోయాయి. మైనస్ డిగ్రీల్లో ఉష్ణోగ్రతలు కొనసాగడంతో చుక్క నీరు కనిపించడం లేదు. ఎక్కడికక్కడ మంచు కొండలే. చలి తీవ్రతకు జనజీవనం పూర్తిగా స్తంభించింది. భారీ హిమపాతం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అత్యవసర పరిస్థితి ప్రకటించారు.

◆ **మంచు తుపాన్ అంటే ఏంటసలు?**

తుపాన్ అంటే తెలుసుగా... సముద్రంలో ఉన్నట్టుండి అల్పపీడన ప్రాంతం ఏర్పడుతుంది. అంటే అక్కడ గాలి పీడనం తక్కువగా ఉంటుందన్నమాట. దీంతో చుట్టూ ఉన్న గాలి ఆ ప్రాంతంలోకి వేగంగా చొరబడి సుడులు తిరుగుతుంది. ఆ వేగంగా తిరిగే సుడుల్నే తుపాను అంటారు. ఈ తుపాను నీటి మీద నుంచి నేలమీదకు ఎక్కడాన్నే 'తుపాను తీరం దాటడం' అంటారు. ఆ సమయంలో వేగంగా వీచే చల్లగాలుల వల్ల వర్షం కురుస్తుంది. ఇదంతా మనకు తెలిసిందే. అయితే అమెరికాలో ఇప్పుడు చలికాలం. సాధారణంగానే మైనస్ డిగ్రీల్లో ఉష్ణోగ్రత ఉంటుంది. అలాంటప్పుడు ఈ తుపాను ప్రభావం వల్ల పై నుంచి వర్షం కురిస్తే చినుకులు గాల్లోనే మంచుగా మారతాయి. ఇదే మంచు తుపాన్.

◆ **'బాంబ్ సైక్లోన్' అంటే?**

ఉన్నట్టుండి వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఒక్కసారిగా వచ్చే పెను తుపాన్లనే 'బాంబ్ సైక్లోన్లు' అంటారు.

◆ **దీని వేగాన్ని ఎలా లెక్కిస్తారు?**

గాలిలో ఉండే పీడనాన్ని మిల్లీబార్లలో కొలుస్తారు. ఒక ప్రాంతంలో ఉండే గాలి పీడనం గంటకు ఒక మిల్లీబార్‌కి పడిపోతే తుపాన్ నేత్రం ఏర్పడుతుంది. అలాంటి పరిస్థితుల్లో పుట్టే తుపాన్లను బాంబ్ సైక్లోన్లు అంటుంటారు. దీని ప్రభావం వల్ల ఏర్పడే గాలుల వేగం దాదాపుగా గంటకు 130 కిలో మీటర్లు ఉంటుంది.

◆ **బాంబ్ అనే పదం ఎందుకు వచ్చింది?**

1980ల నుంచి ఈ పదం ఎక్కువగా వాడుకలో ఉంది. బాంబ్ అంటే పేలుతుందని కాదు. అంతటి శక్తిమంతమైన తుపాన్ అన్న మాట.

◆ **ఏ కాలంలో ఎక్కువగా వస్తుంటాయి?**

అట్లాంటిక్, పసిఫిక్ సముద్రాల్లో... శీతకాలం సమయంలో ఈ తుపాన్లు ఎక్కువగా పుడుతుంటాయి. చాలా అరుదుగా వేసవి కాలంలోనూ వస్తాయి.

ఆణిముత్యం

ఉన్నత లక్ష్యాల్ని సాధించే క్రమంలో తాత్కాలిక ఆనందాల్ని దూరం చేసుకోవాల్సిందే

– సిసిరో

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Wednesday - వెన్స్‌డే
Campaign - కేంపైన్

సుడోకు

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.

3	6		7		1		5	
	7	4						9
		8						
	5		4	3		1		
			2	7	8			
		9		6	5		4	
						5		
8						9	3	
	1		9		3		6	4

ట్రాక్టరు ముందు చక్రాలు చిన్నగా ఉంటాయేం?

ప్రశ్న: ట్రాక్టరు ముందు చక్రాలు చిన్నగా, వెనుక చక్రాలు పెద్దగా ఎందుకుంటాయి?

– **పి.గోవిందరెడ్డి,** ఇంటర్, బద్వేల్, కడపజిల్లా



జవాబు: పొలాల్లో ఉండే నేల అంతా సమానంగా, ధృఢంగా ఉండదు. కాబట్టి ఏ వాహనాన్ని నడిపే డ్రైవర్ అయినా అక్కడ ఎక్కువ చోదక శక్తిని(స్టీరింగ్ ఎఫర్ట్)ని పెట్టాల్సి ఉంటుంది.

ట్రాక్టర్ల ముందుండే చక్రాలు వాహనం స్థిరంగా ఉండడానికి, సులభంగా నడపడానికి మాత్రమే అలా అమర్చి ఉంటాయి. అంతే కాకుండా వాటి అమరిక డ్రైవర్ పొలాన్నంతా క్షుణ్ణంగా చూడటానికి వీలుగా ఉంటుంది. కానీ వెనుక ఉండే చక్రాలు పొలం యొక్క నేలను గట్టిగా పట్టి ఉంచేటట్లుగా ఉండాలి. అందుకే దాని వెనక చక్రాల ఉపరితల వైశాల్యం ఎక్కువగా ఉండి వాటి కదలికల వల్ల ఏర్పడే గాలి ఒత్తిడి తక్కువగా ఉంటుంది. దీంతో టైర్లకు, నేలకు మధ్య కావలసినంత స్పర్శావైశాల్యం(కాంటాక్ట్ ఏరియా), ఘర్షణ ఏర్పడతాయి. బురద పొలాల్లో చోదకశక్తిని ఎక్కువ చేయడానికి ఇవి ఎంతో అవసరం.

ట్రాక్టరు వెనుక చక్రాలు కూడా తక్కువ వ్యాసం, తక్కువ ఉపరితల వైశాల్యం (వెడల్పు)తో ఉంటే దాని బరువు వల్ల అది బురద పొలాల్లో దిగబడి, ఇరుక్కుపోతుంది. అందుకే ఈ ఏర్పాటు.

– **ప్రొ॥ ఈ.వి. సుబ్బారావు,** హైదరాబాద్


జవాబు: సుడోకు

3	6	2	7	9	1	4	5	8
5	7	4	6	8	3	2	1	9
1	9	8	3	5	4	2	7	6
6	5	7	4	3	9	1	8	2
4	3	1	2	7	8	6	9	5
2	8	9	1	6	5	7	4	3
9	4	3	8	1	6	5	2	7
8	2	6	5	4	7	9	3	1
7	1	5	9	2	3	8	6	4

మా చిరునామా:
హాయ్‌బుజ్జీ విభాగం,
ఈనాడు కార్యాలయం,
రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512
email:
hb.eenadu@gmail.com

చూడండి చెయ్యండి

పక్షుల్ని చూడడం అంటే మనకు బోలెడు ఇష్టం...
వాటికి గింజలేస్తూ ఆడుకోవడమంటే ఇంకానూ...
అవి మన పెరట్లోకే వచ్చి సందడి చేయాలంటే?
మనం బర్డ్ ఫీడర్ చేసి పెట్టేస్తే సరి...
ఎలాగో చూసేసి చటుక్కున చేసేద్దాం!



చేసేద్దాం.. బర్డ్ ఫీడర్!



కావాల్సిన వస్తువులు: 1.ఖాళీ ప్లాస్టిక్ బాటిల్ 2.కత్తెర 3.దారం 4.రంగులు 5. జిగురు 6.గింజలు



1. ముందుగా ఖాళీ బాటిల్‌ని చిత్రంలో చూపించినట్లుగా కత్తిరించుకోవాలి. తర్వాత వాటికి కావల్సిన రంగులు అద్దుకుని సిద్ధం చేసుకోవాలి.



2. బాటిల్ పైభాగాన్ని పై కప్పుగా, కింద భాగాన్ని మట్టుగా పెట్టుకునేలా తయారు చేసుకోవాలి. బాటిల్ మూత భాగానికి రంధ్రం చేసి దారాన్నో, తీగనో బయటకి వేలాడదీసేందుకు వీలుగా ఏర్పాటు చేసుకోవాలి.



3. చివరిగా ఆ రెండు భాగాల్ని అతికించి జిగురు ఆరిపోయాక అందులో గింజలు వేసి బాల్కనీలోనో, చెట్టు కొమ్మకో వేలాడదీసి కాసిన్ని గింజలేస్తే సరి. ఇలాంటిదే ఇంకోదాంట్లో నీళ్లు పోసి పక్కనే ఉంచితే చిన్న చిన్న పక్షులు మన ఇంటి దగ్గర సందడి చేయాల్సిందే మరి.

ఈనాడు విశాఖపట్నం

సిటీ | ఆదివారం 7 జనవరి 2018 | 24 పేజీలు



అరకు దారిలో... నయా దోపిడీ...

▼ ఏ.పి టూరిజం అధికారులు ఆక్రమించిన బోగీలో ఇలా...

కిరండూల్ పాసింజర్‌లో అనధికారికంగా ఏపీ టూరిజం బోగీ ఆక్రమణ

రెండేళ్లుగా సాగుతున్నా పట్టించుకోని రైల్వే అధికారులు

న్యూస్‌టుడే, రైల్వే స్టేషన్

ప్రయాణికుల అమాయకత్వం... పర్యాటకుల ఆత్రం... రైల్వే అధికారుల నిష్క్రియాపరత్వం... ఏపీ టూరిజం శాఖకు బాగా కలిసొస్తున్నాయి. ప్యాకేజీల పేరుతో పర్యాటకుల వద్ద రూ. వేలల్లో దండుకోవడం.. ఆపై వారిని రైలెక్కించేందుకు కిరండూల్ పాసింజర్‌లో ఓ బోగీని ఆక్రమించడం... అందులోకి ఇతరులెవరైనా ఎక్కితే దౌర్జన్యంగా దించేయడం... ఇదీ టూరిజం శాఖ సిబ్బంది తీరు. ఇలా రెండేళ్లుగా సాగుతున్నా రైల్వే అధికారులకు పట్టడం లేదు. దీనివల్ల రైల్వే ఆదాయానికి గండిపడుతున్నా కనీసం చీమ కుట్టినట్టు కూడా ఉండడం లేదు.

ఏటా అక్టోబరు నుంచి జనవరి నెలాఖరు వరకూ అరకుకు రోజూ వేలాదిగా పర్యాటకులు వస్తుంటారు. అరకు మార్గంలో రైలు ప్రయాణం ఎన్నో అనుభూతులు మిగుల్చుతుండటంతో చాలామంది ఏడు బోగీలు ...మిగతా 8లో



గురజాడ కళాక్షేత్రం లోపలి భాగం

గురజాడ కళాక్షేత్రం సిద్ధం

17న సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సన్నాహాలు

వివరాలు 8లో

నగరంలో...

ఈ-జోన్



వివరాలు మధ్యపేజీల్లో



ఈనాడు - ఈతరం క్లబ్ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వర్క్‌షాప్

వివరాలు 8వ పేజీలో



గురువారం రైల్వేస్టేషన్‌లో పట్టుబడ్డ దుస్తుల మూటలు

వారి దారి... అడ్డదారి!

- బిల్లుల్లేకుండా అమ్మకాలు
- పన్ను చెల్లించకుండా సరకు తరలింపు
- ఎగవేతదారులపై రాష్ట్ర పన్నులశాఖ గురి

రూ. 2 కోట్లు	రాష్ట్ర పన్నులశాఖ విశాఖ డివిజన్‌లో వాహనాల తనిఖీల సందర్భంగా కేసులు నమోదు చేసి.. విధించిన పన్ను
రూ. 32 లక్షలు	బిల్లులు ఇవ్వకుండా వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి విధించిన అపరాధ రుసుము

ఈనాడు, విశాఖపట్నం

ఎలాంటి పత్రాల్లేకుండా గుజరాత్ నుంచి విశాఖ నగరానికి టైల్స్ లోడుతో వస్తున్న లారీని అగనంపూడి టోల్ ప్లాజా సమీపంలో తనిఖీ చేసిన అధికారులు అక్రమంగా సరకు తరలిస్తున్నట్లు గుర్తించి రూ. 4 లక్షల అపరాధ రుసుము వసూలు చేశారు.

నగరంలోని ఓ దుకాణంలో ఫర్నిచర్ కొనుగోలు చేసిన వ్యక్తికి యజమాని బిల్లు ఇవ్వలేదు. పైగా నగదు మాత్రమే చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. ఇదేంటని కొనుగోలుదారుడు నిలదీసినా వినలేదు. చివరకు ఈ వ్యవహారం అధికారుల వరకూ వెళ్లింది. కేసు నమోదైంది.

సంక్రాంతి సీజన్ కావటంతో కోల్‌కతా ...మిగతా 8లో





ఖాదీ డిజైనర్ పురస్కార విజేతకు సన్మానం



అవార్డుతో మంత్రి గంటా శ్రీనివాసరావు, గంగూరి లక్ష్మీ సుజాత

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మిస్ ఇండియా ఖాదీ-2017 పోటీలో డిజైనర్‌గా జేడీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ అండ్ ఇంటీరియర్ డిజైనింగ్ విద్యార్థిని గంగూరి లక్ష్మీ సుజాత ప్రథమస్థానంలో నిలిచి పురస్కారాన్ని గెలుచుకోవడం నగరానికి గర్వ కారణమని మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో లక్ష్మీసుజాతను సత్కరించారు. జేడీ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి కట్టమూడి ప్రదీప్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా జరిగిన ఈ పోటీల్లో 200 కళాశాలల నుంచి 50 వేల మంది డిజైనర్లు పాల్గొనగా 37 మంది దిల్లీలో జరిగిన గ్రాండ్ ఫినాలేకు ఎంపికయ్యారన్నారు. వీరిలో జేడీ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థిని లక్ష్మీ సుజాత భారతీయత, పాశ్చాత్యను రంగరించి ఖాదీతో తయారుచేసిన వస్త్రాల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచారన్నారు. కార్యక్రమంలో పైడా కృష్ణప్రసాద్, ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు సంగీత, పాయల్ శర్మ, ప్రియ, అరుణ, భరద్వాజ్, రేస్ రవి తదితరులు పాల్గొన్నారు.

కళాంజలి బంగారు నెక్లెస్ విజేత సాయిసహస్ర



తిరుపతి కళాంజలి షోరూంలో లక్కీడ్రా తీస్తున్న వీసీ దుర్గాభవానీ



విజేత వి.సాయిసహస్ర

తిరుపతి(ఎస్‌బీఐకాలనీ), న్యూస్‌టుడే: భారతీయ మహిళల సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా.. నిత్యం నూతన ఒరవడులతో మగువల అందాన్ని రెట్టింపు చేసే వస్త్రాలను అందించే కళాంజలి.. నాణ్యతతోపాటు, తక్కువ ధరలకే వస్త్రాలను అందించడం అభినందనీయమని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య దుర్గాభవానీ అన్నారు. తిరుపతి- రేణిగుంట రోడ్డులోని కళాంజలి షోరూమ్‌లో 'మా బంగారు కళాంజలి మహోత్సవం' లక్కీడ్రాను శనివారం ఆమె తీశారు. కళాంజలిలో డిసెంబర్ 16వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ వరకు బంగారు మహోత్సవం ఆఫర్‌ను అందిస్తోంది. ప్రతి రూ.2వేల వస్త్రాల కొనుగోలుపై ఒక కూపన్ అందించి.. వారం.. వారం లక్కీడ్రాను తీస్తారు. గత నెల 30వ తేదీ నుంచి జనవరి 5వ తేదీ వరకు కళాంజలిలో వస్త్రాలను కొనుగోలు చేసిన వినియోగదారులకు సంబంధించిన లక్కీడ్రాను వీసీ తీశారు. విజయవాడ కళాంజలి షోరూమ్‌లో గత 31వ తేదీన వస్త్రాలను కొనుగోలు చేసిన వి.సాయిసహస్ర కూపన్ నెం.00300 విజేతగా నిలిచి రూ.3.60 లక్షల విలువైన బంగారు నెక్లెస్‌ను గెలుచుకుంది. విజేతకు వీసీ స్వయంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో 'ఈనాడు' తిరుపతి యూనిట్ ఇన్‌ఛార్జి టి.శ్రీనివాసులు, మార్గదర్శి తిరుపతి మేనేజర్ సి.కేశవులు నాయుడు, మయూరి మేనేజర్ రమేష్, ప్రియాఫుడ్స్ మేనేజర్ గిరిధర్, కళాంజలి అధికార ప్రతినిధులు పి.శేఖర్, కె.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్సు దగ్ధం



అంబులెన్స్‌లో మంటలు వ్యాపిస్తున్న దృశ్యం.

మహారాణిపేట, న్యూస్‌టుడే: నగరంలోని కలెక్టర్ కార్యాలయం దిగువన ఏబీసీ ఆసుపత్రి వద్ద శనివారం ఉదయం ఒక అంబులెన్స్‌లో మంటల వ్యాపించి దగ్ధమైంది. శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో ఏబీసీ ఆసుపత్రి వద్ద ఏపీ 31 టీహెచ్ 7788 నెంబర్ గల అంబులెన్స్‌ను నిలిపిఉంచారు. అంబులెన్స్‌లో షార్టుసర్క్యూట్ సంభవించడం వల్ల శనివారం ఉదయం 6 గంటల సమయంలో మంటలు వ్యాపించాయి. దీంతో అగ్నిమాపక సిబ్బంది సమాచారం అందుకొని మంటలు ఆర్పేటప్పటికే అది మాడి మసైపోయింది. మూడు నెలల క్రితం రూ.20 లక్షలతో కొనుగోలు చేశామని, ఇది పూర్తిగా అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్టు అంబులెన్స్ అని డ్రైవర్ పడాల సన్యాసినాయుడు తెలిపారు. వన్‌టౌన్ పోలీసులు ప్రమాదానికి గల కారణాలను పరిశీలిస్తున్నారు.

నేడు అన్ని పాఠశాలలు తెరవాలి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జిల్లాలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఆదివారం పనిదినమైనందున తెరచి జన్మభూమికి కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వర రెడ్డి తెలిపారు. జన్మభూమి-మావూరు కార్యక్రమం ఉన్నందున అన్ని పాఠశాలలకు పనిదినంగానే ప్రభుత్వం పరిగణించిందని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలకు విధిగా హాజరై వారికి ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన యాప్ తెరిచే ఉంటుందన్నారు.

కొత్త మండలాల ఏర్పాటుపై రాజపత్రం విడుదల

అభ్యంతరాలు, సలహాల స్వీకరణకు శ్రీకారం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: నగరంలో కొత్తగా మూడు మండలాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఇంతవరకు దాదాపు 20 లక్షల మందికి ప్రస్తుతం సీతమ్మధారలో ఒకే ఒక్క తహసిల్దార్ కార్యాలయం సేవలందిస్తోంది. దీనికి అదనంగా మరో మూడు మండల రెవెన్యూ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇటీవల అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీని ఆధారంగా కొత్త మండలాలు, వాటి పరిధిలోకి వచ్చే ప్రాంతాలను స్పష్టంచేస్తూ జిల్లా యంత్రాంగం శనివారం జిల్లా గెజిట్ నోటిఫికేషన్ (రాజపత్రం) విడుదల చేసింది. సోమవారం నుంచి కలెక్టరేట్‌తో పాటు ఆర్డీవో, సీతమ్మధార తహసిల్దార్ కార్యాలయంతో పాటు ఇతర ముఖ్య ప్రాంతాల్లో రాజపత్రం వివరాలను ప్రజల కోసం అందుబాటులో ఉంచనున్నారు. మహారాణిపేట, గోపాలపట్నం, ములగాడ కేంద్రాలుగా కొత్త తహసిల్దార్ కార్యాలయాలు రానున్నాయి. ఆయా మండల కేంద్రాలపరిధిలోకి వచ్చే ప్రాంతాలను జిల్లా రాజపత్రంలో ముద్రించారు. వీటి ఆధారంగా ఇప్పటి నుంచి 30 రోజుల వ్యవధిలో.. అంటే ఫిబ్రవరి 5 వరకూ కొత్త మండలాల ఏర్పాటుపై అభ్యంతరాలు, సలహాలను కలెక్టర్‌కు రాతపూర్వకంగా స్వీకరించనుంది. అభ్యంతరాలు, సలహాల ఆధారంగా కలెక్టర్ తన సిఫార్సులను జతచేసి ప్రభుత్వానికి పంపుతారు. తదుపరి వచ్చే ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త మండలాలు ఏర్పాటవుతాయి. ఈ ప్రక్రియ మొత్తం ఫిబ్రవరి నెలాఖరుకు పూర్తయ్యే అవకాశముంది. ఉగాది నుంచి కొత్త మండల కార్యాలయాలు అందుబాటులోకి రానున్నాయి.

అదనంగా మూడు తహసిల్దార్ పోస్టులు

కొత్త మండలాల ఏర్పాటు నేపథ్యంలో జిల్లాకు మరో మూడు తహసిల్దార్ పోస్టులు రానున్నాయి. ప్రస్తుతం 61 మంది తహసిల్దార్లు ఉన్నారు. వీరి సంఖ్య 64కు పెరగనుంది. ఉప తహసిల్దార్లు, సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకులు, ఆఫీసు సబార్డినేట్ల సంఖ్య కూడా పెరగనుంది. ఒక్కో తహసిల్దార్ కార్యాలయానికి ఒక తహసిల్దార్, ఉప తహసిల్దార్, సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఇద్దరు, ఇద్దరు ఆఫీసు సబార్డినేట్లతో పాటు మొత్తం పది మంది ఉద్యోగులు అవసరం ఉంటుంది. ఈ లెక్కన మూడు కార్యాలయాలకు 30 మంది వరకు అదనంగా నియమించుకొనే అవకాశం ఏర్పడనుంది. ఒక్కో కార్యాలయ నిర్వహణకు జీతభత్యాలన్నీ కలిపి ఏడాదికి రూ.70 లక్షల వరకూ ఖర్చు కానుంది. ఈ మేరకు కలెక్టరేట్ అధికారులు సవివర ప్రతిపాదనలను తయారుచేసి ప్రభుత్వానికి పంపుతున్నారు. కొత్త తహసిల్దార్ కార్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భవనాలు, ఇతర వసతి సౌకర్యాల కల్పన అంశాలపై దృష్టి సారించారు.

సంక్రాంతి సందడొచ్చింది


ముగ్గులను సందర్శిస్తున్న కలెక్టర్ సతీమణి శోభన

ఎం.వి.పి.కాలనీ: పంచకట్టు.. పరికిణి ఓణి.. పిండివంటలు.. చక్కటి ముగ్గులు.. ఇలా సంక్రాంతి సంబరాలను ముందే తీసుకొచ్చారు ఎంవీపీకాలనీ ఐ.ఐ.ఎ.ఎం. కళాశాల విద్యార్థులు. యువ మేనేజర్లు సంప్రదాయ దుస్తుల వేషధారణలో సందడి చేశారు. కార్యక్రమాన్ని కలెక్టర్ సతీమణి శోభనా స్మృతి, గౌరవ అతిథి వాణి గన్నమని, ఐ.ఐ.ఎ.ఎం. డీన్ డాక్టర్ ఎస్.పి.రవీంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యతేజ, డైరెక్టర్ డాక్టర్ విజయా రుద్రరాజు, ఏయూ పాలకమండలి సభ్యురాలు ఎస్.విజయారవీంద్ర జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విద్యార్థినులు వేసిన ముగ్గులను కలెక్టర్ సతీమణి శోభన తిలకించారు. అనంతరం సమావేశమందిరంలో ప్రదర్శనలతో అలరించారు. హుషారైన స్టెప్పులతో సందడి చేశారు.


చక్కని ప్రసాదం వండుతూ...


సంక్రాంతి వంటకాలతో...


గ్రీన్‌డేల్ పాఠశాలలో గాలిపటం ఎగురవేస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

పండగ విశిష్టత తెలియజేయాలి : మంత్రి గంటా

గ్రీన్‌డేల్‌లో గాలిపటాల ఉత్సవం

పీఎంపాలెం: ప్రతి పాఠశాలలో సంక్రాంతి వేడుకలు నిర్వహించి, విద్యార్థులకు పండగ విశిష్టత తెలియజేయాలని మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మధురవాడ గ్రీన్‌డేల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో శనివారం ముందస్తు సంక్రాంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన 'గాలిపటాల ఉత్సవం'లో ఆయన పాల్గొన్నారు. బొమ్మల కొలువును సందర్శించి, భోగి మంటను వెలిగించారు. అనంతరం చిన్నారులతో కలిసి గాలిపటాలు ఎగురవేసి సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వస్త్రధారణల్లో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ఎస్.రవీంద్ర, కరస్పాండెంట్ విజయారవీంద్ర, స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.



అదనపు గ్యాస్ ఉత్పత్తికి చర్యలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : అయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఒ.ఎన్.జి.సి.) భారతదేశ తూర్పు తీరంలో రోజుకు 5 మిలియన్ క్యూబిక్ మీటర్ల గ్యాస్‌ను అదనంగా ఉత్పత్తి చేయటానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఒ.ఎన్.జి.సి. ఈస్టర్న్ ఆఫ్‌షోర్ ఆసెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలోక్‌నందన్ తెలిపారు. దీనికి డిమాండ్, మార్కెట్ పరిస్థితులను అంచనా వేసేందుకు శనివారం విశాఖ నగరంలోని ఓ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. అలోక్‌నందన్ మాట్లాడుతూ 2019 నాటికి అదనపు ఉత్పత్తి 15 మిలియన్ క్యూబిక్ మీటర్లకు చేరుతుందన్నారు. ప్రస్తుతం ఒ.ఎన్.జి.సి. గ్యాస్ నిల్వలను గెయిల్‌కు చెందిన కేజీ బేసిన్ గ్రిడ్ ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. అదనంగా ఉత్పత్తయ్యే ఈ గ్యాస్ మార్కెటింగ్‌ను, భారత ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణమైన ధరల్లోనే విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ లభ్యత, వాడకం, రవాణా ధరల పద్ధతులు, బెంచ్ మార్కింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ సమావేశం నిర్వహించామన్నారు. సమావేశంలో ఓఎన్‌జీసీ మార్కెటింగ్ ప్రధానాధికారి గుహేశ్వర్, ఎ.పి.జి.పి.సి.ఎల్. ఎం.డి. ప్రవీణ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, గెయిల్, స్టీల్‌ప్లాంట్, రిలయన్స్ ఇండస్ట్రీస్, స్పిక్, దీపక్ ఫెర్టిలైజర్స్, ఎస్సార్ స్టీల్, జి.ఎం.ఆర్. తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువోత్సాహం ఉప్పొంగిన వేళ..

విజ్ఞాన్‌లో ఘనంగా ప్రారంభమైన యువతరంగ్



ఉక్కు డైరెక్టర్ వీవీ వేణుగోపాలరావును సత్కరిస్తున్న రత్తయ్య తదితరులు.. కార్యక్రమానికి హాజరైన సినీ ప్రముఖులు

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: జీవితాన్ని సాకారం చేసుకోవడానికి పట్టభద్రులు ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఆర్ఐఎన్ఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ వీవీ వేణుగోపాలరావు అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్, మహిళ, ఫార్మా కళాశాల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన యువ తరంగ్-2018లో ఆయన మాట్లాడారు. పట్టభద్రులు సామజిక స్పృహను అవలోకనం చేసుకొని ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. చరవాణిలతో కాలం గడుపుతూ.. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం మానుకోవాలని సూచించారు. విమ్స్ డైరెక్టర్ సత్యవరప్రసాద్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, గురువులతో సత్సంబంధాలు కొనసాగించుకోవాలని చెప్పారు. విజ్ఞాన్ విద్యా సంస్థల ఛైర్మన్ లావు రత్తయ్య మాట్లాడారు. 2017లో బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే ను నిర్వహించామన్నారు. 1,150 మందికి డిగ్రీ ధృవీకరణ పత్రాలు, మెడల్స్ అందజేసినట్లు వివరించారు. అనంతరం విద్యా సంస్థల సీఈవో కె.పవన్‌కృష్ణ, ప్రిన్సిపాళ్లు చల్లా నర్సింహం, ఎ.శేషారవు, జి.శ్రీనివాసరావు, డీన్ హరిగోవిందరావు, విద్యా వ్యవహారాల డీన్ మధుసూదనరావు పాల్గొన్నారు. యువజనోత్సవాలకు సినీ నేపథ్య గాయకుడు ధనుంజయ్, హాస్య నటుడు హర్షవర్ధన్, హీరో సందీప్ కిషన్, దర్శకుడు అనిల్ రావిపూడి హాజరై తమ అనుభవాలను పంచుకున్నారు.

ఘనంగా చైతన్య క్రీడోత్సవాలు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి శ్రీచైతన్య పాఠశాలలో అంతర పాఠశాలల క్రీడోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి వెస్ట్‌జోన్ నేర విభాగ సీఐ పి.సూర్యనారాయణ, పెందుర్తి ఎస్ఐ జీడీ బాబు, శ్రీచైతన్య పాఠశాలల ప్రాంతీయ ఇన్‌ఛార్జి వై.ఆశిబాబు, ప్రిన్సిపల్ ఉష పాల్గొని జాతీయ పతాకం ఆవిష్కరించారు. ముఖ్య అతిథి సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ఆవశ్యకమన్నారు. తొలుత అతిథులు క్రీడా జ్యోతిని వెలిగించారు. విద్యార్థులు టార్చ్‌రిలే నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పెందుర్తి, ఎన్ఏడీ శాఖలకు చెందిన విద్యార్థులు వివిధ క్రీడల్లో పాల్గొని ప్రతిభ చూపారు. పోటీల్లో గెలుపొందిన వారికి ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న క్రైం సీఐ సూర్యనారాయణ, తదితరులు

ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీ జనవరి 5, 2018 విజేతలు

1. బి. రోహిత, గుర్రంగూడ, హైదరాబాద్; 2. డి. రామదుర్గ, గుంటూరు; 3. పి.ఎన్.వి.లక్ష్మి, రాజమహేంద్రవరం; 4. లక్ష్మి, ఒంగోలు; 5. ఎన్. భూలక్ష్మి, కొండ్రుపాడు, ఖమ్మం; 6. ఎం. లక్ష్మి, అనంతపురం; 7. ఆర్. ప్రవీణ, చిన్నవాల్తేరు, వైజాగ్; 8. వి. సునీత, విజయవాడ; 9. కె. అరుణ, నెల్లూరు; 10. ఎన్.రోజా, చిన గంట్యాడ, గాజువాక. విజేతల వివరాలు, ఫొటోలు ఈనాడు డాట్‌నెట్‌లో చూడవచ్చు.

ముగిసిన సదస్సు

బీచ్‌రోడ్, న్యూస్‌టుడే : ఇంపాక్ట్ 2018 సదస్సు శనివారం రాత్రి ముగిసింది. ముగింపు వేడుకలకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ ఆచార్య కోనేరు రామకృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి.ఎస్.అవధాని, రితీష్ భాటియా, డాక్టర్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ బి.ఉమామహేశ్వరరావు అన్నారు. శనివారం పెందుర్తిలోని అమర్ పాఠశాలలో అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపల్ పి.కుసుమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు.

సమష్టి కృషితో బహిరంగ మలవిసర్జన నివారణ

వేపగుంట: సమష్టి కృషితో బహిరంగ మలవిసర్జన నివారణ సాధ్యమని పర్యావరణ పరిరక్షణ విభాగ ప్రతినిధి ప్రసన్న లక్ష్మి పిలుపునిచ్చారు. బహిరంగ మలవిసర్జన నిర్మూలనలో ఎదురవుతున్న ఇబ్బందులు, వాటిని అధిగమించడానికి తీసుకోవలసిన చర్యలపై ప్రజారోగ్య విభాగ అధికారులు, ఎస్‌ఎల్‌ఎఫ్ మహిళలతో జోనల్‌కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రసన్న లక్ష్మి పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జడ్సీ సత్యనారాయణరావు, ఏఎంహెచ్‌వో కె.వి.జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నంబరు ప్లేటుతో కారులో గంజాయి రవాణా

జెర్రిపోతులపాలెం వద్ద పట్టుకున్న పోలీసులు

జెర్రిపోతులపాలెం (వేపగుంట), న్యూస్‌టుడే : నకిలీ నెంబరు ప్లేటుని తగిలించి గంజాయిని రవాణా చేస్తున్న ఓ కారుని పెందుర్తి పోలీసులు శనివారం పట్టుకున్నారు. పెందుర్తి సీఐ మురళి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి శివారు సబ్బవరం నుంచి నరవ వైపు వేగంగా వస్తున్న కారు ఓ మోటారు సైకిలిస్టుని ఢీకొట్టింది. గస్తీలో ఉన్న పోలీసులు గమనించి కారుని పట్టుకునేందుకు ప్రయత్నించారు. డ్రైవరు మరింత వేగంతో కారును నడిపి జెర్రిపోతులపాలెం సమీపంలో అదుపు తప్పి పక్కనే ఉన్న టాటా ఏసీ వాహనాన్ని ఢీకొట్టాడు. పోలీసులు, స్థానికులు వెంబడించి కారుని నిలుపుదల చేశారు. డ్రైవరు, మరో వ్యక్తి పరారైనట్లు పోలీసులు చెబుతున్నారు. కారును పరిశీలించగా అది కేరళకు చెందినదని, ఏపీ రిజిస్ట్రేషన్ నంబరుతో నడుపుతున్నట్లు తేలింది. లోపల కాగితం కవర్లతో తయారు చేసిన ప్యాకెట్లు కనిపించాయి. వాటిని విప్పి చూడగా 270కేజీల గంజాయి ఉన్నట్లు నిర్ధారించారు. పోలీసులు సరకును స్వాధీనం చేసుకుని స్టేషనుకు తరలించారు. కారు డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అయితే పోలీసులు ఈ విషయాన్ని నిర్ధారించడం లేదు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ మురళి

కారులో రహస్య పెట్టె ఏర్పాటు చేసి...

78కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

సబ్బవరం, న్యూస్‌టుడే: డుంబ్రిగుడ మండలం నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న రూ.1.72 లక్షల విలువైన 78 కిలోల గంజాయిని స్థానిక ఎస్‌ఐ ఎన్.ప్రభాకరరెడ్డి, సిబ్బంది సబ్బవరం సమీపంలో స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా డుంబ్రిగుడ మండలం నుంచి ఓ కారు అడుగున ఏర్పాటు చేసిన ప్రత్యేక పెట్టెలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసులకు శనివారం సమాచారం అందింది. ఎక్సైజ్ సీఐ ప్రసాద్, సిబ్బంది కారును వెంబడిస్తూ వచ్చారు. కారు మాడుగుల ఘాట్‌రోడ్ వద్ద ఒకసారి, చోడవరం వద్ద ఒక సారి ఎక్సైజ్ అధికారుల కన్నుగప్పి మాయమవడంతో ప్రసాద్ లా అండ్ ఆర్డర్ డీఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు సబ్బవరం ఎస్‌ఐ ప్రభాకరరెడ్డి, సిబ్బంది మాటు వేసి సబ్బవరం సమీపంలో కారును పట్టుకున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు కారు చాషీ కింది భాగంలో రహస్య పెట్టెను ఏర్పాటు చేసి అందులో రెండేసి కిలోల పొట్లాలను 39 పేర్చి, కారులో భార్య, కుమారుడ్ని ఉంచి చేరవేస్తున్నాడని ఎక్సైజ్ సీఐ వివరించారు. నిందితులు డ్రైవర్ కమిడి గోవింద్ (45), అతని భార్య (37), కుమారుడు(6) అదుపులోకి తీసుకుని గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. ఈ అక్రమ రాకెట్ వెనుక ఉన్నది ఎవరున్నారో పరిశీలిస్తున్నామని వివరించారు.



గంజాయి రవాణాకు ఉపయోగించిన కారు

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవం

పెందుర్తి, న్యూస్‌టుడే: పుష్యబహుళ పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పెందుర్తిలోని యజ్ఞవల్క్యపీఠంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం వైభవంగా జరిగింది. శర్వాణీ సంగీత నిలయం, శరణ్య సంగీత పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నోరి లక్ష్మీ గాయత్రి, టీపీ వసంతలక్ష్మీ బృందం పంచరత్న సేవ నిర్వహించారు. త్యాగరాజ కృతులతో శ్రీరామచంద్రుడికి గానార్చన చేశారు. తొలుత త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.



త్యాగరాజ కృతులు గానం చేస్తున్న కళాకారుల బృందం

అమ్మ అనుగ్రహంతోనే.. అయ్యవారి దర్శనం

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: లోకమంతటినీ చల్లగా చూసే అమ్మవారి అనుగ్రహాన్ని పొందడం ద్వారా అయ్యవారి దర్శనం సులభంగా లభిస్తుందని అర్చక స్వాములు వివరించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం వేంకటాద్రిపై గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో అర్చక స్వాములు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి విశేష అర్చనలు చేశారు. శ్రీనివాసుడిని పట్టు వస్త్రాలు, సర్వాభరణాలతో అలంకరించి తిరుప్పావై పాశురాలను విన్నపం చేశారు.



భక్తుల పూజలందుకున్న గోదాదేవి అమ్మవారు

క్రీడలతో మానసిక ఉల్లాసం

పరవాడ, న్యూస్‌టుడే: నిత్యం విధుల్లో ఉండే ఉద్యోగులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం ఎన్.కె.సిన్హా అన్నారు. దీపాంజలినగర్ క్రీడామైదానంలో శనివారం ఎన్టీపీసీ సదరన్ రీజియన్ ఉద్యోగుల క్రీడా పోటీలను ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం క్రికెట్ ఆడి ఉద్యోగుల్లో ఉత్సాహం నింపారు. సదరన్ రీజియన్ క్రీడల్లో సింహాద్రి, కాయికుళం, కుడిగి, రామగుండం, వల్లూరు, హైదరాబాద్ ఎన్టీపీసీలకు చెందిన 120 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో క్రికెట్, టెన్నిస్, మహిళల విభాగంలో టెన్నికాయిట్ పోటీలు మూడు రోజులపాటు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

బెలూన్లు గాల్లోకి వదలి పోటీలను ప్రారంభిస్తున్న జీజీఎం ఎన్.కె.సిన్హా



చంద్రన్న బీమా పరిహారం అందజేత

వేపగుంట, న్యూస్‌టుడే : 69వ వార్డు ముత్యమాంబకాలనీ చెందిన కాపుశెట్టి జగన్(44) పచ్చకామెర్లతో బాధపడుతూ శుక్రవారం మరణించాడు. చంద్రన్న బీమాలో భాగంగా ఆయన భార్య కోలమ్మకు రూ. 5వేలను బీమా కోఆర్డినేటరు అరుణకుమారి, వార్డు తెదేపా కార్యదర్శి దమరసింగ్ శ్రీదేవి అందజేశారు. మిగతా రూ. లక్షా 95వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని శ్రీదేవి తెలిపారు.

నేడు పరవాడలో 5కె రన్

పరవాడ: జన్మభూమి-మావూరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 8గంటలకు పరవాడలో 5కె రన్‌ను నిర్వహించనున్నట్లు తహసీల్దారు మల్లేశ్వరరావు, ఈవోఆర్డీ హేమసుందర్రావు శనివారం తెలిపారు.

తెదేపా హయాంలో యువతకు పెద్దపీట

నరవ (వేపగుంట): తెదేపా హయాంలోనే యువతకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తున్నట్లు అర్బన్ జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు గంతకోరు మాధవరావు అన్నారు. గాజువాక ఆదిత్య కళాశాల ఆధ్వర్యంలో శనివారం నరవలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం నిర్వహించారు. మాధవరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నాయకులు కర్రి రాము, ఒమ్మి సత్యం, లింగం అప్పలరాజు, కళాశాల ప్రిన్సిపల్ ప్రదీప్‌కుమార్, తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న గంతకోరు మాధవరావు

పాడిరైతులకు రాయితీపై గేదెలు అందజేత

పరవాడ, న్యూస్‌టుడే: పాడి రైతుల సంక్షేమం, అభివృద్ధికి విశాఖ డెయిరీ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని వెన్నెలపాలెం సర్పంచి బండారు మాధవీలత అన్నారు. శనివారం వెన్నెలపాలెం పాడిరైతులకు రాయితీపై విశాఖ డెయిరీ సమాకూర్చిన 16మందికి హరియాణా జాతి గెదేలను ఆమె అందజేశారు. పాలసొసైటీ అధ్యక్షుడు పైలా సత్యనారాయణ, ఉపసర్పంచి వెన్నెల అప్పారావు, డెయిరీ సూపర్వైజర్ కృష్ణ పాల్గొన్నారు.



పాడి రైతులకు గేదెలను అందజేస్తున్న సర్పంచి మాధవీలత

రాయితీపై సైలేజ్‌గడ్డి పంపిణీ: పరవాడ మండలం వెన్నెలపాలెం పాడిరైతులకు ప్రభుత్వం 10టన్నుల సైలేజిగడ్డిని సమకూర్చింది. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా గడ్డిని లబ్ధిదారులకు అందజేశారు. కేజిగడ్డి ఖరీదు రూ. 7కాగా రాయితీపోను రూ. 2కే అందజేశారు. పశువైద్యాధికారులు గోపాల్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీనగర్‌లో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

వేపగుంట: గోపాలపట్నం ఆదిత్యడిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వరలక్ష్మీనగర్‌లో శనివారం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాన్ని ప్రారంభించారు. తెదేపా నాయకులు ఎస్.సత్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మురళీమోహనరావు మాట్లాడుతూ వారం రోజులపాటు కాలనీలో విద్యార్థులు సేవలందిస్తారని తెలిపారు. శిబిరం కోఆర్డినేటర్లు అరుణకుమార్, కె.జనార్దనరావు, సి.హెచ్. ఆదిబాబు, కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాలనీవాసులకు 418 చంద్రన్న బీమా బాండ్లను, 54 మంది విద్యార్థులకు ఉపకారవేతనాలు అందజేశారు.

అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం సర్వేనెం. 271 ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు శనివారం ఉక్కుపాదం మోపారు. ఇందులో నిర్మిస్తున్న 7పాకలు, 5 పునాదులను రెవెన్యూ శాఖ అధికారులు పొక్లెయిన్ సహాయంతో తొలగించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాలరాజు, ఆర్ఐ శేషు, రుక్మిణి, వీఆర్‌ఏ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరం సర్వేనెం. 271లో తొలగించిన కట్టడాల పునాదులు



పెందుర్తి

పెందుర్తి సినిమాలు

లక్ష్మీకాంత్ స్క్రీన్ 1: **ఎంసీఏ**

స్క్రీన్ 2: **ఒక్కక్షణం**

నేడు సంక్రాంతి సంబరాలు

లంకెలపాలెం(పరవాడ): జీవీఎంసీ 56వ వార్డు పరిధి మంత్రిపాలెం నిస్ట్ కళాశాలలో ఆదివారం ఉదయం సంక్రాంతి సంబరాలు నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ బి.ఆనంద రావు తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

పరవాడ తాత్కాలిక సీఐగా కృష్ణారావు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ పోలీస్‌స్టేషన్ తాత్కాలిక సీఐగా పి.వి.వి.ఎస్.ఎన్. కృష్ణారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేస్తున్న బి.సి.హెచ్.స్వామినాయుడు కొద్దినెలల క్రితం సిట్‌కు నియమితులయ్యారు. స్వామినాయుడు సిట్‌లో విధులు ముగించుకుని వచ్చే వరకు కృష్ణారావును తాత్కాలిక సీఐగా నియమిస్తున్నట్లు సీపీ యోగానంద్ ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో కృష్ణారావు విశాఖరూరల్ డీటీసీ సీఐగా పని చేశారు.

పేదల సంక్షేమానికి 139 పథకాలు

వెన్నెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం 139 రకాల పథకాలను అమలు చేస్తోందని, వీటిపై అందరూ అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా శనివారం వెన్నెలపాలెంలో జరిగిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం 9 మందికి రేషన్‌కార్డులు, 11 మందికి పింఛన్లు, 103 మంది విద్యార్థులకు రూ.1,23,600 ఉపకారవేతనాలు 45 డ్వాక్రా సంఘాలకు రూ.5.16లక్షల వడ్డీ రాయితీ అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గర్భిణీల సీమంతాల్లో బండారు పాల్గొన్నారు. ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు. ఉపఎంపీపీ చింతకాయల సుజాత ముత్యాలు, సర్పంచి బండారు మాధవీలత, ఎంపీటీసీ సభ్యుడు పైలా రథాల సన్యాసిరావు, మండల ప్రత్యేకాధికారి విజయప్రసాద్, తహసీల్దారు మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

★ రావాడ పంచాయతీలో జరిగిన గ్రామసభలో ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు పాల్గొన్నారు. 10 మందికి రేషన్‌కార్డులు, 32 మందికి పింఛన్లు, 194 మందికి రూ.2,32,800 ఉపకారవేతనాలు, 80 డ్వాక్రా సంఘాలకు రూ.9.07లక్షల వడ్డీ రాయితీ అందజేశారు. సర్పంచి వియ్యపు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కావలి వెంకటలక్ష్మి, ఎంపీడీవో కరుణకుమారి, డీటీ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వెన్నెలపాలెం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

సబ్బవరం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన ద్వారా నెలకు రూ. 10వేల ఆదాయం తగ్గకుండా సంపాదించే మార్గాలను చూపడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆ ఆదాయం నేరుగా రాదన్నారు. ఉదాహరణకు పాడి పరిశ్రమలో రాయితీ గడ్డి (సైలేజ్‌గడ్డి), అజొల్లా వాడటం, మేలుజాతి పశు సంపదను పెంచుకోవడం, దాణాలో మార్పులు చేయడం వంటి విధానాల ద్వారా రూ. 10 వేల ఆదాయం పెంచుకోవచ్చన్నారు. అంతకాపల్లిలో శనివారం జరిగిన జన్మభూమి-మావూరు కార్యక్రమంలో బండారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గర్భిణీలకు జరిగిన సీమంతం కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. రావులమ్మపాలెంలో నిర్మించిన రెండు అంగన్‌వాడీ భవనాలను ప్రారంభించారు.

★ అంతకాపల్లిలో 192 మంది విద్యార్థులకు రూ. 2,30,400 ఉపకారవేతనాలు, 85 డ్వాక్రా బృందాలకు వడ్డీరాయితీ రూ. 6.98లక్షలు, అయ్యన్నపాలెంలో 24 మందికి రూ. 26,300 ఉపకారవేతనాలు, 24 మహిళా సంఘాలకు రూ. 3.21 లక్షల వడ్డీ రాయితీ, అసకపల్లిలో 133 మందికి రూ. 1,59,500 ఉపకారవేతనాలు, 72 మహిళా బృందాలకు వడ్డీరాయితీ రూ. 5.72 లక్షలు, పైడివాడ అగ్రహారంలో 89మందికి రూ. 1,06,800 ఉపకార వేతన చెక్కులు, 52 మహిళా సంఘాలకు వడ్డీ రాయితీ కింద రూ.4.07లక్షల చెక్కులు ఆయా గ్రామ సర్పంచుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.బాబూరావు, తెదేపానేతలు మిడతాడ మహాలక్ష్మినాయుడు, రొంగలి దేముడు, గండిదేముడు, బుచ్చిరాజు, కేఆర్.రాజు, దొడ్డి సూర్యప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.

బంటాకాలనీలో రూ.3కోట్లతో అభివృద్ధి

వేపగుంట: 69వ వార్డు బంటాకాలనీలో రూ. 3 కోట్లు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించింది తెదేపాయేనని వార్డు తెదేపా నాయకులు మామిడి దుర్గాప్రసాద్, తేలసారి కనకరాజు, దమరసింగు శ్రీదేవి, బంటాకాలనీ ఈశ్వరరావు అన్నారు. జన్మభూమి-మావూరు కార్యక్రమంలో భాగంగా మౌలిక సదుపాయాలు అంశంపై శనివారం బంటాకాలనీలో సదస్సు ఏర్పాటుచేశారు. కార్యక్రమం కోఆర్డినేటరు టీపీఎస్ గోపన్న, యూసీడీ అధికారి తిరుమలరావు పాల్గొన్నారు.

ఉగాది నాటికి జన్మభూమి అర్జీల పరిష్కారం



రాంపురంలో గర్భిణీలకు సీమంతాలు చేస్తున్న ఎంపీపీ, అధికారులు

పెందుర్తి, న్యూస్‌టుడే: అయిదో విడత జన్మభూమి సభల్లో ప్రజలు సమర్పిస్తున్న అర్జీలను ఉగాది నాటికి పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పెందుర్తి ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి నారాయణరావు అన్నారు. శనివారం మండలంలోని రాంపురం, పినగాడి గ్రామాల్లో జన్మభూమి- మావూరు సభలు నిర్వహించారు. ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాంపురంలో ఎంపీపీ ఆర్థిక సహకారంతో గర్భిణీలకు చీరలు పంపిణీ చేశారు.

★ రాంపురంలో 56 మందికి వడ్డీలేని రుణాలు, 156 మందికి ఉపకార వేతనాలు, 19 మందికి పింఛన్లు, 16 మందికి రేషనుకార్డులు పంపిణీ చేశారు.

★ పినగాడిలో 6గురికి వడ్డీలేని రుణాలు, 107 మందికి ఉపకార వేతనాలు, 18 మందికి పింఛన్లు, 12 మందికి రేషను కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి పి.ప్రసన్నవాణి, ఐసీడీఎస్ పీడీ చిన్మయీదేవి రాంపురం, పినగాడి సర్పంచులు రెడ్డి నారాయణరావు, బైలపూడి వెంకటలక్ష్మి, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, తహసీల్దార్ లాలం సుధాకర్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణానికి రూ. 22.35 లక్షల విరాళం



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు చెక్కును అందచేస్తున్న మైలాన్ ల్యాబొరేటరీ సంస్థ ప్రతినిధులు

వన్‌టౌన్: పరవాడలో 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి మైలాన్ ల్యాబొరేటరీ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ. 22.35 లక్షల విరాళం అందించింది. మైలాన్ ల్యాబొరేటరీ సంస్థ ప్రతినిధులు వి.మోహన్, సునీల్ వాద్వా, వెంకటఅచ్యుతరాజు, సరస్వతిరావు, బ్రహ్మాజీలు శనివారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి చెక్కును అందించారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

పరవాడ, న్యూస్‌టుడే: గాజువాక-ఎలమంచిలి ప్రధాన రహదారిలో దేశపాత్రునిపాలెం రైల్వేవంతెన వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పి.భోనంగి ఎస్‌జీఎస్ స్కూల్లో పనిచేస్తున్న మౌనిక, రేఖ స్కూటీపై ఉక్కునగరంలోని ఇంటికి వెళ్తుండగా పిట్టవానిపాలెం ఎన్టీపీసీ యాష్‌పాండు నుంచి పైప్‌లైను వేసుకుని ఎన్టీపీసీ కారిడర్ రోడ్డు ద్వారా లంకెలపాలెం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీ లారీ కిందకు వెళ్లిపోయింది. మౌనిక, రూప స్వల్పగాయాలతో బయట పడ్డారు. వెంటనే క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. లారీని పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

శిక్షణ నేర్చుకో... నిన్ను నువ్వు రక్షించుకో...!

పాఠశాలల్లో 8, 9 తరగతి బాలికలకు యుద్ధకళల్లో మెలకువలు

ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు

న్యూస్‌టుడే, గోపాలపట్నం



కరాటేలో మెలకువలు నేర్చుకుంటున్న విద్యార్థినులు

విద్యార్థినులపై తరచూ ఏదో ఒక చోట దాడులు జరుగుతూనే ఉంటున్నాయి. ఎన్ని రక్షణ చర్యలు తీసుకుంటున్నా... ఫలితం కొంతవరకే ఉంటోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల్లోని ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థినిలకు యుద్ధకళల్లో మెలకువలు నేర్పించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఇందుకోసం రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ) ఆధ్వర్యంలో న్యూ ఏపీ తైక్వాండో సంఘం సహకారం అందిస్తోంది. ఆపద ఎదురైనపుడు విద్యార్థినులు వెంటనే తప్పించుకునే ప్రయత్నం చేయాలి. అందుకు శారీరక దృఢత్వంతో పాటు, మానసికస్థైర్యం కలిగి ఉండాలి. ఎదుట వారిని చూసి భయపడకుండా గట్టిగా మాట్లాడటం, అరవడం వంటివి చేయాలి. ఇలాంటి మెలకువలతో పాటు యుద్ధవిద్యల్లోని కొన్ని అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.



అమలు తీరు ఇలా...

- **387** శిక్షణ శిబిరాలున్న ఉన్నత పాఠశాలలు
- **31,969** శిక్షణ పొందుతున్న బాలికలు
- **డిసెంబరు 4, 2017** ప్రారంభమైన తేదీ
- **3 నెలలు** శిక్షణ కాలం
- **సమయం:** రోజూ సాయంత్రం ఓ గంట సేపు
- **అంశాలు:** కరాటే, జూడో, తైక్వాండో, కర్రసాము తదితరాలు

వ్యాయామంతో ఆరోగ్యం మెరుగు

ఆత్మరక్షణ విద్యలో భాగంగా రోజూ యుద్ధకళల్లో శిక్షణ తీసుకోవడంతో పాటు వ్యాయామం చేస్తున్నా. దీంతో నా ఆరోగ్యం మెరుగుపడుతోంది. శిక్షణలోని అంశాలు మాకు అన్ని విధాలా ఉపయోగపడతాయి. చదువుతో పాటు ఇతర అంశాల్లో ఉచిత శిక్షణ ఇవ్వడం బాగుంది.

– ఇ.నీలిమా, 8వ తరగతి, గోపాలపట్నం బాలికోన్నత పాఠశాల



నిధుల మంజూరు ఇలా..

పాఠశాల స్థాయిని బట్టి ఒక్కో పాఠశాలకు మూడు నెలలకు రూ. 9 వేల చొప్పున ఆర్ఎంఎస్ఏ నిధులు కేటాయిస్తున్నారు.

శిక్షణ అనంతరం బాలికలకు ప్రశంసా పత్రాలు అందజేయనున్నారు.

ప్రత్యేక శిక్షకుల సహాయంతో శిబిరాలు నిర్వహిస్తున్నారు.

పబ్లిక్ పరీక్షల దృష్ట్యా పదో తరగతి విద్యార్థినులకు శిక్షణలో అవకాశం కల్పించలేదు.

జీవన నైపుణ్యాల పెంపునకు దోహదం



సమాజంలో జరుగుతున్న ఘటనలను దృష్టిలో ఉంచుకునే మార్షల్ ఆర్ట్స్‌లో బాలికలకు శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థినుల్లో జీవన నైపుణ్యాలు పెంపొందుతాయి. వాళ్లని వాళ్లు రక్షించుకోవడమే కాకుండా, ఆరోగ్యంగా ఉండటానికి కూడా శిక్షణ దోహదపడుతుంది. ఇలాంటి శిక్షణ వల్ల ఏకాగ్రత పెరిగి... అన్ని రంగాల్లో విద్యార్థులు ముందుంటారు.

– స్వర్ణలత, గోపాలపట్నం బాలికోన్నత పాఠశాల, ప్రధానోపాధ్యాయురాలు

శిక్షణ అంశాలు...

ఈ యుద్ధవిద్యలో 'కౌమార దశ బాలికలకు ఆత్మరక్షణ' పేరిట ప్రభుత్వం 27 అంశాలపై దృష్టి పెట్టింది. వాటిలో ప్రధానమైనవి....

సంసిద్ధతా వ్యాయామం: యుద్ధవిద్య నేర్చుకునేందుకు శరీరాన్నివివిధ వ్యాయామాలతో సిద్ధం చేయాలి.

- ఆ తర్వాత పిడికిలి బిగించి కొట్టడంలోని పలు రకాలపై (స్ట్రెయిట్, ఫేస్, లోవర్ పంచ్‌లు) శిక్షణ ఇస్తారు.
- పిడికిలితో పూర్తైన తర్వాత మోకాళ్లతో ప్రత్యర్థులపై ఎలా దాడి చేయాలో నేర్పిస్తారు.
- రెండో దశలో ప్రత్యర్థి చేసే దాడిని ఎలా ఎదుర్కోవాలి, వారి నుంచి తెలివిగా ఎలా తప్పించుకోవాలో నేర్పిస్తారు.
- వివిధ కిక్‌ల సాయంతో ప్రత్యర్థిపై దాడి చేయడంతో పాటు వారిని ధైర్యంగా ఎదుర్కోవడంలో మెలకువలు నేర్పిస్తారు.
- మోచేతులతో ప్రత్యర్థులపై ఎలా దాడి చేయాలి, వారి నుంచి ఎలా తప్పించుకోవాలనే అంశాలపై శిక్షణ ఇస్తారు.
- దాడిని ఎదుర్కోవడంతో పాటు దాడి చేయడంపై శిక్షణ ఇస్తారు



కరపత్రంలో మెలకువలు తెలియజేసే చిత్రాలు

శక్తిసామర్థ్యాలు పెంచవచ్చు



రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కరపత్రం

బాలికల్లో శక్తిసామర్థ్యాలు పెంచడానికే ఈ శిక్షణ కొనసాగిస్తున్నాం. ఎదుటి వారిని ఎదుర్కొనే శారీరక దృఢత్వం లేకపోవడంతోనే చాలామంది దాడుల బారిన పడుతున్నారు. శారీరకంగా బలంగా ఉన్నప్పుడు మానసిక స్థైర్యం పెరుగుతుంది. ఎవరైనా దాడికి పాల్పడితే... వెంటనే తమను తాము రక్షించుకోగలుగుతారు.

- ఎస్. సాంబశివరావు, ఎంఈవో, చినగదిలి

మనో ధైర్యం ఏర్పడుతుంది

నేటి సమాజంలో బాలికలకు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొనేందుకు నేర్పిస్తున్న ఆత్మరక్షణ విద్య బాగుంది. ఇందులో నేర్చుకున్న మెలకువలతో ఇకపై స్వేచ్ఛగా తిరగొచ్చు.

– బి.సంతోషి, 9వ తరగతి, గోపాలపట్నం బాలికోన్నత పాఠశాల





కరాటేతో నూతనోత్సాహం

కరాటే నేర్చుకోవడంతో బాలికల్లో నూతనోత్సాహం ఏర్పడుతుంది. పాఠశాలల్లో మా సంఘం ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణ నేర్చుకునేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఇక్కడ మెలకువలు నేర్చుకున్న బాలికలు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీలకు కూడా వెళ్లవచ్చు. పాఠశాల స్థాయి నుంచే కరాటే విద్య నేర్చుకోవడం వల్ల భవిష్యత్తులో అనేక ఉపయోగాలు ఉంటాయి.

–బి. ఆనందరావు, జిల్లా తైక్వాండో సంఘం ప్రతినిధి, కరాటే కోచ్



నగరంలో ఈ-జోన్



ఆకర్షణీయ నగరంగా ఎదుగుతున్న విశాఖలో విద్యుత్తు వాహనాల వినియోగంపై కసరత్తు మరింత ముమ్మరమైంది. ఈ వాహనాలను విక్రయించేందుకు రెండుమూడు కంపెనీలు సంసిద్ధంగా ఉన్నాయి. విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటుపై అవి మంతనాలు జరుపుతున్నాయి. మరోవైపు వాహనాలను నడపడానికి వీలుగా ప్రత్యేక మార్గదర్శకాల కోసం ఆయా శాఖలు కూడా చర్చలు జరుపుతున్నాయి.

నగరానికి రానున్న విద్యుత్తు వాహనాలు

కార్యాచరణపై అధికారుల కసరత్తు

దేశానికే ఆదర్శంగా నిలిచేలా రూట్ మ్యాప్

ఈనాడు-విశాఖపట్నం

ప్రాధాన్యాలు ఇవీ...

విద్యుత్తు ఆధారంగా నడిచే వాహనాల్ని తీసుకురావటం వెనుక అసలు ఉద్దేశం.. కాలుష్య సమస్యను పరిష్కరించడం. దీన్ని ఇపుడు అదుపు చేస్తేనే భవిష్యత్తులో విశాఖ హరిత నగరంగా రూపుదిద్దుకునే అవకాశం ఉంది. రద్దీ ప్రాంతాల్లో రహదారులను పునర్నిర్మించి అక్కడ వాహనాల వేగం పెరిగేలా మార్పులూ చేయనున్నారు.

దేశానికే మార్గం చూపనుందా...

ఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్తు మిగులు ఉంటోంది. విశాఖ నగరంలో విద్యుత్తు వాహనాల్ని తీసుకురావడానికి ఇదీ ఓ కారణం. విద్యుత్తు ఆధారిత ద్విచక్ర, త్రిచక్ర, కార్లు లాంటివి తెచ్చేందుకు ఇది అనుకూలమైన పరిస్థితి అని అధికారులు చెబుతున్నారు. తద్వారా దేశంలోని ఇతర నగరాలకు చక్కటి మార్గం చూపే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తొలుత.. ద్వి, త్రిచక్ర వాహనాలు

విద్యుత్తు వాహనాల ప్రవేశం ఎలా ఉండాలన్నదానిపై ఇప్పటికే ఒక రూట్‌మ్యాప్ తయారైంది. ఆకర్షణీయ నగర ప్రణాళికకు అనుగుణంగా దీన్ని అధికారులు రూపొందించారు. తొలి విడతలో ద్విచక్ర, త్రిచక్ర వాహనాల్ని ప్రవేశపెట్టాలని యోచిస్తున్నారు.

★ తొలుత ప్రయోగాత్మకంగా మొదలుపెట్టనున్నారు. ముందుగా ఓ ప్రాంతాన్ని ఎంపిక చేసి.. 'ఈ-జోన్'గా ప్రకటించేందుకు కార్యాచరణ రూపొందిస్తారు. దీనిపై విస్తృత ప్రచారం చేస్తారు. అనంతరం విద్యుత్తు వాహనాలకు అవకాశం ఇస్తారు. అవసరం ఉన్నచోట విద్యుత్తు ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు.

★ వాహనాలు పెరిగే కొద్దీ ఛార్జింగ్ స్టేషన్లను పెంచేందుకు ప్రణాళికలు నడుస్తున్నాయి.

★ ఇక్కడ ఈ ప్రక్రియ విజయవంతమైతే క్రమేణా నగరమంతటా విస్తరిస్తారు. ఇది విడతలవారీగా జరుగుతుంది.

పదేళ్ల లక్ష్యం...

ఈ వ్యవస్థను తీసుకురావడానికి ఐదేళ్ల నుంచి పదేళ్ల సమయం పడుతుందని అధికారుల అంచనా. ఈ వ్యవస్థకు సంబంధించిన నియమ నిబంధనల్ని, చట్టంలో సవరణల్ని తీసుకురావాల్సిన అవసరముందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. రవాణాశాఖ, జీవీఎంసీ, ఈపీడీసీఎల్, కాలుష్యనియంత్రణ మండలి.. ఇలా పలుశాఖల్ని కలుపుకొని వెళ్లేందుకు కార్యాచరణ నడుస్తోంది. ప్రయోగాత్మక ప్రక్రియ అమల్లోకి వచ్చిన తర్వాత కాలుష్యం మీద కూడా పరిశీలనలు ఉంటాయి.



నగరంలోని వాహనాల రద్దీ ఇలా...



కొత్తగా...

240 వోల్ట్‌ల స్టేషన్లు..

విద్యుత్తు వాహనాల్ని ఛార్జింగ్ చేయడానికి ఏర్పాటు చేయబోయే ఛార్జింగ్ స్టేషన్లపై కూడా ఓ స్పష్టత వచ్చింది. వాహనాల్ని ప్రవేశపెట్టినచోట్ల 240 వోల్ట్‌ల విద్యుత్తును డీసీగా మార్చి, వేగంగా ఛార్జింగ్ చేసే స్టేషన్లను తెచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. ఇవి ఖరీదుతో కూడుకున్నవని చెబుతున్నారు. వాహనాల్ని బట్టి ప్రధాన రహదారులు, ఇళ్ల సముదాయాలు, వాణిజ్య సముదాయాల దగ్గర్లో ఈ స్టేషన్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆ తర్వాత రాత్రంతా ఛార్జింగ్ చేసుకునే వసతులూ రానున్నాయి.



బీచ్‌రోడ్డులో బస్సులు...



★ విద్యుత్తుతో నడిచే బస్సులనూ విశాఖకు రప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్మార్ట్‌సిటీలో భాగంగా బీచ్‌రోడ్డులో పర్యాటకానికి అనుబంధంగా వీటిని ప్రవేశపెట్టాలన్న ప్రతిపాదన ఉంది. విశాఖ పోర్టు నుంచి రుషికొండ వరకు నడపాలన్నది ఆలోచన. ఆ తర్వాత భీమిలి వరకు పొడిగిస్తారు.

★ ఈ బస్సులను బీఆర్‌టీఎస్‌లోనూ నడపాలన్నది అధికారులు ఆలోచిస్తున్నారు. మధురవాడ నుంచి భోగాపురం వరకు మాస్ ర్యాపిడ్ రవాణా వ్యవస్థ తీసుకురానున్నారు. ఇది భోగాపురం విమానాశ్రయానికి అనుబంధంగా ఉంటుంది. ఇక్కడా ఈ బస్సుల్ని ప్రవేశపెడతారు. దీనికి బాగా సమయం పడుతుంది.

చట్టసవరణపై సమాలోచనలు..

ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలకు మొదటి ఐదేళ్లపాటు పన్ను మినహాయింపు ఉంటుంది. ఆ తర్వాత జీవితకాల పన్ను ఎంత విధించాలనేది నిర్ణయించాల్సి ఉంది. ఈ వాహనాలకు రిజిస్ట్రేషను ఎలా చేయాలి? అనుమతులు ఎలా ఉండాలనేవీ నిర్ణయం కాలేదు. ఇదివరకు ఉన్న రవాణా చట్టాన్ని సవరణలు చేసేందుకు అధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

నిబంధనలపై నెలరోజుల్లో స్పష్టత...



నగరానికి విద్యుత్తు వాహనాలను తీసుకురావాలన్న నిర్ణయం తీసుకున్నాం. అవి వచ్చే ముందే కచ్చితమైన విధి విధానాలు వెల్లడించాల్సి ఉంది. వీటిపై రవాణాశాఖ కసరత్తు చేస్తోంది. మరో నెలరోజుల్లో దీనిమీద ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వనుంది. ఆ తర్వాత ఈ వాహనాల మీద మరింత ప్రచారం చేసేందుకు వీలుంటుంది. ఇప్పుడున్న వాహనాలకు అమలంధనలైతే ఉన్నాయో, విద్యుత్తు వాహనాలకు అవే నిబంధనలు వర్తింపచేయాల్సి ఉంది.

– ఎస్.వెంకటేశ్వరరావు, డీటీసీ



ఇదో మంచి పరిణామం..

విశాఖలో విద్యుత్తు వాహనాల్ని తీసుకొచ్చే ప్రణాళికలు చేయడానికి సింహాద్రి ఎన్టీపీసీ కూడా కీలక కారణమవుతోంది. ఇప్పటికే ఇక్కడ 2 వేల మెగావాట్ల విద్యుత్తు ప్లాంటు ఉంది. దీని సామర్థ్యాన్ని 4 వేల మెగావాట్లకు పెంచనున్నారు. పూడిమడకలో అదనంగా 4 వేల మెగావాట్ల విద్యుత్తు ప్లాంటును ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్తు తయారీపరంగా గణనీయ వృద్ధి కనిపించనుంది.

నగరంలో

10,95,657	ద్విచక్రవాహనాలు
1,25,374	కార్లు, ఇతర నాలుగుచక్రాల వాహనాలు
44,345	ఆటోలు
15,36,492	నగరవ్యాప్తంగా మొత్తం వాహనాలు



పరిశీలన చేస్తున్నాం..



విద్యుత్తు వాహనాలు నగరంలో ఎక్కడెక్కడ ప్రవేశపెట్టే అవకాశం ఉందనే విషయమై జీవీఎంసీ పరిశీలనలు చేస్తోంది. రెండు సంస్థలు క్షేత్రస్థాయిలో పర్యటించి అనువైన ప్రాంతాలపై నివేదిక ఇస్తాయి. దీనికి కొంత సమయం పడుతుంది. ఆ తర్వాత అక్కడ ఏం చేయాలనే కార్యచరణను వెల్లడిస్తాం.

– ఎం.హరినారాయణన్, జీవీఎంసీ కమిషనర్

అందంగా... ఆకట్టుకునేలా...

ఒక ఆలోచన వాహన రూపురేఖలనే మార్చేసింది. రవాణాకు మాత్రమే వినియోగించే వాహనాలను ఇటీవల కొందరు వ్యక్తులు తమ అవసరాలకు తగిన విధంగా మార్చేస్తున్నారు. వైవిధ్యంగా రూపొందించిన వాహనాలను వ్యాపారం, ఆధ్యాత్మికం... ఇతర ప్రచార కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారు. అలా అందంగా... ఆకట్టుకునేలా ఉన్న వాహనాలు విశాఖలోని పలు ప్రాంతాల్లో తిరుగుతూ అందరినీ ఆకర్షిస్తున్నాయి. - చిత్రాలు: నాయుడు, విశాఖపట్నం



ఏయూ మైదానంలో.. బ్యాంకు పథకాల ప్రచారం




రామ్‌నగర్‌లో ఐస్‌క్రీమ్ వాహనం



నడిచే ఏటీఎం కేంద్రం

క్లిక్... క్లిక్...



విశాఖ-అనకాపల్లి రహదారిలో ఆధ్యాత్మిక వాహనం

హస్తకళా వైభోగం... చేనేతకు రాజసం

న్యూస్‌టుడే, ఏయూ ప్రాంగణం

విశాఖ

ఏటికొప్పాక లక్కబొమ్మలు.. తంజావూరు దీపారాధన వస్తువులు.. ఆకర్షిస్తున్న కొబ్బరి ఇళ్లు.. రంగురంగుల తివాచీలు.. వినియోగదారుల మదిని దోస్తున్నాయి. ఇవే కాదు.. ఎన్నోరకాల వస్తువులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. కొన్ని వస్తువులను అక్కడే తయారు చేసి ఇస్తున్నారు. ఇవన్నీ ఒకేచోట దొరుకుతున్నాయి.

ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో ప్రారంభమైన క్రాఫ్ట్ బజార్‌లో పలు రకాల హస్త కళలు, చేనేత వస్త్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో కొబ్బరి బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో కొబ్బరి పీచుతో తయారు చేసిన పలు రకాల ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. చేతి వృత్తి కళాకారులు నైపుణ్యానికి ఇవి ప్రతీకగా నిలిచాయి. ఏటి కొప్పాక బొమ్మల నుంచి చేనేత వస్త్రాలవరకు ప్రతి స్టాల్ ప్రత్యేకమైనదిగా నిలిచాయి.

మగ్గం వర్క్... : విశాఖ మద్దిలపాలెం నివాసి పిఎస్‌వి పద్మావతి మగ్గం వర్క్‌తో మహిళా ఫ్యాషన్ రంగంలో విశేషంగా కృషి చేస్తున్నారు. దాదాపు 12 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వినియోగదారులు ఇచ్చిన జాకెట్‌లు, చీరలపై అద్భుత డిజైన్లను రూపొందించి ఆ వస్త్రాలకు వన్నె తెస్తున్నారు. వేయి రూపాయల నుంచి రూ. 10 వేల వరకు జాకెట్ తదితరాల ఆకర్షణీయతకు వెచ్చిస్తున్నారు. వివాహాలు, వేడుకలకు ఇటువంటి వస్త్రాలను ధరిస్తుంటారని పద్మావతి తెలిపారు.



పద్మావతి సూచనల మేరకు మగ్గం వర్క్ చేస్తూ..

దీపారాధన వస్తువులు...: తంజావూరు దీపారాధన సామగ్రి తయారీకి పెట్టింది పేరు. వాటిని ఈ బజార్‌లో అందుబాటులో ఉంచారు.

పది నిమిషాల్లో చిత్రం..: చేతి కళల్లో చిత్రకళ చాలా ప్రముఖమైనది. చేతితో ఎదుటి మనిషి చిత్తరువును పది నిమిషాల్లో గీసే కళాకారులు ఎందరో ఉన్నారు. ఈ తరహాలోనే బీఎఫ్ఏ పూర్తిచేసిన గాజువాకకు చెందిన చిత్రకారుడు కర్రి కృష్ణ క్రాఫ్ట్ బజారులో క్షణాల్లో చిత్రాలను గీసి అందిస్తున్నారు.



కొబ్బరితో చేసిన వివిధ రకాల డిష్‌లు



రంగు రంగుల ఫ్లవర్‌వాజ్‌లు, బొమ్మలు ఇవన్నీ కొబ్బరి ఉత్పత్తులే

అరకు దారిలో... నయా దోపిడీ...

(మొదటి పేజీ తరువాయి) ఉండే రైలు ఎక్కేందుకే మక్కువ చూపుతారు. దీన్ని ఏపీ పర్యాటక శాఖ అవకాశంగా తీసుకుంటోంది. ముందుగా రైల్వే అధికారులను సంప్రదించకుండా ప్రత్యేక ప్యాకేజీల పేరుతో పర్యాటకులకు ఎర వేస్తోంది. వారు అధిక సంఖ్యలో వచ్చినపుడు దందాకు పాల్పడుతోంది.

జరుగుతోంది ఇదీ...: అరకు ప్యాకేజీ పేరుతో ఒక్కో పర్యాటకుడి నుంచి రూ. వెయ్యి చొప్పున ఏ.పి టూరిజం శాఖ వసూలు చేస్తోంది. 'ప్రత్యేక బోగీలో ప్రయాణం' అంటూ పర్యాటకులను నమ్మబలుకుతోంది. ఆనక ఆ పర్యాటకులకు ఒక్కొక్కరికీ రూ. 30 చెల్లించి సాధారణ(జనరల్) టిక్కెట్లనే తీసుకొని వారిని టూరిజం శాఖ ఉద్యోగులు రైల్వేస్టేషన్‌లోకి చేరుకుంటున్నారు. ఇక్కడే అసలు కథ మొదలవుతోంది. రైలు వచ్చీ రాగానే ఆ శాఖ ఉద్యోగులు ఒక బోగీలోకి ఎక్కేసి తలుపులు మూసేస్తున్నారు. ఎవరైనా దానిలోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తే.. "ఇది పర్యాటకుల కోసం ముందుగా బుక్ చేసుకున్న ప్రత్యేక బోగీ.. దీనిలోకి సాధారణ ప్రయాణికులు ఎక్కకూడదు.." అంటూ గద్దించి పంపేస్తున్నారు. ఇంతలో మరికొంత మంది సిబ్బంది తమ పర్యాటకులకు రైలుబండిలో సీటు నెంబర్లను టిక్కెట్ కాగితం వెనుక రాసి ఇస్తున్నారు. సిబ్బంది చూపిన బోగీలో వాళ్లంతా ఎక్కి ఆయా నెంబర్ల సీట్లలో కూర్చుంటారు. అయితే ఈ బోగీ వద్దకు మిగిలిని సాధారణ ప్రయాణికులు ఎవరు వచ్చినా... తలుపు వద్ద కాపు కాసిన ఏపీ టూరిజం సిబ్బంది వారిని దబాయించి పంపేస్తున్నారు.

ఎవరెవరి పాత్ర ఏమిటి?: వాస్తవానికి ఏపీ టూరిజం శాఖకు తూర్పు కోస్తా రైల్వే ఏ విధమైన ప్రత్యేక బోగీని కేటాయించకపోయినప్పటికీ దాదాపు రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతుండటం గమనార్హం. ఈ విషయం రైల్వే స్టేషన్‌లో పలువురు ఉన్నతాధికారుల నుంచి దిగువ స్థాయి సిబ్బంది వరకు. . అటు కార్యాలయంలో పలువురు ఉన్నతాధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల 'ఈనాడు' ప్రచురితమైన 'పర్యాటకమా..? ప్రయాసా..?' అనే శీర్షికన వెలువడిన కథనానికి స్పందించిన జీఆర్పీ పోలీసులు సంబంధింత సిబ్బందిని అదుపులోకి తీసుకొని విచారించి విడిచిపెట్టినప్పటికీ మళ్లీమళ్లీ ఇదే తంతు సాగుతుండటం గమనార్హం.

రైల్వే ఆదాయానికి గండి..: మరో వైపు నిత్యం గిరాకీ ఉండే ఈ రైలులో ఒక బోగీని ప్రత్యేకంగా బుక్ చేసుకుంటే రూ. వేలలో రైల్వేకి చెల్లించాల్సి ఉంటుంది. కేవలం రూ. 30 టిక్కెట్ తీసి.. స్టేషన్‌లోని కొందరు రైల్వే అధికారుల చేతులు తడుపుతూ తమ అక్రమాల్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరూ ప్రశ్నించకపోవడంతో ఏపీ టూరిజం అధికారులు దీన్ని ఓ కొత్త ఆదాయ వనరుగా కూడా పరిగణిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు స్పష్టమవుతోంది. దీనివల్ల రైల్వే శాఖ ఆదాయానికి భారీగా నష్టం వాటిల్లుతోంది.

కిక్కిరిసే ప్రయాణాలు...: అరకు రైలుకు శీతాకాలం, దసరా సెలవుల సమయంలో విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీనికి ఉండే ఏడు బోగీలు కూడా నిండిపోయేంతమంది ప్రయాణికులు విశాఖ స్టేషన్‌కు చేరుకుంటారు. ఒక బోగీని పూర్తిగా ఏపీ టూరిజం శాఖ ఆక్రమించేస్తుండటంతో మిగిలిన 6 సాధారణ బోగీల్లోనే పర్యాటకులు సర్దుకోవాల్సి వస్తోంది. మరోవైపు రైలు వెళ్లిపోయాక కూడా చాలామంది ప్రయాణికులు ప్లాట్‌ఫామ్‌పైనే నిలిచిపోవాల్సి వస్తోంది.

ఆ వారం తప్ప...: ఇటీవల కేకే లైన్ మరమ్మతులకు గురికావడంతో ఓ ప్రత్యేక రైలును నడిపాం. దానికి సంబంధించి ఒక వారం రోజుల కోసం ఏపీ టూరిజం శాఖతో ఒప్పందం చేసుకున్నాం. అది అప్పుడే ముగిసిపోయింది. 2009 తరువాత ఏపీ టూరిజంకు తూర్పు కోస్తా రైల్వేకి ఏ విధమైన ఒప్పందం లేదు. – ***రైల్వే అధికారులు***

అర్జీ పెట్టాం...: ఆంధ్రప్రదేశ్ టూరిజం శాఖకు అరకు రైలులో ప్రత్యేక బోగీ కేటాయించాలని రైల్వే శాఖకు అర్జీ పెట్టాం. దానికి ఇంకా అనుమతి రాలేదు. మరోసారి రైల్వే శాఖతో మాట్లాడతాం.

– ***ప్రసాద్‌రెడ్డి, డివిజనల్ మేనేజర్***

వారి దారి.. అడ్డదారి!

(మొదటి పేజీ తరువాయి) నుంచి రూ. కోట్ల విలువైన దుస్తులను రైలు మార్గంలో నగరం మీదుగా తరలిస్తున్నారు. కొంత సరకు నగరంలోని పలు ప్రాంతాలకు చేరుకుంటుంటే మరికొంత ఇతర జిల్లాలకు వెళ్తోంది. గత కొద్దిరోజులుగా తనిఖీలు చేస్తున్న పన్నులశాఖ అధికారులు కేసులు నమోదు చేశారు.

నగరంలోని ఓ దుకాణానికి వినియోగదారుడ్ని పన్నులశాఖ అధికారులే పంపారు. ఆ వ్యక్తితో కొంత విద్యుత్తు సామగ్రి కొనిపించారు. బిల్లు అడిగితే ఆ వ్యాపారి ఇవ్వలేదు. రంగంలోకి దిగిన అధికారులు కేసు నమోదు చేశారు.

బిల్లులివ్వకుండా వ్యాపారాలు జరిగిపోతున్నాయి.. పన్ను చెల్లించకుండానే సరకులు హద్దులు దాటిపోతున్నాయి. అది రహదారి మార్గమైనా.. రైలు మార్గమైనా.. అంత అడ్డదారే. అడిగితేనే బిల్లు.. లేదంటే తెరచాటు వ్యాపారమే.. ఇదీ విశాఖ నగరం సహా గ్రామీణ జిల్లాలోని పరిస్థితి. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) పరిధిలోకి రాకుండా కొంతమంది తెరవెనుక ఈ తంతు నడిపిస్తున్నారు. ఆశించిన ఆదాయం రాకపోవడంతో పన్నులశాఖ అధికారులు రంగంలోకి దిగి గుట్టు రట్టు చేస్తున్నారు.

రాష్ట్ర పన్నుల శాఖ విశాఖ డివిజన్ పరిధిలో పన్ను ఎగవేతదారులు, బిల్లులివ్వకుండా అక్రమ వ్యాపారాలు చేస్తున్నవారిపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. వాహనాల తనిఖీ సహా రైల్వే స్టేషన్లు ఇతర రవాణా మార్గాలపైనా దృష్టి సారించారు. ఇప్పటికే వస్త్ర, ఫర్నిచర్, ఎలక్ట్రికల్, ప్లైవుడ్ తదితర వ్యాపారులపై కేసులు నమోదయ్యాయి. జాతీయ రహదారి, రైల్వేస్టేషన్లలో అనధికార సరకు అధికారులకు చిక్కింది. విశాఖ రైల్వేస్టేషన్లో కంటైనర్ల డెలివరీ సౌకర్యం ఉండడంతో నిఘా వేసి.. బిల్లుల్లేని వ్యాపారాలను గుర్తించారు. నగరంలో ఇప్పటికీ కొన్ని ఆహారశాలలు, వ్యాపార దుకాణాల వద్ద కంప్యూటర్ బిల్లులకు బదులు చేతి బిల్లులే ఇస్తున్నారు. వీటికీ జీఎస్టీ అదనం అంటూ వసూలు చేస్తున్నారు. ఈ వ్యాపారానికి లెక్కాపత్రం ఉంటుందా..? లేదా..? అన్న అనుమానం వినియోగదారుల్లో వ్యక్తమవుతోంది.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం..: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) విధానం తెరపైకి వచ్చి చాలా రోజులైనా ఇటు ప్రజల్లో.. అటు వ్యాపారుల్లో ఇంకా అయోమయం వీడలేదు. కొన్ని వస్తువులపై పన్ను భారం తగ్గినా.. ఆ లబ్ధి వినియోగదారులకు చేరడం లేదన్న అభిప్రాయం ఉంది. వ్యాపారుల పరంగా గతంలో ఉన్న ఇబ్బందులు ఇపుడు తొలగిపోయాయి. గతంలో రిటర్న్స్ దాఖలు క్రమంలో పలు పత్రాలు, రకరకాల కాలమ్స్ నింపాల్సి వచ్చేది. వివిధ ఆధారాలు సమర్పించాల్సి వచ్చేది. ఇప్పుడీ ప్రక్రియ సరళతరంగా మారింది. అయినా.. ఇంకా చాలా మంది వ్యాపారులు పన్ను పరిధిలోకి రావడానికి ఇష్ట పడడం లేదు. రిటర్న్స్ దాఖలులోనూ వెనుకబాటే కనిపిస్తోంది. సరకులు ఎగుమతులు చేసేవారు గతంలో ప్రతి ఆర్డర్‌కు బాండ్, బ్యాంకు గ్యారంటీ ఇవ్వాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవడం వారికి ఊరటగా ఉంది. జీఎస్టీపై మరింత స్పష్టత వస్తే బాగుంటుందనే వాదన అధికారుల్లోనూ ఉంది.

★ విశాఖ డివిజన్ పరిధిలో జీఎస్టీ పరిధిలోకి 35 వేల మంది వ్యాపారులొచ్చారు. వీరిలో 65 శాతం మందే రిటర్న్‌లు దాఖలు చేశారు. ఇవి దాఖలు చేయాలంటే పన్ను కట్టడం తప్పనిసరి కావడంతో మిగిలినవారు వెనకాడుతున్నారు.

★ 3బీ రిటర్న్స్ దాఖలు చేయాల్సిన కంపోజిషన్ డీలర్లూ ఆసక్తి చూపడంలేదు. దీనికి జనవరి 20 వరకు గడువు ఉన్నందున ఆలోగా చెల్లింపులు జరుగుతాయని అధికారులు ఆశిస్తున్నారు.

చట్టబద్ధంగా వ్యాపారం సాగాలి..: వస్తు సేవల పన్ను అమల్లోకొచ్చాక ఇటు వ్యాపారులు, అటు ప్రజలకు వెసులుబాటు కలిగింది. సమస్యలుంటే యాంటీ ప్రాఫిటరీ కమిటీకి ఫిర్యాదు చేయొచ్చు. వాహనాలు, దుకాణాల్లో తనిఖీల ద్వారా గుర్తించిన లోపాలపై చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల విశాఖ రైల్వేస్టేషన్లో బిల్లుల్లేకుండా తరలిపోతున్న వస్త్రాల బేళ్లను స్వాధీనం చేసుకుని అపరాధ రసుము విధించాం. విశాఖ డివిజన్‌లో జీఎస్టీ వసూలులో 30 శాతం వృద్ధి ఉంది. నెలకు రూ. 170 కోట్ల వసూలు లక్ష్యం కాగా.. రూ. 200 కోట్ల వరకు వసూలవుతోంది. జీఎస్టీపై అనుమానాలున్నవారికి నివృత్తి చేస్తున్నాం.

– కె.నాగేంద్ర, సంయుక్త కమిషనర్, రాష్ట్ర పన్నులశాఖ

రండి.. శిక్షణ పొందండి

- **ఎగుమతి-దిగుమతి వ్యాపారావకాశాలపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు వర్క్‌షాప్**
- **ఈనాడు-ఈతరం క్లబ్ ఆధ్వర్యంలో**

హైదరాబాద్: అంకుర సంస్థలు ఏర్పాటు చేసి, ఎగుమతి, దిగుమతి వ్యాపారం చేయాలనుకునే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు 'ఈనాడు-ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో బిజినెస్ వర్క్‌షాప్ (వ్యాపార కార్యశాల) నిర్వహించనున్నారు. జనవరి 26 నుంచి 28వ తేదీ వరకు ఈ వర్క్‌షాప్ విశాఖపట్నం డాబా గార్డెన్స్‌లోని డాల్ఫిన్ హోటల్‌లో జరగనుంది. మూడు రోజుల పాటు, రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారు. అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలతో పాటు అంతర్జాతీయ వాణిజ్య పరిస్థితులు ఏ వ్యాపారాలకు అనుకూలంగా ఉన్నాయో తెలుపుతారు. కొత్త సంస్థ ఏర్పాటుకు అనుసరించాల్సిన విధానాలు, లైసెన్సులు పొందడం ఎలానో విశదీకరిస్తారు. ఏ ఉత్పత్తికి సంబంధించి వ్యాపారం చేస్తామో, దాని విశ్వసనీయ ఖాతాదారులు, సమాచారం పొందడం ఎలానో నేర్పుతారు. ఎగుమతులు/ దిగుమతుల ధరలు, కాంట్రాక్టులు ఎలా చేసుకోవాలి, అంతర్జాతీయ చెల్లింపులు- లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌సీ), రుణం పొందడం ఎలా, సురక్షితంగా చెల్లింపులు ఏ విధంగా పొందొచ్చు, కస్టమ్ అనుమతులు పొందడం, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలను తమ వ్యాపారాలకు ఎలా వేదికగా చేసుకోవచ్చో వివరిస్తారు. ఈ శిక్షణకు రుసుము రూ. 9500. మరిన్ని వివరాలకు 8008551049, 9100024089 నెంబర్లలో సంప్రదించవచ్చు.

గమనిక: ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 56263579 కు SMS చేయండి. ఉదా: VSP2 EXIM B.SRINIVAS

Online payments: http://crm.eenadu.net/vk

గురజాడ కళాక్షేత్రం సిద్ధం

ప్రాంగణం: *గురజాడ కళాక్షేత్రం,*

నిర్మాణ వ్యయం: *రూ. 9.80 కోట్లు,* ***సామర్థ్యం:*** *2,300 మంది కూర్చుని కార్యక్రమాలు వీక్షించే వీలు*

నిర్మాణ ప్రత్యేకతలు: ఇజ్రాయిల్ నుంచి దిగుమతి చేసిన పోలీ కార్బొనేట్ పైకప్పు.. హై క్వాలిటీ స్టీరియో సౌండ్ సిస్టమ్.. ఎలక్ట్రానిక్ సౌకర్యంతో కూడిన తెరలు..

కార్యక్రమాలు ఇలా..: ప్రతి శుక్రవారం 'వుడా వినోదవారం'గా విశాఖ నగరాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన. స్థానిక కళా ప్రదర్శనలు సహా జాతీయ, అంతర్జాతీయ స్థాయి సాంస్కృతిక ప్రదర్శనలకు కూడా ప్రత్యేక సందర్భాల్లో అనుమతులు. వాణిజ్యపరమైన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రైవేటు కార్యక్రమాలకూ అద్దెకు ఇస్తారు. పదేళ్లు పైబడి అనుభవం ఉన్న ప్రముఖ కళా సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి అవసరమైనప్పుడు కళా ప్రదర్శనలు ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉంది.

ఇక సాంస్కృతిక శోభ.. : సిరిపురం కూడలిలో.. విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (వుడా) ఉద్యోగ భవన్‌కు ఎదురుగా గురజాడ కళాక్షేత్రం పునర్నిర్మాణం పూర్తయింది.. ఆధునిక హంగులతో ప్రాంగణం సిద్ధమయ్యింది. ఈ నెల 17న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా కళాక్షేత్రాన్ని ప్రారంభించేందుకు విశాఖ నగరాభివృద్ధి సంస్థ (వుడా) సన్నాహాలు చేస్తోంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 2015 వరకు ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంగా ఉన్న గురజాడ కళాక్షేత్రాన్ని పై కప్పుతో పునరుద్ధరించాలని వుడా పనులు ప్రారంభించినా.. ప్రణాళికలో మార్పులు.. నిర్మాణ వ్యయం పెరగడం వల్ల జాప్యం జరిగింది. ఎట్టకేలకు అన్నీ కొలిక్కి వచ్చి ఇన్నాళ్ల నిరీక్షణకు తెరపడినట్లయ్యింది. కళా రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చే ఉద్దేశంతో వుడా నిర్మించిన ఈ ప్రాంగణంలో కార్యక్రమాలు సాహితీ ప్రియులను అలరించనున్నాయి. ఈ కళాక్షేత్రం అందుబాటులోకి వస్తే స్మార్ట్ సిటీలో. . కళా ప్రదర్శనలకు అనుకూలమైన వేదిక లేని సమస్య తీరినట్లే.. అద్దె ధరలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. వుడా బాలల ప్రాంగణం, గురజాడ కళాక్షేత్రం పక్కనేఉండడంతో ఈ మధ్య భాగంలోని ఖాళీ ప్రాంతంలో బహుళ అంతస్థుల పార్కింగ్ ప్రాంగణం నిర్మాణానికి వుడా సన్నాహాలు చేస్తోంది. దీని నిర్మాణమూ పూర్తయితే మరింత సౌకర్యంగా ఉంటుందని అంతా భావిస్తున్నారు. – **ఈనాడు, విశాఖపట్నం**

నువ్వా... నేనా?!

'స్ప్రైట్ ఈసీసీ కప్-2017' క్రికెట్ పోటీల్లో తుదిపోరుకు సిద్ధమైన జట్లు

▌సీనియర్స్‌లో ప్రిజమ్ × టీఎస్ఆర్ అండ్ టీబీకే ▌జూనియర్స్‌లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య × సాయిగణపతి పాలిటెక్నిక్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: తుది పోరుకు రంగం సిద్ధమైంది. మెగా టోర్నీలో ఛాంపియన్‌గా నిలిచేదెవరో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. గత కొద్ది రోజులుగా అలుపెరగని పోరాట పటిమతో ప్రత్యర్థులను ఓడిస్తూ ఒక్కో మ్యాచ్‌ను గెలుస్తూ వస్తోన్న జట్లు ఆదివారం జరిగే ఫైనల్ పోరులో అమీ తుమీ తేల్చుకునేందుకు సిద్ధమయ్యాయి. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'స్ప్రైట్ ఈసీసీ కప్-2017' క్రికెట్‌లో పోటీల్లో భాగంగా శనివారం నాడు సీనియర్స్ విభాగంలో సెమీఫైనల్ ఫైనల్ పోటీలు జరిగాయి.



కైలాసగిరి జిల్లా పోలీసు పెరేడు మైదానంలో

ప్రిజమ్ డిగ్రీ అండ్ పీజీ జట్టు జయభేరి

తొలి సెమీఫైనల్ పోటీలో ప్రిజమ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్టు 16 పరుగుల తేడాతో సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఫీల్డింగ్ తీసుకోవడంతో ప్రిజమ్ డిగ్రీ పీజీ కళాశాల జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగింది. 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. 81 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 64 పరుగులే చేసి ఓటమిపాలైంది.



టీఎస్ఆర్ అండ్ టీబీకే జట్టు ఘనవిజయం

మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో టీఎస్ఆర్ అండ్ టీబీకే కళాశాల జట్టు 23 పరుగుల తేడాతో విశాఖ టెక్నికల్ క్యాంపస్ జట్టుపై విజయం సాధించింది. తొలుత టీఎస్ఆర్ అండ్ టీబీకే కళాశాల జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లకు 90 పరుగులు చేసింది. అనంతరం విశాఖ టెక్నికల్ క్యాంపస్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 67 పరుగులే చేయడంతో టీఎస్ఆర్ జట్టును విజయం వరించింది.

07-01-2018 ఆదివారం మ్యాచ్‌లు

కైలాసగిరి జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్, విశాఖపట్నం

ఉదయం 8.00 గంటలకు: సాయిగణపతి ఇంజినీరింగ్ కాలేజి షిఫ్ట్ పాలిటెక్నిక్, గిడిజాల Vs డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కాలేజి

ఉదయం 10.00 గంటలకు: ప్రిజమ్ డిగ్రీ & పీజీ కాలేజి Vs టి.ఎస్.ఆర్. & టి.బి.కె. డిగ్రీ కాలేజి, శ్రీనగర్, గాజువాక

క్రీడాకారులకు గమనిక..: క్రీడాకారులు పదోతరగతి ఒరిజినల్ మార్కుల మెమో, కళాశాల గుర్తింపు కార్డు, స్టడీ సర్టిఫికెట్‌లను తప్పనిసరిగా తీసుకురావాలి. క్రీడాకారులంతా నిర్ణీత సమయానికి ఓ గంట ముందే మైదానం వద్దకు చేరుకుని అక్కడ టోర్నీ నిర్వాహకులకు రిపోర్టు చేయాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాట్స్‌మన్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్‌ప్యాడ్స్, అండర్ గార్డ్స్, హేండ్ గ్లౌజ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ తప్పక ధరించాలి.

అందుబాటులో వైద్యసేవలు

క్రీడాకారులు గాయాల బారిన పడినా, అనారోగ్యానికి గురైనా తక్షణ వైద్య సేవలు అందించేందుకు 'ఈనాడు' అంబులెన్స్, వైద్యులను మైదానం వద్ద అందుబాటులో ఉంచింది. కైలాసగిరి జిల్లా పోలీసు పరేడ్ మైదానం వద్ద శనివారం కళాఆసుపత్రి అంబులెన్స్, వైద్య సిబ్బంది సేవలు అందించారు.

ఘనంగా ఉక్కు కేవీ వార్షిక క్రీడోత్సవాలు

ఉక్కునగరం, న్యూస్‌టుడే: ఉక్కునగరం కేంద్రీయ విద్యాలయం వార్షిక క్రీడోత్సవాలను శనివారం ఉక్కు జీయం (హెచ్ఆర్), పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ ఆర్.వి.రావు ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడతాయని, చిన్ననాటి నుంచే పిల్లలను అన్ని రంగాల్లో చురుకుగా పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం విజేతలకు ఆర్.వి.రావు దంపతులు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ శాస్త్రి, క్రీడా ఉపాధ్యాయులు సత్యనారాయణ, విక్రమ్ వర్మ, ఎస్.ఆర్.దాస్ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలతో ఉక్కు జీయం ఆర్.వి.రావు, తదితరులు

ప్రత్యేక పిల్లల క్రీడలు ప్రారంభం

ఉక్కునగరం, న్యూస్‌టుడే: అంతర జిల్లా ప్రత్యేక పిల్లల క్రీడా పోటీలను ఉక్కు క్రీడా విభాగం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పోటీలను ఉక్కు డైరెక్టర్ (పర్సనల్) కె.సి.దాస్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు. విశాఖ, విజయనగరం తదితర జిల్లాలకు చెందిన సుమారు 14 పాఠశాలల నుంచి 250 మంది పిల్లలు పాల్గొన్నట్లు అధికారులు తెలిపారు. విజేతలకు, ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన పాఠశాలలకు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు. అధికారులు ఆర్.వి.రావు, జి.గాంధీ, పి.కె.మహాపాత్ర, ఎం.ఎస్.కుమార్, కార్మిక సంఘాల నాయకులు గంధం వెంకటరావు, నీరుకొండ రామచంద్రరావు, సీ ప్రధాన కార్యదర్శి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



లేబన్ హిల్పే పిల్లలకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

గీతం బిజినెస్ స్కూల్‌లో ప్రవేశాలు

సాగర్‌నగర్: గీతం డీమ్డ్ వర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (జీఎస్ఐబీ)లో 2018-19 సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు గీతం సంబంధిత విభాగం సంయుక్త సంచాలకుడు ఆచార్య కె.కె.నారాయణన్ శనివారం తెలిపారు. ఎంబీఏలో ఇంటర్నేషనల్ బిజినెస్, గ్లోబల్ లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ స్పెషలైజేషన్లలో చేరే వారికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఏదైనా డిగ్రీలో ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. బిజినెస్ ఎనలటిక్స్ పీజీ డిప్లమా కోర్సుల్లో చేరే వారికి రాతపరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. క్యాట్, మ్యాట్, జీమాట్, సీమాట్, ఎక్స్‌ఏటీల్లో ర్యాంకు సాధించిన వారికి నేరుగా ప్రవేశాలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు గీతం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఎస్ఐబీ.ఓఆర్‌జీలో చూడాలన్నారు.

అఖిల భారత అంతర్ వర్సిటీ టెన్నిస్ పోటీల విజేతలు వీరే..

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: గీతం డీమ్డ్ వర్సిటీ వేదికగా జరుగుతున్న అఖిల భారత స్థాయి అంతర్ వర్సిటీల పోటీల్లో శనివారం విజయం సాధించిన జట్ల వివరాలను గీతం క్రీడావిభాగం కార్యదర్శి కె.రామకృష్ణారావు వెల్లడించారు. దిల్లీ వర్సిటీ జట్టుపై బెంగళూరు విశ్వవిద్యాలయం జట్టు, బిలాస్‌పూర్ వర్సిటీ జట్టుపై ముంబయి వర్సిటీ జట్టు, దుర్గ వర్సిటీ జట్టుపై ఎస్‌పీ వర్సిటీ జట్టు, ముజాఫర్ బీఆర్ఏబీ వర్సిటీ జట్టుపై రోతిక్ ఎండీ వర్సిటీ జట్టు, పంజాబు వర్సిటీ జట్టుపై చెన్నై అన్నా విశ్వవిద్యాలయం జట్టు గెలుపొందాయన్నారు.

ప్రాథమిక దశ నుంచే నైపుణ్యాలు పెంచుకోవాలి

❑ ఏయూ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు ❑ సాంకేతికలో ఘనంగా టెక్నోత్సవ్-2కే18

పీఎంపాలెం, ఎండాడ, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ప్రాథమిక దశ నుంచే నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును సాకారం చేసుకోవచ్చని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు అన్నారు. పీఎంపాలెం సాంకేతిక విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం 'టెక్నోత్సవ్-2కే18' జాతీయస్థాయి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ అధికారి మధుభట్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల భవిష్యత్తు ఇంజినీరింగ్ రంగంపైనే ఆధారపడి ఉందని, కళాశాలలు అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని విద్యార్థులు అత్యుత్తమంగా రాణించాలన్నారు. అనంతరం వివిధ విభాగాల విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంకేతిక నమూనా ప్రదర్శన ఆకట్టుకుంది. కళాశాల హెచ్ఆర్ డైరెక్టర్ కె.ఎస్.పి.రావు, ఎస్‌వీపీ, సీతమ్ కళాశాలల ప్రధానాచార్యులు మురళి, సి.ఘనశ్యామ్, సదస్సు కన్వీనర్ కె.రామాంజనేయులు తదితరులు రిజిస్ట్రార్‌ను సత్కరించారు.



రిజిస్ట్రార్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు



భారత విదేశాంగ శాఖ నూతన కార్యదర్శిగా విజయ్ కేశవ్ గోఖలే నియమితులయ్యారు. 2018 జనవరి 28 న పదవీ విరమణ పొందనున్న ఎస్. జై శంకర్ స్థానంలో ఈయన బాధ్యతలు చేపడతారు. 2017 లో భారత్-చైనా నడుమ డోక్లామ్‌లో 73 రోజులపాటు చోటు చేసుకున్న సైనిక ప్రతిష్టంభనను చర్చల ద్వారా పరిష్కరించడంలో కీలకపాత్ర పోషించిన విజయ్ ఈ పదవిలో రెండేళ్ల పాటు ఉంటారు.

ప్రతిభ

పౌరసత్వం పొందిన తొలి రోబో..?

కరెంట్ అఫైర్స్

1. 2018 జనవరి 1 న ఏ రెండు దేశాలు ఆయా దేశాల్లోని అణుకేంద్రాలు, వాటికి సంబంధించిన సమాచారాన్ని పరస్పరం మార్పిడి చేసుకున్నాయి? (ఈ రెండు దేశాల్లోని అణుకేంద్రాలపై పరస్పర దాడుల నిషేధ ఒప్పందం 1988 డిసెంబరు 31 న జరగ్గా, 1991 జనవరి 27 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం ప్రతి ఏడాది జనవరి 1 న అణుకేంద్రాలు, సంబంధిత అంశాల సమాచారాన్ని మార్చుకుంటారు.)
ఎ) ఉత్తర కొరియా - దక్షిణ కొరియా
బి) ఇజ్రాయెల్ - పాలస్తీనా
సి) ఇరాన్ - ఇరాక్ డి) భారత్ - పాకిస్థాన్

2. దేశ ప్రజలకు ఇచ్చిన నూతన సంవత్సర సందేశంలో 'అణ్వాయుధాలు ప్రయోగించే మీట ఎల్లప్పుడూ నా టేబుల్ పైనే ఉంటుంది' అని వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వ్యక్తి ఎవరు?
ఎ) అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
బి) ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్
సి) ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ
డి) దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్‌జేఇన్

3. భారత్, మొజాంబిక్‌లలో లభ్యమయ్యే బొగ్గు నుంచి మిథనాల్ తయారీకి ఉన్న అవకాశాలపై అధ్యయనానికి కేంద్ర ఉక్కుశాఖ ఎవరి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది? (ఇది 60 రోజుల్లోపు నివేదిక అందించాల్సి ఉంటుంది).
ఎ) నీతి ఆయోగ్ సభ్యుడు వి.కె. సారస్వత్
బి) విశాఖ ఉక్కు సీఎండీ పి. మధుసూదన్
సి) పారిశ్రామికవేత్త సజ్జన్ జిందాల్
డి) రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ

4. ప్రకృతి సేద్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారుగా ఇటీవల ఎవరు నియమితులయ్యారు? (2017 డిసెంబరు 31 నుంచి తొమ్మిది రోజులపాటు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు.)
ఎ) రాజేంద్రసింగ్ బి) సుభాష్ పాలేకర్
సి) బిందేశ్వర్ పాఠక్ డి) ఎం.ఎస్. స్వామినాథన్

5. 29 వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని 2018 జనవరి 1 న విజయవాడ స్వరాజ్య మైదానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎవరితో కలిసి ప్రారంభించారు? (మాతృభాషను కాపాడుకునేందుకు 2018 ని 'తెలుగు భాష పరిరక్షణ' సంవత్సరంగా ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించారు.)
ఎ) నరేంద్ర మోదీ బి) ఎం. వెంకయ్యనాయుడు
సి) రామ్‌నాథ్ కోవింద్ డి) సుష్మా స్వరాజ్

6. ప్రతిష్ఠాత్మక దేశవాళీ క్రికెట్ ఛాంపియన్‌షిప్ రంజీ ట్రోఫీని 2018 జనవరి 1 న ఏ జట్టు నెగ్గింది? (ఇండోర్‌లో జరిగిన ఫైనల్లో 9 వికెట్ల తేడాతో ఏడుసార్లు రంజీ ఛాంపియన్ దిల్లీపై ఘనవిజయం సాధించింది. ఈ జట్టు ఈ ట్రోఫీ గెలవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ జట్టు కెప్టెన్‌గా ఫైజ్ ఫజల్ వ్యవహరించాడు.)
ఎ) బరోడా బి) బెంగాల్ సి) ఝార్ఖండ్ డి) విదర్భ



జైరాం ఠాకూర్ హిమాచల్‌ప్రదేశ్ 14 వ ముఖ్యమంత్రిగా 2017 డిసెంబరు 27 న ప్రమాణ స్వీకారం చేశారు. సిమ్లాలోని ప్రసిద్ధ రిడ్జి మైదానంలో ఈ కార్యక్రమం జరిగింది. గవర్నర్ ఆచార్య దేవవ్రత్ తొలుత ముఖ్యమంత్రితో, ఆ తర్వాత 11 మంది మంత్రులతో ప్రమాణం చేయించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

7. 78 వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనను (నుమాయిష్ - 2018) 2018 జనవరి 1 న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఎవరు ప్రారంభించారు?
ఎ) తెలంగాణ ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ
బి) తెలంగాణ ఆర్థికమంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్
సి) తెలంగాణ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి
డి) పై ముగ్గురూ



8. ఏ రాష్ట్రంలోని ఉత్తర కాశీ జిల్లాలోని మట్లి అనే గ్రామంలో ఐటీబీపీ అధికారులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ 2017 డిసెంబరు 31 న నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు? (చైనాకు సరిహద్దున ఉన్న నెలాంగ్ లోయలో 11,700 అడుగుల ఎత్తున ఉన్న ఈ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు మైనస్ 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతుంటాయి. ఇక్కడ పర్యటించిన తొలి హోంమంత్రిగా రాజ్‌నాథ్ వార్తల్లో నిలిచారు)
ఎ) జమ్మూ కశ్మీర్ బి) హిమాచల్ ప్రదేశ్
సి) సిక్కిం డి) ఉత్తరాఖండ్

9. ఆంధ్రప్రదేశ్ నూతన డీజీపీగా ఎం. మాలకొండయ్య మంగళగిరిలోని ఏపీ పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏ రోజున బాధ్యతలు తీసుకున్నారు? (ఎన్. సాంబశివ రావు స్థానంలో ఈయన బాధ్యతలు స్వీకరించారు.)
ఎ) 2017 డిసెంబరు 30 బి) 2017 డిసెంబరు 31
సి) 2018 జనవరి 1 డి) 2018 జనవరి 2

10. ఆకర్షణీయ నగరాల కార్యక్రమం కింద 60 నగరాలకు విడుదల చేసిన రూ. 9,860 కోట్లలో ఎంత శాతం మేర మాత్రమే ఖర్చయినట్లు కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ వెల్లడించింది?
ఎ) 7% బి) 17% సి) 27% డి) 37%

11. ఇటీవల ఏ ఐఐటీలో నిర్వహించిన టెక్‌ఫెస్ట్ 2017 లో ప్రపంచంలోనే మొదటి పౌరసత్వం పొందిన రోబో 'సోఫియా' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది? (సోఫియా తొలిసారిగా మన దేశానికి వచ్చింది. అత్యాధునిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సును ఉపయోగించి హాంకాంగ్‌లోని హన్సన్ రోబోటిక్స్ లిమిటెడ్ సంస్థ తయారు చేసిన సోఫియాకు సౌదీ అరేబియా పౌరసత్వం ప్రసాదించింది).
ఎ) ఐఐటీ మద్రాస్ బి) ఐఐటీ ఖరగ్‌పూర్
సి) ఐఐటీ బాంబే డి) ఐఐటీ కాన్పూర్

12. తెలంగాణలో 2016 లో పోలిస్తే 2017 లో నేరాలు ఎంత శాతం పెరిగినట్లు డీజీపీ ఎం. మహేందర్ రెడ్డి వెల్లడించారు?
ఎ) 10.93% బి) 12.93%
సి) 14.93% డి) 16.93%

13. అధికార పత్రాలను సభలో ప్రవేశపెట్టేటప్పుడు 'అర్జిస్తున్నా' (ఐ బెగ్) అనే పదాన్ని వాడొద్దంటూ ఇటీవల ఎవరు కేంద్ర మంత్రులకు సూచించారు?
ఎ) రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్
బి) లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్
సి) రాజ్యసభ ఛైర్మన్ ఎం. వెంకయ్య నాయుడు
డి) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

14. దివ్యాంగులను సాధారణ వ్యక్తులు వివాహం చేసుకుంటే ప్రస్తుతం ఇస్తున్న రూ. 50 వేల ప్రోత్సాహాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎంతకు పెంచింది?
ఎ) రూ. 75 వేలు బి) రూ. లక్ష
సి) రూ. 1.5 లక్షలు డి) రూ. 2 లక్షలు

15. తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం 2018 జనవరి 2 న ఏర్పాటు చేసింది. దీనికి ఛైర్మన్‌గా ఎవరు నియమితులయ్యారు? (ఛైర్మన్‌తో పాటు అయిదుగురు సభ్యులుగా నియమితులయ్యారు)
ఎ) బోయిళ్ల విద్యాసాగర్ బి) చిలకమర్రి నర్సింహ
సి) ఎర్రోళ్ల శ్రీనివాస్ డి) సుంకపాక దేవయ్య

16. ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించ తలపెట్టిన 105 వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలను అనివార్య కారణాల వల్ల రద్దు చేసిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ (ఇస్కా) తిరిగి వాటిని 2018 మార్చిలో ఏ నగరంలో నిర్వహించాలని నిర్ణయించింది?
ఎ) ఇంఫాల్ బి) ఇటానగర్
సి) కోహిమా డి) గువహటి

17. ప్రస్తుతం అమెరికాలో కొనసాగుతున్న గూగుల్ ఎక్స్ తొలిసారిగా అమెరికా వెలుపల భారత్‌లోని ఏ నగరంలో తమ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది? (విప్లవాత్మక పరిజ్ఞానాలను అందుబాటులోకి తేవాలనే ప్రధాన లక్ష్యంతో ఈ సంస్థ పరిశోధనలు చేస్తుంటుంది. ఇప్పటికే ఈ సంస్థ ప్రాజెక్ట్ లూన్, ప్రాజెక్ట్ మకాని, ప్రాజెక్ట్ వింగ్, ప్రాజెక్ట్ ఫాగ్‌హార్న్ పేరిట పలు పరిశోధనలు చేపట్టింది.)
ఎ) ముంబయి బి) బెంగళూరు
సి) విశాఖపట్నం డి) హైదరాబాద్

18. 2016 తో పోలిస్తే 2017 లో ఆంధ్రప్రదేశ్‌లో నేరాలు ఎంత శాతం తగ్గినట్లు 2017 వార్షిక నేరగణాంక నివేదిక వెల్లడించింది?
ఎ) 12.73% బి) 16.73%
సి) 20.73% డి) 24.73%

19. 2017 డిసెంబరు 25 న దేశంలోనే తొలి ఏసీ సబర్బన్ రైలును ఏ నగరంలోని బొరివలి - చర్చిగేట్ స్టేషన్ల మధ్య ప్రారంభించారు?
ఎ) దిల్లీ బి) బెంగళూరు
సి) చెన్నై డి) ముంబయి

20. 15 ఏళ్ల తర్వాత రాజ్యసభలో ఏ రోజున ప్రశ్నోత్తరాల సమయంలో ప్రశ్నోత్తరాల జాబితాలోని అన్ని ప్రశ్నలు అడిగే అవకాశం దక్కింది? (చివరిసారి 2002 లో జరిగిన 197 వ సమావేశంలో ప్రశ్నోత్తరాల జాబితాలోని అన్ని ప్రశ్నలను సభలో ప్రస్తావించే అవకాశం దక్కింది. అప్పట్లో ప్రశ్నలు వేసిన 20 మందిలో 10 మంది హాజరుకాకపోవడంతో అది సాధ్యమైంది. కానీ తాజాగా సభలో కొందరు సభ్యులు హాజరు కాకపోయినా వారి స్థానంలో మరికొందరికి అవకాశం కల్పించి మొత్తం 18 మందితో మాట్లాడించారు.)
ఎ) 2018 జనవరి 1 బి) 2018 జనవరి 2
సి) 2018 జనవరి 3 డి) 2018 జనవరి 4

జవాబులు

1–డి	6–డి	11–సి	16–ఎ
2–బి	7–డి	12–బి	17–సి
3–ఎ	8–డి	13–సి	18–డి
4–బి	9–బి	14–బి	19–డి
5–బి	10–ఎ	15–సి	20–బి



రచయిత
సీహెచ్. కృష్ణప్రసాద్
విషయ నిపుణులు

మీ అభిప్రాయాలు పంపాల్సిన మెయిల్ ఐడీ
pratibhadesk@eenadu.net

వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్

- తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు 24 గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించే కార్యక్రమాన్ని 2017 డిసెంబరు 31 అర్ధరాత్రి 12 : 01 గంటలకు ప్రారంభించారు.
- 2014 జూన్ 2 న తెలంగాణ అవతరించే నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 6,573 మెగావాట్లు. 2018 జనవరి 1 నాటికి అందుబాటులోకి వచ్చిన విద్యుత్ 14,913 యూనిట్లు.
- వ్యవసాయానికి 24 గంటల సరఫరా చేయడంతోపాటు రాష్ట్రంలోని అన్ని రంగాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో విద్యుత్ సంస్థలు రూ. 12,316 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్ఠం చేశాయి. 514 కొత్త సబ్ స్టేషన్లు, 1724 కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 19,514 కిలోమీటర్ల కొత్త లైన్లు నిర్మించాయి.
- ఆర్థిక ప్రగతికి సూచికగా పేర్కొనే తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశ సగటును మించింది. తెలంగాణ ఏర్పడే నాటికి తలసరి విద్యుత్ వినియోగం 1200 యూనిట్లు. నేడు 1505 కు పెరిగింది.
- తెలంగాణ విద్యుత్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ మంత్రి జి. జగదీష్ రెడ్డి, తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకరరావు.

అయిదో విడత 'జన్మభూమి - మా ఊరు'

- 5 వ విడత 'జన్మభూమి - మా ఊరు' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకాశం జిల్లా దర్శిలో 2018 జనవరి 2 న ప్రారంభించారు. జనవరి 11 వరకూ ఈ కార్యక్రమం కొనసాగనుంది.
- జన్మభూమి కార్యక్రమాన్ని గతంలో కంటే భిన్నంగా రోజుకో అంశం చొప్పున 9 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.
- మొదటి రోజు సంక్షేమం - సంతృప్తి, రెండో రోజు ఆరోగ్యం - ఆనందం, మూడో రోజు స్వచ్ఛాంధ్రప్రదేశ్, నాలుగో రోజు విద్య - వికాసం, అయిదో రోజు మౌలిక సదుపాయాలు, ఆరో రోజు సహజ వనరులు - అభివృద్ధి, ఏడో రోజు వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధి, ఎనిమిదో రోజు సుపరిపాలన - టెక్నాలజీ వినియోగం, తొమ్మిదో రోజు విజన్ స్వర్ణాంధ్రప్రదేశ్ - పేదరికంపై గెలుపు అనే అంశాల పేరిట 'జన్మభూమి - మా ఊరు'ను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమం చివరి రోజు జనవరి 11 న 'ఆనంద లహరి'ని నిర్వహించాలని నిర్ణయించింది.
- ఈ ఏడాది ఉగాది నుంచి పెళ్లికానుక పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా ప్రకటించారు. ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 40 వేలు, బీసీలకు రూ. 30 వేలు చొప్పున పెళ్లి సమయంలో వారి ఖాతాల్లో జమ చేస్తామని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు. 2018 లో రాష్ట్రంలో లక్ష పెళ్లిళ్లకు సాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.
- పాఠశాల విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా రూ. 1617 కోట్లతో ఉపకార వేతనాలు అందిస్తున్నామని, కొత్తగా 1.50 లక్షల మందికి రేషన్ కార్డులు అందిస్తున్నామని, 19 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోందని సీఎం తన ప్రసంగంలో వెల్లడించారు.
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల పర్వులెట్ తరగతులు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా చంద్రబాబు తెలిపారు.

Ajay Viswanaduni

Q: Sir, we are chatting in English as per our knowledge. But while talking to others (Directly) in English, the flow is missing. So how to resolve this one?

A: What is important is practice. The more you speak in English wrongly or rightly, without any fear of making mistakes, your English will improve. Don't be afraid of making mistakes; through mistakes we learn. Avoid fear. Whenever you have an opportunity, speak only in English. Language is mostly a matter of practice. Secondly, listen to English news telecasts every day. Read the newspaper every day. This will help you a lot.

Sanyasirao

Q: Sir, I want to know about tenses. How can we find out whether it is a present, past or future?

A: Am, is, are, verbs like go (with I, we, you and they) and goes (with he, she and it), do, does, have, has, verbs beginning with have / has are all present tense forms.

Was / were, verbs like went, sang, liked, did, had, verbs beginning with had are all past tense forms.

All verbs beginning with shall / will are future tense forms.

ప్రతిభ

స్పోకెన్ ఇంగ్లిష్ పాత సంచికల కోసం చూడండి.. www.eenadupratibha.net

SPOKEN ENGLISH ఆంగ్లభాషణ 973

'Leaps and bounds' means...?



P.V. Madhu

Q: Dear Educator, please clarify the following doubts of English grammar.

i) Does communication mean good speaking skills ONLY? or ALSO includes good skills of reading, writing, expressing, listening, smiling, friendly & encouraging nodding?

A: Communication skills mean, not only good speaking skills, but also communicating your ideas in writing too, and sometimes by signs and gestures. It also includes listening skills.

Q: i) Leaps and bounds ii) Far and wide - వీటికి అర్థం ఏమిటి?

A: i) Make progress very quickly

ii) Over a large area. Eg: His name spread far and wide.

K. Eswaraiah, Guntakal

Q: Sir, please translate the following sentences into Telugu.

1. What is the aim of the land for run.
2. Then what should be the choice for India.
3. I am going fight to the last.
4. I will stick that last.
5. Get tuffs get going.
6. Hard to be parted form.
7. The law is what matters.
8. Father figure. 9. Hands in gloves
10. Get yourself tested
11. He can't see wood for the trees.
12. He took me off to the school.

A: 1) దీని సందర్భం తెలిస్తే తప్ప అర్థం తెలియదు.

2) అప్పుడు భారత్ దేన్ని ఎంచుకోవాలి?

3) చివరిదాకా పోరాడతాను.

4) దాన్ని నేను చివర అంటిస్తాను.

5) ఇది 'Get tough, get going' = 'నిక్కచ్చిగా ఉండి పని కానివ్వు', కానీ సందర్భం తెలిస్తే తప్ప దీని అర్థం సరిగా చెప్పలేం.

6) విడిపోవడం కష్టంగా ఉంటుంది.

7) చట్టం ముఖ్యం. 8) తండ్రిలాంటి వాడు

9) ఒకరితో ఒకరు చేతులు కలపడం, మంచి/ చెడు చేసేందుకు

10) పరీక్ష చేయించుకో

11) చిన్నచిన్న విషయాలను మాత్రమే అర్థం చేసుకుని, పెద్ద విషయాలు పట్టించుకోకపోవడం

12) నన్నతడు బడికి తీసుకెళ్లాడు.

Q: Sir, please translate the following into English.

1. ఈ సిమెంటులో జీవం ఉంది.
2. ఆడపిల్ల చదువు అవనికి వెలుగు.
3. ప్రకృతి వ్యవసాయం (సుభాష్ పాలేకర్ అనే శాస్త్రవేత్త దీని గురించి ప్రచారం చేస్తుంటారు)
4. ఒక్కడే, మంజునాథుడొక్కడే.
5. కల్లంలో కన్నీటి వాన. 6. వాస్తవంలోకి వెలుగు కల.
7. కత్తులు దూసిన పుంజులు 8. రాజకీయ క్రినీడలు.
9. నాన్నకు ప్రేమతో 10. చెమటలు పట్టించాడు.
11. నేను వాళ్లతో అగ్రిమెంట్ రాయించుకున్నాను.
12. నౌకను నావికా దళాధికారి జల ప్రవేశం చేయించారు.

A: 1) This cement has life in it.

2) A woman's education lights up the world.

3) Agriculture without the use of fertilizers / Organic agriculture.

4) There is only one god, that is Manjunath.

5) Rain of tears in the agricultural field.

6) I don't understand the meaning of it. Perhaps the translation is, 'The dream of light in reality'.

7) No correct translation for it.

8) Political shadows

9) To dad with love

10) He made me sweat with fear

11) I had them write the agreement.

12) The navy chief launched the ship.

VOCABULARY



1. Passionate = Showing or caused by strong feelings (భావోద్వేగంతో ఉన్న).

Eg: The speaker made a passionate request to the listeners not to yield to corruption.

★ Passionate X Apathetic / indifferent (శ్రద్ధ లేని/ అనాసక్తిగా ఉన్న).

Eg: Some leaders are apathetic/indifferent to people's welfare.

2. Sumptuous = Expensive and of high quality (చాలా ఖరీదైన/ ఉత్తమ శ్రేణికి చెందిన)

Eg: They served us a sumptuous meal.

★ Sumptuous X Economical (పొదుపైన).

Eg: In spite of their wealth, they are very economical.

3. Scandal = An immoral action causing public anger (ప్రజలకు కోపం కలిగించే అవినీతికరమైన పని).

Eg: Most of our ministers are involved in scandals.

★ Scandal X honour (గౌరవం)

4. Degraded = Show disrespect to someone (ఎవరినైనా కించపరిచే).

Eg: Because of his corrupt practices he has been degraded from his respectable position.

★ Degraded X Elevate / promote (ఎత్తయిన స్థానంలో ఉంచు/ ఉన్నతీకరించు).

Eg: Because of his honesty he has been elevated to a higher position.

5. Antidote = A medicine which acts against poison (విషానికి విరుగుడు).

Eg: This will act as an antidote to the poison she has taken.

★ Antidote X venom / poison. (విషం)

Eg: He has taken poison to commit suicide.

G. Nageswara Rao

Q: Most of the times while listening English news/ conversation on radio, I have observed, 'I would say' or 'I would recommend' what is the meaning of 'I would' in the context?

A: 1) Here, 'would' means wish. I would say = I wish to say.

Q: a) Minister said last year he would construct a club in the town, but not yet constructed.

b) Minister said last year he will construct a club in the town, but not yet constructed.

- Which sentence is correct?


A: Yes, if the work is not completed till now, we can use will, but would is always better. 'I will say' refers to the future = I am going to say in future.

Syed Azeez

Q: Sir, please explain correct usage of this words: Could, would, has, had, been, might, should, have.

A: 'Could' expresses ability to do something in the past. Eg: I could understand what he said yesterday = I was able to understand what he said yesterday. However, 'could' means to be able to do something in the past, but did not do it.

'Would' is often used as the past tense of will. Eg: He says he will do it (Present tense). He said he would do it (in the past). Would has other meanings too. 'Would' sometimes means 'wish'. Eg: I would (wish) rather go than stay here. 'Would' also means preference. It has other meanings too.



'Has' means to own / possess something, and 'has' is always used with he, she and it, whereas 'have' is used with I, we, you, and they. Eg: a) He/ she has a lot of property. Eg: b) The car (it) has four wheels. 'Had' is the past form of have/ has. They had a lot of property (in the past). He had a car (in the past).

'Been' is not used independently. It is used as, have been, has been, and had been. I/ we/ you/ they have been, and he/ she/ it has been means that I/ we/ you/ they have been, and he/she/it has been in some place or in some position starting from sometime in the past and are there till now or even now.

'Should' = must. He should do it = He must do it (duty / compulsion / necessity).

Srinu Saibaba

Q: Sir, please let me know the meaning of the following words.

i) Somebody else ii) Someone else

iii) In some way or the other

iv) In spite of (eg: In spite of initiate stringent action on corruption somebody else are catching somewhere else).

A: i) Somebody else = ii) someone else = some other person. Eg: He did not do it, but somebody else/ someone else did it.

iii) In some way or the other = in any way.

iv) In spite of = despite. (though / but).

Eg: In spite of his wealth, he does not spend much = He is rich, but he does not spend much.

★ Though very strict action is taken, some people continue to be corrupt.

Kantipudi Kameswara Rao

Q: Respected sir, please let me know whether the following sentence is correct or not.

He saw a young lady of no more than 17.

A: The sentence is correct, though he saw a young lady of not more than 17 is better. However, till the age of 18, girls are called girls and not ladies.



Writer

- M. Suresan

మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా...
స్పోకెన్ ఇంగ్లిష్, ప్రతిభ విభాగం,
ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ,
అనాజ్‌పూర్, రంగారెడ్డి జిల్లా.
Email your questions to:
pratibhadesk@eenadu.net

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి గంటా శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంటా శ్రీనివాసరావు, వేదికపై ఎంపీ హరిబాబు, ఎమ్మెల్యే గణబాబు తదితరులు

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, వాటిని లబ్ధిదారులంతా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. శనివారం వెంకటాపురం మూడుగుళ్ల వద్ద ఏర్పాటు చేసిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. త్వరలోనే సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూసమస్యను పరిష్కరిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధితో నగరంలోని వివిధ పర్యాటక ప్రాంతాలు దేశ,విదేశీయులను ఆకర్షిస్తున్నాయని ఎంపీ హరిబాబు అన్నారు. వుడా ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వీసీ బసంత్‌కుమార్ వివరించారు. పశ్చిమ నియోజకవర్గంలోని సంక్షేమ పథకాల అమలు తీరును ఎమ్మెల్యే గణబాబు వివరించారు. కార్యక్రమానికి భారీస్థాయిలో ప్రజలు హాజరయ్యారు.

విశాఖ ప్రగతికి చేయూతనిస్తాం!

ఎంపీ కంభంపాటి హరిబాబు

పూర్ణామార్కెట్, న్యూస్‌టుడే: విశాఖ ప్రగతికి అన్ని చర్యలూ తీసుకుంటామని ఎంపీ కంభంపాటి హరిబాబు అన్నారు. ఇందిరాప్రియదర్శిని మైదానంలో జరుగుతోన్న అయిదో విడత 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకుంటూ నగరంలో వేల కోట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నాయన్నారు. బీచ్‌రోడ్డులో నాలుగు లైన్ల రోడ్డును నిర్మించడంతో పాటుగా కాన్వెంట్ కూడలి నుంచి పోర్టుకు వెళ్లే మార్గాన్ని నాలుగు వరుసలుగా త్వరలో నిర్మిస్తామన్నారు. జీవీఎంసీ యూసీడీ అధికారులు తోపుడు బండ్ల వ్యాపారులకు గుర్తింపు కార్డులను జారీచేసి, ముద్ర రుణాలు అందేలా కృషి చేయాలన్నారు.

నాలా చట్టాన్ని త్వరగా ఆమోదించండి

సిరిపురం, న్యూస్‌టుడే: నాలా పన్ను చట్టాన్ని త్వరితగతిన ఆమోదించాలని గవర్నర్ నరసింహన్‌ను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ అధ్యక్షుడు జి. సాంబశివరావు కోరారు. సిరిపురంలోని ఒక హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలా చట్టం కార్యరూపం దాల్చకపోవడం వల్ల నిర్మాణ రంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నా క్షేత్రస్థాయి అమలులో చిత్తశుద్ధి లోపం వల్ల ఆయా రంగాలు కునారిల్లుతున్నాయన్నారు. పారిశ్రామిక, నిర్మాణ, ఐటీ, పర్యాటక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ఆయా రంగాల్లో చోటు చేసుకుంటున్న ఇబ్బందిని ఏకరువు పెట్టారు. రాష్ట్రంలో పన్నుల ధాటికి అభివృద్ధి డీలా పడిందని ఐటీ విభాగ ప్రతినిధి సింబయాసిస్ సిఇఒ ఒ.నరేష్‌కుమార్ పేర్కొన్నారు. రెండు సమ్మిట్‌లు జరిగినా ఎటువంటి ప్రగతి లేదన్నారు. భవన నిర్మాణ రంగానికి సంబంధించి నాలా పన్నులతో పాటు సిమెంట్, ఇనుము ధరలు పెరిగాయని, మరో పక్క ఇసుక ఉచితమయ్యాక ధర పెరిగిందని క్రెడాయ్ విశాఖ అధ్యక్షుడు కోటేశ్వరరావు పేర్కొన్నారు. సమావేశంలో క్రెడాయ్ ఛైర్మన్ . జి.వి.వి.ఎస్.నారాయణరావు, పర్యాటక విభాగ ప్రతినిధి విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దేశవాళి కూరగాయలతో ఆరోగ్యం సమకూరు



మిద్దితోట పుస్తకాన్ని ఆవిష్కరిస్తు న్న డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

సీతంపేట, న్యూస్‌టుడే: సేంద్రీయ ఎరువులతో పండించే దేశవాళి కూరగాయలతో ఆరోగ్యం సమకూరుతుందని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. తుమ్మేటి రఘోత్తమరెడ్డి రచించిన 'మిద్దెతోట' పుస్తకాన్ని రైతు నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరరావు ప్రచురించారు. 'పర్యావరణ మార్గదర్శి వైశాఖి' (పి.ఎం.వి)ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పి.ఎం.వి అధ్యక్షుడు డాక్టర్ ఎస్. విజయకుమార్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. యార్లగడ్డ మాట్లాడుతూ నగరంలో ఇలాంటి మిద్దెతోటల పెంపకం ఆవశ్యకత ఉందన్నారు. అధ్యక్షత వహించిన విజయకుమార్ మాట్లాడుతూ నగరంలో ప్రతి ఇంటా ప్రజలు సొంతంగా కూరగాయలు సాగు చేయాన్నదే పి.ఎం.వి. లక్ష్యమన్నారు. అందుకు అవసరమైన శిక్షణ, సలహాలు, సూచనలు అందిస్తుందన్నారు. దేశవాళి విత్తనాలు, మిద్దెతోట కూరగాయల పంటల ఛాయాచిత్రాల(ఫొటో) ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం విశ్రాంత శాస్త్రవేత్త ఎస్.శివరామప్రసాద్, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ వెంకటేశ్వరరావు, రైతు మిత్ర ట్రస్ట్ వ్యవస్థాపకులు కర్రి రాంబాబు, ఉషాగజపతిరాజు ఔత్సాహికులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. మిద్దెతోటల పెంపకంలో మెలకువలు, కలిగే ప్రయోజనాలను వివరించారు.

'ప్రభుత్వ రంగంపై కత్తి కట్టిన భాజపా'

ఉక్కునగరం, న్యూస్‌టుడే: దేశంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమలపై కేంద్ర ప్రభుత్వం కత్తి కట్టిందని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ అన్నారు. శనివారం ఉక్కు నగరాన్ని సందర్శించిన సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో అత్యంత ప్రతిభావంతగా నడుస్తున్న బి.ఎస్.ఎన్.ఎల్‌లో సంబంధిత మంత్రి ఆదేశాలతో అక్కడ పని చేస్తున్న సుమారు 1.50 లక్షల మందిని ఇంటికి పంపే ప్రయత్నం జరుగుతున్నట్లు ఆమె ఆరోపించారు. రుణాల పేరుతో బ్యాంకుల వద్ద వందల కోట్ల అప్పులు చేసి.. కంపెనీలు నష్టాలు చూపించి రుణాలు ఎగవేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగాన్ని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని, కనీస వేతనం రూ.18వేలు ఉండాలన్నారు. బ్యాంకులు, ఎల్ఐసీ, జీఐసీ తదితర సంస్థలను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు బోసుబాబు, డి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న అమర్‌జిత్ కౌర్

విశాఖపట్నంలో సిరి మదుపరుల అవగాహన సదస్సు నేడే

ఈనాడు సిరి ఇన్వెస్టర్స్ క్లబ్ - హెచ్.డి.ఎఫ్.సి. మ్యూచువల్ ఫండ్ మరియు జియోజిత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న అవగాహన సదస్సు నేడు విశాఖపట్నంలో జరగనుంది. ఈ సదస్సులో ప్రముఖ స్టాక్ మార్కెట్ నిపుణులు పాల్గొని "ఈక్విటీ మార్కెట్‌లు - పెట్టుబడి అవకాశాలు మరియు మ్యూచువల్ ఫండ్స్" పై అవగాహన కల్పిస్తారు. ఈ సదస్సు ఫార్చ్యూన్ ఇన్ శ్రీకన్య, ద్వారకానగర్, డైమండ్ పార్క్ దగ్గర, విశాఖపట్నం నందు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. హాజరు కాదలచిన వారు ఉచిత సభ్యత్వ నమోదు కోసం నేరుగా వేదిక వద్దకు హాజరు కాగలరు. ప్రవేశం ఉచితం.

4.90 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ఇద్దరిపై కేసు నమోదు, ఒక వాహనం, బియ్యం మిల్లు సీజ్



వాహనంలోని బియ్యం

ఆనందపురం, న్యూస్‌టుడే: బోని గ్రామానికి సమీపంలోని ఓ రైస్‌మిల్లుకు రవాణా చేస్తోన్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం సాయంత్రం పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ డి.కోటేశ్వరరావు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓ వ్యాన్‌లో పౌరసరఫరాల శాఖ అందించే బియ్యాన్ని తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాన్ని అనుసరించామన్నారు. ఆ వ్యాన్ బోని గ్రామానికి చేరుకొని శ్రీ మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ వద్ద ఆగడంతో దాన్ని తనిఖీ చేయగా వాహనంలో 30 బస్తాల్లో ఉన్న 4.90 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించామన్నారు. బోని నారాయణస్వామికి చెందిన బియ్యం మిల్లును విశాఖనగరంలోని ఎంవీపీ కాలనీ చెందిన బండారు అప్పలగణేష్ లీజుకు తీసుకొని శ్రీ మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ పేరిట నడుపుతున్నాడు. పీడీఎస్ బియ్యాన్ని, 748 ఖాళీ సంచులను స్వాధీనం చేసుకొని, బండారు అప్పలగణేష్, బండారు శ్రీనివాసరావులపై కేసు నమోదు చేశారు. వాహనాన్ని, బియ్యం మిల్లును సీజ్ చేశారు.

'పదోన్నతి ఖాళీలను ఒకేసారి భర్తీ చేయాలి'

కార్పొరేషన్, న్యూస్‌టుడే: మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయులకు వివిధ కేటగిరీల్లో పదోన్నతులు ఒకే సారి కల్పించాలని మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ డిమాండ్ చేశారు. పలు కేటగిరీల్లో. ఖాళీలన్నింటిని గుర్తించి.. వాటన్నింటినీ ఒకేసారి భర్తీ చేసినట్లయితే సీనియారిటీని కోల్పోయే ప్రమాదముండదన్నారు. జీవీఎంసీలో మాత్రం శనివారం పీఈటీలకు, భాషాపండితులకు పదోన్నతులు కల్పించారని.. దీనివల్ల స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు పొందే ఉపాధ్యాయులు సీనియారిటీని కోల్పోతారన్నారు. తక్షణం వాటిని నిలిపేయాలని డిమాండ్ చేశారు.

డీసీఐ ప్రయివేటీకరణ అడ్డుకుంటాం!

✦ సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత

✦ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బహిరంగ సభ



మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత

మహారాణిపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి, కార్పొరేట్ రంగానికి కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకే చేటని సీఐటీయూ జాతీయ అధ్యక్షురాలు హేమలత ఆందోళన వ్యక్తంచేశారు. శనివారం పోర్టు ప్రవేశమార్గమైన సీహార్స్ కూడలిలో అఖిలపక్ష కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో డీసీఐ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్, మేకిన్ ఇండియా అంటూ ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టేస్తున్నారని విమర్శించారు. విశాఖ సహా దేశవ్యాప్తంగా 413 రైల్వే స్టేషన్లను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే 43 స్టేషన్ల ప్రయివేటీకరణకు టెండర్లు కూడా పిలిచారన్నారు. ఇవే కాకుండా కీలకమైన రక్షణ రంగంలో కూడా ప్రయివేటు పెట్టుబడులను ఆహ్వానించేందుకు చర్యలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆయుధ కర్మాగారాల్లో తయారయ్యే 143 వస్తువుల తయారీని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ కేవలం రూ. 28 కోట్ల పెట్టుబడితో ఏర్పడ్డ డీసీఐ ఇప్పుడు వేల కోట్ల విలువైన ఆస్తులను సమకూర్చుకుందని, దీనికితోడు రక్షణ రంగానికి ఆయువుపట్టుగా నిలుస్తోందన్నారు. సంస్థ ఉద్యోగులు 40 రోజులుగా దీక్షలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని ఎద్దేవా చేశారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు ఆర్కే.ఎస్వీ కుమార్, కార్యదర్శి జగ్గునాయుడు, డీసీఐ నాన్ ఎగ్జిక్యూటివ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు, ఏఐటీయూసీ నాయకుడు మార్కండేయులు, ఐఎన్‌టీయూసీ నాయకుడు ఈశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నాయకుడు మల్లయ్య, డీసీఐ నాన్ ఎగ్జిక్యూటివ్ సంఘ నాయకులు వెంకటరావు, నర్సింగరావు మాట్లాడారు.



'ఒకటి కొంటే ఒకటి ఉచితం' నాటికలో ఓ ఘట్టం

'ప్రజా బ్యాలెట్'లో తీవ్ర వ్యతిరేకత..

డీసీఐ ప్రయివేటీకరణను సమర్థిస్తారా..? వ్యతిరేకిస్తారా? అంటూ శుక్రవారం నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లో వ్యతిరేకిస్తూ అనేకమంది తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. సభ వద్ద ప్రజాబ్యాలెట్ పత్రలను లెక్క వేశారు. ఇందులో 1,01,320 పాల్గొన్నారు. వీరిలో 1,00,090 మంది ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. 610 మంది సమర్థించారు. మోదీ ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45 ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: ఈ వారం గ్రహఫలం.. వృత్తి విద్యలో రాణించడానికి శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం ఎలా ఆచరించాలి? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: పాడుతా తీయగా (రిపీట్), 10-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్యకావ్యం) 11-00: జబర్దస్త్ (కామెడీ షో రిపీట్).

మధ్యాహ్నం

12-00: జబర్దస్త్ జల్సా టైం (రిపీట్) 12-30: ఢీ-10 (సుప్రీం డాన్స్ షో) (రిపీట్), 2-00: సండే సూపర్‌హిట్ సినిమా: కత్తిపట్టి శక్తిచాటిన కాకతీయ ధీరవనిత వీరగాథ రుద్రమదేవి (అనుష్క, అల్లు అర్జున్, రానా)

సాయంత్రం

04-30: పుష్పకవిమానం ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు సినీ ప్రయాణం... నటుడు రంగనాథ్, శారద నటించిన జమీందారు గారి అమ్మాయి చిత్ర విశేషాలు. 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 6-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సా టైం (రిపీట్).

రాత్రి

07-00: స్వరాభిషేకం: సుమధుర స్వరకర్తలు అందించిన అపురూప గీతాలతో... 09-00: ఈటీవీ న్యూస్, 9-30: పాడుతాతీయగా యువగళాల స్వరసమరం. 10-30: స్పెషల్ సీరియల్: పిల్ల 11-00: స్పెషల్ మూవీ: మాధురి (అబ్బాస్, మాధురి)

ఈటీవీ ప్లస్

మధ్యాహ్నం

11:00 పోవే..పోరా రిపీట్

12:00 ఎక్స్‌ప్రెస్ రాజా బ్యాండ్ బాజా

01:00 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్ రిపీట్

02:00 పటాస్ పంచెస్ రిపీట్

03:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్

సాయంత్రం

04:00 పటాస్ రిపీట్

05:00 సండే కామెడీ మూవీ.. 'నువ్విలా'

రాత్రి

07:30 పటాస్ పంచెస్ రిపీట్

08:30 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్

09:30 నా షో నా ఇష్టం రిపీట్

10:30 సినిమా చూపిస్త మావ రిపీట్

11:30 పటాస్ రిపీట్

ఈటీవీ లైఫ్

★ సద్గురు సన్నిధిలో (ఉ. 6:00)

★ మానస (ఉ. 6:30, 7:00, 10:00, 10:30, 11:00)

★ సైజ్ జీరో (ఉ. 7:30)

★ అమృతం (ఉ. 8:00, మ. 12:00, 1:00, సా. 6:00, రా. 8:00)

★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 12:30, 01:30, సా. 06:30, రా. 8:30)

★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 2:00, రా. 7:00, 9:00, 10:00)

★ డా.ఈటీవి (ఉ. 09:30, మ. 2:30, 3:30, రా. 7:30, 9:30, 10:30)

★ అందరికి ఆరోగ్యం (మ. 3:00)

★ అమృతం చిరుధాన్యాల స్పెషల్ (రా. 11:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలీషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: నోట్‌బుక్ (రాజీవ్, గాయత్రి) 10-00: మార్నింగ్ షో: పేదరాశి పెద్దమ్మకథ (కాంతారావు) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: మంగమ్మగారి మనవడు (బాలకృష్ణ, సుహాసిని) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: నిన్ను కలిశాక (సంతోష్‌సామ్రాట్, ప్రీతిబాజ్‌పాయ్), రాత్రి: 7-00: ఫస్ట్ షో: అంతులేనికథ (జయప్రద, రజనీకాంత్, కమల్‌హాసన్) 10-00: అపురూపచిత్రాలు : హరనాథ్, జయలలిత నటించిన భక్తిరసచిత్రం 'శ్రీరామకథ' విశేషాలు

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8:30 వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ కట్‌లెట్ & చికెన్ కోకోనట్ మిల్క్ బనానా ఫ్లవర్, ఉ.9.30: గోరు ముద్దలు - మిక్స్‌డ్ దాల్ మిల్లెట్ కిచిడి, ఉ.9.45: మమ్మీస్ కిచెన్ - చిల్లీ చీజ్ ఫ్రైస్, ఉ.11.00: బాబాయ్ హోటల్ - చెట్టినాడ్ ఎగ్ కర్రీ & చెట్టినాడ్ ఎగ్ దోస, ఉ.11.30, సా.4.30: షాహీ దక్కని - పత్రానీ మచ్చి & దివానీ షోర్బా, మ.12.00, రా.8.30: సూపర్ భీమ్ - గేమ్ షో, మ.1.00, సా.5.30: అతిథి - మీ ఇంటింటి నేస్తం, మ.1.30, రా.10.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.2.00: చోటా షెఫ్ - టమాటో అటుకులు, మ.2.15: పిండివంటలు, ప్రసాదాలు - శెనగపప్పు పాయసం & శెనగపిండి పూరీలు, మ.2.45: పదండి విందుకు - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.3.15: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్‌డ్ వెజ్ సాగూ, మ.3.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, రా.7.30: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - వంకాయ బజ్జీ, రా.7.45: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, రా.8.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలిచెనా బొరుగుల ఉప్మా & పచ్చిమిర్చి మొక్కజొన్న మఫిన్స్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: **ఆత్మవిశ్వాసమే ఆయుధం**, 01-00 ఈటీవీ 360 ⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **అమ్మ బరువు బిడ్డకు భారమే**, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30: తీర్థయాత్ర: శ్రీ మరియమ్మ పేజియమ్మన్ కాళి అమ్మన్ దేవస్థానం, పాలక్కాడ్, కేరళ, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360⁰, 09-00: మార్గదర్శి: **ఆమీన్ సాయానీ**, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ (రి), 09 -00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: **ఆత్మవిశ్వాసమే ఆయుధం**, 01-00 ఈటీవీ 360⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30: తీర్థయాత్ర, శ్రీ ముక్కైశివాలయం, పాలక్కాడ్, కేరళ, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **అమ్మ బరువు బిడ్డకు భారమే**, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360⁰, 09-00: మార్గదర్శి: **ఆమీన్ సాయానీ**, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!.

ఏ ఛానల్లో ఏముంది.. 07-01-2018

SVBC: **ఉదయం:** 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు సమాహారం, 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - సూర్యభగవాన్, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు కన్నడ, 10-30 భగవద్గీత - బాలవికాసం, 11-00 భాస్కరం భువనేశ్వరం, 11-30 స్పెషల్ న్యూస్ - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం, 02-00 సినిమా, **సాయంత్రం:** 04-30 కోణార్క్ స్పెషల్, 05-00 లైవ్ ఎస్.డి సేవ + స్పెషల్ న్యూస్ + లక్ష్మీగద్యం, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + భవయామి రఘురామం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు + అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, 09-30 అద్భుత ఆలయాలు - కుక్కి సుబ్రహ్మణ్యస్వామి, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీ రామ రసవాహిని శ్రీ సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీగణేశ సహస్రం, 6-30 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 అర్చన, 7-30 శ్రీ కనకధారస్తోత్రం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 వారఫలం, 9-30 ధర్మక్షేత్రం, 11-00 ధర్మసందేహాలు, 11-30 వేదం.. జీవననాదం, 04-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారస్తోత్రం, 5-30 శ్రీగణేశసహస్రం, 06-00 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 భక్తివిశేషాలు 7-30 వేదం..జీవననాదం, 8-00 స్వరార్చన, 9-00 వారఫలం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తి విశేషాలు 11-00 గోదామృతం.

జీ తెలుగు: **ఉదయం:** 06-30 టెలీషాపింగ్, 07-00 జీటియమ్- టెలీషాపింగ్, 07-30 ఓం కారం, 08-00 డా. సుభాష్ చంద్ర షో, 09-00 సినిమా: కందిరీగ, **మధ్యాహ్నం:** 12-30 సినిమా: లౌక్యం, 03-30 సినిమా: ఆనందోబ్రహ్మ, **సాయంత్రం:** 06-00 సినిమా: దువ్వాడ జగన్నాథం, **రాత్రి:** 09-00 సూపర్ సీరియల్ ఛాంపియన్‌షిప్ సీజన్-2 (రిపీట్), 10-00 గోల్డ్‌రష్ (రిపీట్), 11-00 పోలీస్ డైరీ.

మా: **ఉదయం:** 06-30 మ్యూజిక్ బాక్స్, 07-00 ఫిల్మ్ బేస్డ్, 07-30 విహారి, 08-00 రాశి ఫలాలు, 09-00 సినిమా: మిర్చి, **మధ్యాహ్నం:** 12-00 సినిమా: ఏటో వెళ్లిపోయింది మనసు, 03-00 సినిమా: s/o సత్యమూర్తి, **సాయంత్రం:** 06-00 సినిమా: నిన్నుకోరి, 09-00 సినిమా: జులాయి.

GEMINI: **ఉదయం:** 06-00 జెమిని కొత్త పాటలు, 06-30 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 సెల్ఫీ రాజా స్వీటీ రాణి, 08-30 సినిమా: బ్లేడ్ బాబ్జి, 11-30 సినిమా: రాధా, **మధ్యాహ్నం:** 02-30 సినిమా: లెజెండ్, **సాయంత్రం:** 05-30 సినిమా: కాటమరాయుడు, **రాత్రి:** 08-30 ఫిదా మీ ఫేవరేట్ స్టార్‌తో, 09-30 బ్లాక్‌బస్టర్, 10-30 సినిమా: మురారి.

HBO: **ఉదయం:** 06-00 లైసెన్స్ టు వెడ్, 07-27 గ్రీన్ లాంథర్న్, 09-30 స్టోర్క్స్, 11-00 టవర్ ఆఫ్ డెత్, **మధ్యాహ్నం:** 12-42 300: రైజ్ ఆఫ్ యాన్ ఎంపైర్, 02-24 ట్రాన్స్‌ఫార్మర్స్ : రివెంజ్ ఆఫ్ ది ఫాలెన్, **సాయంత్రం:** 05-06 సల్ట్, 06-56 వార్ డాగ్స్, **రాత్రి:** 08-59 ట్రిబుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ జాండర్ కేజ్, 10-51 స్నాచ్: ది గ్రేటర్ గుడ్.

STAR MOVIES: **ఉదయం:** 06-16 పిక్సెల్స్, 08-04 ది ఇన్‌క్రెడిబుల్స్, 10-23 కార్స్, **మధ్యాహ్నం:** 12-43 టర్బో, 02-36 జతుర : ఎ స్పేస్ అడ్వెంచర్, **సాయంత్రం:** 04-42 ఫ్రోజెన్, **రాత్రి:** 06-48 రైజ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్, 09-00 కుంగ్ ఫూ హజల్, 11-08 ప్రెడేటర్.

SONY PIX: **ఉదయం:** 06-00 ది క్రానికల్ ఆఫ్ నార్నియా: ది లయన్, ది విచ్ అండ్ ది వార్డ్‌రోబ్, 08-50 మాన్‌స్టర్ హౌజ్, 10-49 ది ఇన్‌క్రెడిబుల్ హల్క్, **మధ్యాహ్నం:** 01-16 కెప్టెన్ అమెరికా: ది వింటర్ సోల్జర్, **సాయంత్రం:** 04-17 రాంబో: ఫస్ట్ బ్లడ్ పార్ట్-2, 06-21 అపోకలిప్టో, **రాత్రి:** 09-00 మిస్టర్ బీన్స్ హాలిడే, 10-55 2 ఫాస్ట్ 2 ఫ్యూరియస్.

ఘనంగా డైట్ ఉత్సవ్

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి అయ్యన్నపాత్రుడు తెలిపారు. పట్టణంలోని డైట్ ఇంజినీరింగ్ కళాశాల స్థాపించి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన డైట్ ఉత్సవ్ 2018 ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రూ. 50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య సివిల్‌బ్లాక్, డిజిటల్ క్యాంపస్ సాఫ్ట్‌వేర్‌ను ప్రారంభించారు. అనకాపల్లి ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించడానికి డైట్ కళాశాలకు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి ఒక టెస్టింగ్ సెంటర్‌ను ఇచ్చారని.. దీన్ని విద్యార్థులు వినియోగించుకుని విదేశీ చదువులకు వెళ్లాలని సూచించారు. కళాశాల వ్యవస్థాపకులు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, కరస్పాండెంట్ దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు ఆహ్వానం

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జిల్లాలోని 5 ఆదర్శ పాఠశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి ఆరోతరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 8న జరగనున్న ఈ ప్రవేశ పరీక్షకు ఏపీఆన్‌లైన్, మీసేవా కేంద్రాల్లో వచ్చే నెల 20వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 2016-17 వరకు 1వ తరగతి నుంచి నిరవధికంగా చదువుతూ 2017-18 విద్యాసంవత్సరానికి ప్రమోషన్ అర్హత పొందాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 50 రుసుము చెల్లించాలన్నారు. మిగతా వివరాలకు www.cse.ao.gov.in/apms.ap.gov.in లో సంప్రదించవచ్చన్నారు.

నేడు మంత్రి లోకేష్ రాక

వన్‌టౌన్ : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదివారం అరకు నియోజకవర్గ పరిధిలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు అనంతగిరిలో 5కె రన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. తదుపరి ఫుడ్ స్టాళ్ల సందర్శన, రంగోలి పోటీలను తిలకిస్తారు. అనంతరం జన్మభూమి-మావూరు గ్రామసభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.45 గంటలకు రోడ్డు మార్గంలో బయల్దేరి విశాఖకు చేరుకొని సాయంత్రం విమానంలో విజయవాడకు వెళ్తారు.

భూ కబ్జాదారుడిపై రౌడీ షీట్

అరెస్టుకు వెళ్లిన పోలీసులపై దాడికి యత్నం

తగరపువలస, న్యూస్‌టుడే: కాపులుప్పాడ పంచాయతీ సోమన్నపాలెం గ్రామానికి చెందిన భూకబ్జాదారుడు మరుపల్లి రామారావును శనివారం అరెస్టు చేసి, ఆయనపై రౌడీషీట్ తెరిచినట్లు భీమిలి సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... తగరపువలస జాతీయరహదారిని ఆనుకుని సర్వేనంబర్లు 104, 105, 106, 107లలో లింగబోతు జనార్దనరావు అనే వ్యక్తికి 1.20 ఎకరాల స్థలం ఉంది. దీనిపై కన్నేసిన రామారావు తన అనుచరులతో గతనెల 9న దౌర్జన్యంగా కబ్జాకు పాల్పడ్డాడు. భూ యజమానిని భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో బాధితుడు భీమిలి పోలీసుస్టేషనులో ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసిన సీఐ విచారణ ప్రారంభించగా రామారావు, బృందం చేసిన దౌర్జన్యం నిజమేనని తెలిందింది. ఈ నేపథ్యంలో అతన్ని అరెస్టు చేసేందుకు శనివారం పోలీసులు వెళ్లగా రామారావు, అతని అనుచరులతో దాడికి యత్నించారు. దీంతో సీఐ బాలసూర్యారావు స్వయంగా రంగంలోకి దిగి నిందితుణ్ని అరెస్టు చేసి రౌడీషీట్ తెరిచారు. దీనిపై సీఐ మాట్లాడుతూ మరుపల్లి రామారావుపై గతంలోనూ పలు భూకబ్జా కేసులున్నాయన్నారు. నకిలీపత్రాలు సృష్టించి భూకబ్జాలు చేస్తున్నట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. కాగా రామారావు అకృత్యాలపై ప్లాట్ల యజమానులు సీఐ బాలసూర్యారావుకు ఫిర్యాదుచేశారు. అతన్ని కఠినంగా శిక్షించాలంటూ పోలీసుస్టేషను వద్ద ఆందోళన చేశారు.

మార్గదర్శి చిట్టి గ్రూపుల వివరాలివీ

విశాఖపట్నం: మార్గదర్శి చిట్‌ఫండ్ ఎన్‌ఏడీ కొత్తరోడ్ బ్రాంచిలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న చిట్టి గ్రూపుల వివరాలు ఇవీ. అదనపు సమాచారం కోసం బ్రాంచి మేనేజరు ఎస్. శ్రీనివాసరావును సంప్రదించవచ్చు. మొబైల్ నెంబరు: 8008313115, ఫోన్ నంబర్లు: 0891- 2572735, 2572015, 2708640.

చిట్టి గ్రూపు	నెలలు	నెలసరి చిట్టి	విలువ
		Rs.	Rs.
LT V	50	1,00,000/-	50,00,000/-
LT D	50	50,000/-	25,00,000/-
LT CC	50	60,000/-	30,00,000/-
LT C	50	30,000/-	15,00,000/-
LT X	50	20,000/-	10,00,000/-
LT T	50	10,000/-	5,00,000/-
LT S	50	6,000/-	3,00,000/-
LT B	50	5,000/-	2,50,000/-
LT A	50	3,000/-	1,50,000/-
LT M	50	2,000/-	1,00,000/-
FT V	40	1,00,000/-	40,00,000/-
FT B	40	5,000/-	2,00,000/-
TT V	30	1,00,000/-	30,00,000/-
TT T	30	10,000/-	3,00,000/-
TT B	30	5,000/-	1,50,000/-
ST X	25	20,000/-	5,00,000/-
ST P	25	4,000/-	1,00,000/-
ST M	25	2,000/-	50,000/-

తెరపై ఈనాడు

హలో: సంగం, మెలోడి, ఊర్వశి, ఎస్టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-3

ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయ్): జగదాంబ, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్-1, ఎస్టీబీఎల్ సినీవరల్డ్ స్క్రీన్-2

సప్తగిరి ఎల్ఎల్‌బీ: వెంకటేశ్వర

ఒక్క క్షణం: కిన్నెర, విమాక్స్-1, శ్రీలక్ష్మీనరసింహ స్క్రీన్-2

2 కంట్రీస్ : శ్రీరామా, జోతి

జ్యూమంజి: వెల్కమ్ టు ది జంగిల్: శ్రీవెంకటేశ్వర, రమాదేవి (11.30, 7.00)

Insidious: The Last Key: శారద

టైగర్ జిందా హై: రమాదేవి (2.30)

అమెజాన్ అడ్వెంచర్: రమాదేవి (10.00), విమాక్స్-2

సారథి: విమాక్స్-3

శ్రీ చిలుకూరు బాలాజీ: లీలామహల్

నీ ప్రేమే నా ప్రాణం : గోకుల్

రాజాధి గ్రేట్ : శ్రీకాంతి

మెంటల్ మదిలో : పరమేశ్వరి పిక్చర్ పేలస్

చికెన్ ధరలు

బ్రాయిలర్ (బ్యాగ్) లైవ్: 90; డ్రెస్డ్: 150; స్కిన్‌లెస్: 160. వెన్‌కాబ్: ఫారం గేటు ధర: 82; లైవ్: 104; డ్రెస్డ్: 151; స్కిన్‌లెస్: 172. (కిలోకి – రూపాయలలో)

తిరుమలదర్శిని

వసతి: **రూ.500:** మార్చి 1 నుంచి 31 వరకు ఖాళీలున్నాయి. రూ.100: మార్చి 1 నుంచి 31 వరకు ఖాళీలున్నాయి, శ్రీనివాసం (రూ.200): మార్చి 1 నుంచి 31 వరకు ఖాళీలున్నాయి, దర్శనం: రూ.300 (శీఘ్రదర్శనం): ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు(మార్చి 1, 13, 18న తప్ప) ఖాళీలున్నాయి.

నోట్: దర్శన, వసతి వివరాలు : .జనవరి 10 నుంచి మార్చి 31 వరకు గల సమాచారం మాత్రమే

కల్యాణ మండపం: తితిదే కల్యాణ మండపం జనవరి 15 నుంచి 30 వరకు ఖాళీలున్నాయి.

ప్రతీ మంగళవారం సెలవు

ఫోన్ నంబర్: తి.తి.దే. కల్యాణ మండపం: 2550265

వెబ్‌సైట్: ttdsevaonline.com

నగరంలో ఈనాడు

★ ఉదయం 5.30 గంటలకు రొమ్ముక్యాన్సర్‌పై ఆర్కేబీచ్‌లో మహిళల పరుగు.

★ 6.30 గంటలకు ఎన్‌ఏడీ కొత్త రోడ్డు నుంచి కంచరపాలెం మెట్టువరకు 5కే రన్.

★ 9.30 గంటలకు ఏయూ అసెంబ్లీహాల్‌లో డీఐసీ స్టడీ సర్కిల్ మాజీ డైరెక్టర్ జి.కృష్ణ స్మృతి సమావేశం.

★ 10 గంటలకు ఎండాడ-గీతంకాలేజీ రోడ్డులో స్వామి వివేకానంద విద్యార్థి నిలయం ప్రారంభోత్సవం.

★ మధ్యాహ్నం 12.30: గంటలకు వుడా చిల్డ్రన్స్ ఎరీనాలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం అనే అంశంపై కేంద్ర మాజీ మంత్రి శరద్ యాదవ్ ప్రసంగం.

★ 3 గంటలకు ఆర్కేబీచ్ సబ్‌మెరైన్ ఎదురుగా శ్రీకృష్ణచైతన్య మిషన్ వ్యవస్థాపకులు పూరీ గోస్వామి మహరాజ్ జయంతి, సాంస్కృతిక కార్యక్రమాలు.

★ సాయంత్రం 4.30 గంటలకు విమానాశ్రయానికి మంత్రి నారా లోకేష్ రాక, పార్టీనేతలతో భేటీ.

★ 4.30 గంటలకు జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర.. వినియోగదారుల హక్కులపై ప్రతిజ్ఞ.

★ 5.30 గంటలకు ఆశీల్‌మెట్ట వామన మందిర్‌లో 4వ ఓపెన్ ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్.

★ 6 గంటలకు హోటల్ మేఘాలయలో రోటరీక్లబ్ జిల్లా గవర్నర్ సమావేశం.

★ 6.30 గంటలకు పౌరగ్రంథాలయంలో 'వినోదాల విందు' హాస్య కార్యక్రమం.

వైజాగ్ అంటే ఎంతో ఇష్టం

సినీ హీరో సందీప్ కిషన్



రేడియో మిర్చిలో హీరో సందీప్ కిషన్

సీతంపేట, న్యూస్‌టుడే: వైజాగ్ అంటే తనకు ఎంతో ఇష్టమన్నారు సినీ హీరో సందీప్ కిషన్. ఈనెల 26న తాను నటించిన 'మనసుకు నచ్చింది' సినిమా విడుదల కాబోతున్న సందర్భంగా శనివారం శంకరమఠం రోడ్డులోని రేడియో మిర్చి స్టేషన్‌కు వచ్చి కొద్దిసేపు సందడి చేశారు. రేడియో జాకీ 'మాయగాడు ప్రేమ్'తో కలిసి శ్రోతలతో ముచ్చటించారు. తాను విశాఖపట్నంలోనే పెరిగానని చెప్పారు. జగదాంబ, శారద థియేటర్లలో సినిమాలు చూసేవాడినని పేర్కొన్నారు. జగదాంబ కూడలిలో బిరియాని తినేవాడినని గుర్తుచేసుకున్నారు. ఎం.వి.పి. కాలనీలో ఫ్రోస్టీ ఐస్‌క్రీమ్ తన రోజువారీ చిరుతిళ్లలో ఉండేదన్నారు. మనసుకు నచ్చింది సినిమా ఎమోషనల్, సెంటిమెంట్‌తో కూడిన లవ్‌స్టోరీతో వస్తోందన్నారు. ప్రముఖ కథానాయకులు మహేష్‌బాబు సోదరి మంజుల దర్శకత్వం వహించారన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకు ఈ సినిమా తప్పక నచ్చుతుందని చెప్పారు. కార్యక్రమంలో రేడియో మిర్చి జాకీ అవి, సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలపాలెం: 'మనసుకు నచ్చింది' చిత్రం కథానాయకుడు సందీప్‌కిషన్ శనివారం సాయంత్రం మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌లో సందడి చేశారు. ఈ నెల 26న విడుదల కానున్న ఈ సినిమాను విజయవంతం చేయాలని కోరుతూ ప్రేక్షకులతో కాసేపు ముచ్చటించారు.

భీమిలి

మద్యం మత్తులో వాహనం నడిపిన ఏడుగురికి జైలు

ఆనందపురం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపినందుకు ఆనందపురం మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఏడుగురిపై కేసులు నమోదుచేసినట్లు ట్రాఫిక్ ఎస్ఐ సోమరాజు శనివారం వెల్లడించారు. పిల్లా తమ్మునాయుడు, దుక్క రమణ(దుక్కనిపాలెం), పాలవలస శ్రీను(పాలవలస), డి.మరిడయ్య(కల్లివానిపాలెం), చిల్లా నూకరాజు(గంభీరం), ఎం.కిశోరబాబు, జె.భాస్కరరావు(ఆనందపురం)లకు భీమిలి నాలుగో ఏఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ వీరికి రెండు రోజుల జైలు శిక్ష, రూ. 2 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

5కె రన్‌ను విజయవంతం చేయాలి

పద్మనాభం, న్యూస్‌టుడే: ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం నిర్వహించనున్న 5కె రన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూపరింటెండెంట్ వరహాలు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల మధ్య మండల కాంప్లెక్స్ ఆవరణలో ప్రారంభమయ్యే పరుగు బోని కూడలి వరకూ సాగుతుందన్నారు.

నేటి నుంచి సౌత్‌జోన్ క్రికెట్ నాకౌట్ పోటీలు

దాకమర్రి(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: ఏయూ నిర్వహిస్తోన్న సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల క్రికెట్ పోటీలు దాకమర్రిలోని రఘు కళాశాల క్రీడా మైదానంలో శనివారం హోరాహోరీగా జరిగాయి. ఆదివారం నుంచి నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. కాగా నంద్యాల ఏఎన్‌జీఆర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ వాకోవర్‌తో జేఎన్‌టీయూ కాకినాడను విజేతగా ప్రకటించారు. మరో మ్యాచ్‌లో మచిలీపట్నం కృష్ణా వర్సిటీ జట్టు 107 పరుగుల తేడాతో రాజమహేంద్రవరం ఆదికవి నన్నయ్య వర్సిటీపై విజయం సాధించింది.



కృష్ణా వర్సిటీ, ఆదికవి నన్నయ్య వర్సిటీల మ్యాచ్ దృశ్యం

బస్సుల కోసం పరుగో పరుగు

తగరపువలస, న్యూస్‌టుడే: తగరపువలస ప్రాంతంలో రద్దీ వేళల్లో బస్సుల కోసం విద్యార్థులు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా సాయంకాలం వేళ సమీపంలోని అవంతి, అనిట్స్, రఘు, విట్ ఇంజినీరింగు, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు బస్సులకోసం రోడ్లపై బారులు తీరుతున్నారు. ఏమాత్రం ఆలస్యం చేసినా బస్సు, సీటు రెండూ దొరకవన్న భావనతో జాతీయరహదారి వెంకటేశ్వరమెట్ట, ప్రధానరోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వద్ద నిలబడి పరుగులు తీస్తూ వెంటపడుతున్నారు. కొందరు ఆటోలు, జీపులు, వ్యాన్‌లలో ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. ఈ దృష్ట్యా రద్దీ వేళల్లో బస్సుల సంఖ్యను పెంచాలని పలువురు కోరుతున్నారు.



బస్సు వెంట పరుగులు తీస్తున్న విద్యార్థులు



బస్సుల కోసం తగరపువలస కూడలిలో వేచి చూస్తున్న విద్యార్థులు

సమాజ హితమే పరమావధి కావాలి

గుడిలోవ(ఆనందపురం), న్యూస్‌టుడే: సమాజ హితమే విద్య పరమావధి కావాలని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.రాంజీ అన్నారు. శనివారం గుడిలోవ గ్రామంలోని విజ్ఞాన విహార ఆవాస విద్యాలయం 38వ వార్షికోత్సవాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సుగుణాలను అలవరుచుకోవాలన్నారు. ఇండియా సెంటర్ ఫర్ మైగ్రేషన్ సీఈవో తీగెల భాస్కర్, రచయిత్రి పూసర్ల రామహరిత కూడా ప్రసంగించారు. అనంతరం విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనలను కె.రాంజీ ప్రారంభించారు. కార్యక్రమంలో విజ్ఞాన విహార కమిటీ ఛైర్మన్ ఎన్.సుబ్రహ్మణ్య శర్మ, గౌరవ అధ్యక్షులు ఎ.నారాయణస్వామి, సంచాలకులు దూసి రామకృష్ణారావు, కార్యనిర్వహణాధికారి డి.విజయకుమార్ పాల్గొన్నారు.



జ్యోతిని వెలిగిస్తున్న బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి కె.రాంజీ

మానసిక వికాసంతోనే రాణింపు

పద్మనాభం, న్యూస్‌టుడే: మానసిక వికాసంతోనే విద్యార్థులు రాణించగలరని వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహర్షి సాగర్ అన్నారు. స్థానిక కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో శనివారం వ్యక్తిత్వ వికాసంపై తరగతులు నిర్వహించారు. మానసికంగా దృఢంగా ఉంటే జీవితంలో ఎంతటి లక్ష్యాలనైనా సులభంగా చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి గంగ, ఉపాధ్యాయినులు నాగలక్ష్మి, ప్రమీల, హైమావతి, లలిత తదితరులు పాల్గొన్నారు.

భీమిలి

నేడు సహకార సంఘం మహాజన సభ

అడివివరం, న్యూస్‌టుడే : అడివివరం సహకార పరపతి సంఘం మహాజన సభ ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు కర్రి స్వామి శనివారం తెలిపారు. స్థానిక ప్రియాగార్డెన్స్‌లోని బృందావనం కల్యాణ మండపంలో ఉదయం 9.45 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాలని కోరారు. సభ్యులకు డెవిడెండ్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

తెరపై ఈనాడు

తాతా : ఒక్కక్షణం
సప్తగిరి : ఎంసీఏ
గణేశ్ : హలో
దుర్గా : ఎంసీఏ
(మధురవాడ)



మౌలిక వసతులపై కమిషనర్ ఆరా

ఎండాడ, న్యూస్‌టుడే : వివేకానంద్‌నగర్ (ఎండాడ), దసపల్లా లేఅవుట్ తదితర ప్రాంతాల్లో శనివారం జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ జోన్-1 ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలోని మౌలిక వసతులపై ఆరా తీశారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ తడి, పొడి వ్యర్థాలను ఆరు బయట పారేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని కాలనీవాసులకు సూచించారు. ఈ సందర్భంగా సాగర్‌నగర్ నుంచి వివేకానంద్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో వేగనిరోధకాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో జోన్-1 కమిషనర్ పీఎం సత్యవేణి, పలు విభాగాల అధికారులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.


మౌలిక వసతులపై ఆరా తీస్తున్న కమిషనర్ హరినారాయణన్

'సుజలం' అందేనా...?

ప్రారంభానికి నోచుకోని శుద్ధ మంచినీటి కేంద్రం

న్యూస్‌టుడే, ఎండాడ

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జీవీఎంసీ ఆరోవార్డులో నిర్మించిన ఎన్టీఆర్ సుజల కేంద్రం ప్రారంభానికి నోచుకోకపోవడంతో... స్థానికులు శుద్ధమైన తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 9 లక్షల రూపాయలతో నిర్మించిన కేంద్రంలో అన్ని యంత్ర పరికరాలను ఏర్పాటు చేశారు. ఎండాడ, సాగర్‌నగర్, రుషికొండ, జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్ తదితర ప్రాంత ప్రజలకు రెండు రూపాయలకే 20 లీటర్ల మంచినీరు ఇవ్వాలని ఏర్పాటు చేసిన కేంద్రం అందుబాటులోకి రాకపోవడంతో ఈ ప్రాంత ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి... వెంటనే కేంద్రాన్ని ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రారంభానికి నోచుకోని ఆర్వోప్లాంట్ భవనం


ఎండాడ సామాజిక భవనం వద్ద ఏర్పాటు చేసిన బోరు

శ్రీకృష్ణుడిగా దర్శనమిచ్చిన అప్పన్న

సింహాచలం, న్యూస్‌టుడే : సింహగిరిపై అప్పన్నస్వామి శనివారం శ్రీకృష్ణుడి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాపత్ ఉత్సవాల్లో భాగంగా దేవాలయంలోని స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి, పూజలు చేశారు. అనంతరం తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించి, స్వామికి మంగళస్నానం చేయించారు.



విద్యార్థులకు కరాటే పోటీలు


కరాటే పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో నిర్వాహకులు

ఎండాడ, న్యూస్‌టుడే : పీఎంపాలెం బేతని పాఠశాల మైదానంలో శనివారం కరాటేలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. యునైటెడ్ షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ ఇండియా (యూఎస్‌కేవోఐ) ఉత్తర్వుల మేరకు పోటీలు జరిపినట్లు సంబంధిత కరాటే విభాగం ఆంధ్ర చీఫ్ మాస్టర్ టి.సాయికుమార్ తెలిపారు. అండర్-16 విభాగంలో జరిగిన పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన 35 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో జాతీయ స్థాయిలో గెలుపొందిన భార్గవ్ సాయి, అఖిలేష్, రోహిత్‌సాయి ఇక్కడ కూడా ప్రతిభ చూపి, యూఎస్‌కేవోఐ అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించారన్నారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు తెదేపా వార్డు అధ్యక్షుడు ఎం.సోంబాబు, యూఎస్‌కేవోఐ ఇండియా చీఫ్ డైరెక్టర్ జి.సువర్ణరాజు, బేతని పాఠశాల కరస్పాండెంట్ రిచర్డ్ శామ్సన్, ప్రిన్సిపల్ సునీతాశామ్సన్‌లు బెల్ట్‌లతో పాటు ధ్రువపత్రాలు అందజేశారు.

సీఐ వెంకటరావుపై మరో మహిళ ఫిర్యాదు

అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆరోపణ

ఈనాడు, విశాఖపట్నం: ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న అభియోగంపై ఇటీవల సస్పెన్షన్‌కు గురైన విశాఖ మూడోపట్టణ సి.ఐ. బెండి వెంకటరావుపై తాజాగా మరో మహిళ ఫిర్యాదు చేశారు. ఆమె శనివారం నగర పోలీస్ కమిషనర్ యోగానంద్‌ను కలిసి తనను వెంకటరావు అసభ్యపదజాలంతో దూషించారని చెప్పారు. దీని ఆధారంగా సీఐపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

నేడు ఐఈఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కొమ్మాది, న్యూస్‌టుడే : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఐఈఎస్) ప్రిలిమినరీ పరీక్షను ఆదివారం చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పరీక్ష కేంద్ర పర్యవేక్షకులు ఎం.రాజబాబు తెలిపారు. ఇక్కడి కేంద్రంలో 17 గదులు కేటాయించామని, మొత్తం 400 మంది విద్యార్థులు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పేపర్-2 పరీక్షను రాయనున్నారన్నారు. 36 మంది ఇన్విజిలేటర్లతో ప్రశాంతంగా పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.


ఇన్విజిలేటర్లుకు సూచనలు ఇస్తున్న రాజబాబు

వాకర్స్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం ఫ్రెండ్స్ వాకర్స్ క్లబ్ నూతన కమిటీ అధ్యక్షుడి ఎంపిక కోసం ఈనెల 28న ఎన్నిక జరగనుందని క్లబ్ ఎన్నికల అధికారి కె.ఎన్.ప్రమోదచక్రవర్తి శనివారం తెలిపారు. ఆదివారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తామన్నారు. 16 నుంచి 23 మధ్య నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. క్లబ్ సభ్యుల్లో ఎవరైనా నామినేషన్ వేయవచ్చన్నారు.

గాజువాక

ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు ప్రారంభం

గాజువాక, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా గాజువాక ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నరవలో ఎన్ఎస్ఎస్ వారోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి ఎస్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి రోజూ ప్రత్యేక సేవా కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

అనాథ బాలలకు దుస్తుల పంపిణీ

షీలానగర్ (అక్కిరెడ్డిపాలెం): అనాథ బాలలకు చేయూతనిచ్చి ఆదుకోవాలని వైకాపా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి అన్నారు. శనివారం షీలానగర్, పంతులుగారి మేడ అనాథాశ్రమాల్లోని బాలలకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త ఏడాది పురస్కరించుకొని అనాథ బాలలకు దుస్తులు అందజేశామన్నారు. కార్యక్రమంలో జి.కృష్ణ, బుజ్జి, అమర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తొలిసారిగా నల్లటి గౌను, తలపై టోపీ, చేతిలో పట్టాలతో విజయహాసంతో పట్టభద్రులు సందడి చేశారు. ఇంజినీరింగ్‌లో డిగ్రీ పట్టా చేతికి రావడంతో ఒక్కసారిగా యువత కళ్లల్లో కోటి కాంతులు వెల్లివిరిశాయి. ఉన్నత, సాంకేతిక విద్యలో తామేమీ తీసిపోలేదని వారు నిరూపించారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన యువతరంగ్-2018లో పట్టాల పంపిణీ, అతిథులకు సత్కారం వంటి కార్యక్రమాలతో పాటు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. డిగ్రీ పట్టాలు సాధించిన వారి అభిప్రాయాలు ఇలా..

–న్యూస్‌టుడే, గాజువాక, కూర్మన్నపాలెం



యువ విజేతల విజయహాసం

ఉల్లాసంగా... ఉత్సాహంగా...

ఘనంగా విజ్ఞాన్ యువతరంగ్-2018

మరచిపోలేని అనుభూతి..



ఇంజినీరింగ్ పూర్తి చేశాక క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగిగా ఓ సంస్థకు ఎంపికయ్యాను. పట్టుదలతో చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నది నా విషయంలో రుజువైంది. మెకానికల్ విభాగంలో 88 శాతం మార్కులతో బంగారు పతకం పొందడం జీవితంలో మరచిపోలేని అనుభూతి.

–శుభం బిస్వాల్, గోల్డ్ మెడలిస్టు

మనకంటూ ఓ లక్ష్యం ఉండాలి..



ముందు నుంచి మనకంటూ ఓ లక్ష్యం ఏర్పరచుకోవాలి. ఈఈఈ చేసి 84.4 మార్కులతో బంగారు పతకం పొందడం చాలా ఆనందంగా ఉంది. ఎంటెక్ పూర్తి చేసి మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఉంది. అందరినీ ఒకేచోట ఏకం చేసి గ్రాడ్యుయేషన్ డే యువతరంగ్ పేరుతో నిర్వహించడం నూతనోత్సాహాన్నిచ్చింది. ఈ జ్ఞాపకాలను పదిలంగా దాచుకుంటాం.

–సీరపు దీపిక, గోల్డ్ మెడలిస్టు

కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో..



బీ ఫార్మసీలో 84.3 శాతంతో బంగారు పతకం లభించడం చాలా ఆనందంగా ఉంది. ఉన్నత ఆశయాలు, ఆకాంక్షలు నెరవేర్చుకోవడానికి ఇది మొదటి మెట్టుగా నిలుస్తుంది. అధ్యాపకులు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతోనే విజయాలు సొంతమయ్యాయి.

–ఇషా బేగం, గోల్డ్‌మెడల్



అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

గేట్‌లో ర్యాంకే లక్ష్యం..



సివిల్ ఇంజినీరింగ్‌లో 84.69 శాతం మార్కులతో సాటి విద్యార్థుల మధ్య ముందు వరసలో నిల్చోవడం నిజంగా అదృష్టం. గేట్‌లో ర్యాంకు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతాను. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన నాకు ఉన్నత ఉద్యోగంలో స్థిరపడాలని ఉంది.

–రాయవరపు సూర్యకళ, సివిల్ ఇంజినీర్

యువతలో స్ఫూర్తి నింపుతాయి..



మంచి ఉద్యోగంలో స్థిరపడడానికి, బంగారు భవితకు బాటలు వేసుకోవడానికి ఇంజినీరింగ్ విద్య దోహదపడుతుంది. ఇలాంటి వేడుకలు యువతలో ఎంతో స్ఫూర్తిని నింపుతాయి.

–ఎస్.కె.ఎస్.సునీల్, మెకానికల్, సీతమ్మపేట, విశాఖ

చెన్నైలో పని చేస్తున్నా...



ఇంజినీరింగ్ విద్య పూర్తి చేశాక చెన్నైలో ఒక కార్పొరేట్ సంస్థలో ఉద్యోగం లభించింది. 2017 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులకు ఒకే సారి పట్టాలు ఇవ్వడం ఎంతో సంతోషం కలిగిస్తోంది. సబ్బవరం మండలం బాటజంగాల పాలెం నుంచి ఉన్నత ఉద్యోగిగా స్థిరపడడానికి ఇంజినీరింగ్ విద్య ఎంతో తోడ్పడింది.

–కె.జాన్సీ, సిల్వర్ మెడలిస్టు

ఐలా కమిషనర్‌కు అభినందనలు

ఆటోనగర్, న్యూస్‌టుడే: గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో పన్ను వసూలు సాధించిన ఐలా కమిషనర్ వేణుగోపాల్‌ను పలువురు అభినందించారు. శనివారం ఐలా కార్యాలయంలో మాజీ కార్యదర్శి బాపిరాజు ఆధ్వర్యంలో సభ్యులు కమిషనర్‌ను సత్కరించారు. పన్నులు సకాలంలో చెల్లించాలని ఆటోనగర్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. కమిషనర్‌ను అభినందించిన వారిలో శేషగిరిరావు, కొల్లి సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.



వేణుగోపాల్‌ను అభినందిస్తున్న సభ్యులు

అనుసంధాన కాలువ పనులు షురూ

ఉక్కునగరం, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు కర్మాగారానికి నీటి కొరత తీర్చేందుకు కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్-1 నుంచి కేబీఆర్-2ను కలిపే కాలువ పనులు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. జాతీయ రహదారిని ఆనుకొని సుమారు 400 కోట్లతో ఎల్ అండ్ టీ ఆధ్వర్యంలో ఈ పనులను చేపడుతున్నారు. ఉక్కు అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సెంట్రల్ సేఫ్టీ కమిటీ ప్రతినిధులు, ట్రాఫిక్ పోలీసులు శనివారం పనులను పరిశీలించారు. అనుసంధాన కాలువ నిర్మాణానికి 90 రోజుల సమయం పడుతుందని ఎల్ అండ్ టీ సంస్థ అధికారులు తెలిపారు. అధికారులు సంజీవరావు, ట్రాఫిక్ సీఐ టి.లక్ష్మి, కార్మిక నాయకులు రామచంద్రరావు, నీలాపు సైనికుడు, లెనిన్ బాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఉక్కు అధికారులు తదితరులు

అంబేడ్కర్ క్యాలెండర్ ఆవిష్కరణ

ఉక్కునగరం, న్యూస్‌టుడే: ప్రపంచ మేధావుల్లో అగ్రగణ్యుడుగా, అన్ని దేశాలు గుర్తించిన మేధావి అంబేడ్కర్ అని ఉక్కు డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) సంజీవరావు అన్నారు. విశాఖ ఉక్కు ఎస్సీ, ఎస్టీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రచురించిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను కర్మాగారంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ ట్రస్ట్ ఇండియా జాతీయ కన్వీనర్ బయ్యే మల్లయ్య మాట్లాడారు. సంజీవరావు చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశంలోనైనా ఎస్సీ, ఎస్టీలకు ప్రైవేటు రంగంలో, పదోన్నతుల్లో, జుడీషియల్‌లో రిజర్వేషన్ అమలు బిల్లు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. కృష్ణారావు, మోహన్, శ్రీనివాసరావు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సంజీవరావు తదితరులు

మనస్తాపంతో తాపీమేస్త్రీ ఆత్మహత్య

వికాస్‌నగర్ (ఆటోనగర్), న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఉరేసుకొని తనువు చాలించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బీసీ రోడ్డు వాంబేకాలనీలోని 10వ బ్లాకులో నివాసముంటున్న కెల్లా చిన్నారావు (55) తాపీ మేస్త్రీగా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం తన గదిలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలికి వెళ్లిన గాజువాక శాంతి భద్రతల ఎస్సై భాస్కరావు మృతుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి శిక్షణ గోడపత్రిక ఆవిష్కరణ

గాజువాక, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్టూడెంట్స్ సర్వీస్ సొసైటీ (ఎస్ఎస్ఎస్) సంయుక్తాధ్వర్యంలో ఎస్సీ నిరుద్యోగ యువతకు నిర్వహించే ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గాజువాక క్యాంపు కార్యాలయంలో గోడపత్రికను ఎస్ఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ అధ్యక్షతన గోడ పత్రికలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి అర్హత ఉంటే చాలని, పలువురు నిష్ణాతులైన శిక్షకులు ఉచిత శిక్షణను అందించడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. సంస్థ సభ్యులు రమ్యకళ, సురేంద్ర, విమ్స్ డైరెక్టర్ కార్తీక్, గణేష్‌లు మాట్లాడారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు 98668 03139 నంబరు గల చరవాణిలో సంప్రదించాలని వారు కోరారు. ఈనెల 8 నుంచి గాజువాకలో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వారు తెలిపారు.



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి వైకాపా కృషి

షీలానగర్ (అక్కిరెడ్డిపాలెం), న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి వైకాపా కృషి చేస్తుందని విశాఖ వైకాపా పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తైనాల విజయ్‌కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం జీవీఎంసీ 65వ వార్డు హరిజన జగ్గయ్యపాలెంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తైనాల పరిసర ప్రాంత ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెదేపా ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. వైకాపా నాయకులు నాగిరెడ్డి, అప్పలరామ్మూర్తి, యువశ్రీ, నూకరాజు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.



రచ్చబండలో పాల్గొన్న వైకాపా నాయకులు తైనాల, యువశ్రీ తదితరులు

గాజువాక

నేడు గాజువాకలో 5కె రన్

గాజువాక, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాత గాజువాకలో 5కె రన్ నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ సోమన్నారాయణ తెలిపారు. ఉదయం 5.30 గంటలకు ఈ పరుగును ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభిస్తారన్నారు. సినిమా హాలు కూడలి మీదుగా కొత్త గాజువాక వరకు పరుగు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

పెదమడక జన్మభూమిలో ఎమ్మెల్యే పల్లా

అగనంపూడి, న్యూస్‌టుడే: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ 56, 57 వార్డులకు సంబంధించి శనివారం పెదమడక కాలనీలో ఏర్పాటైన గ్రామసభలో ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుంటే ప్రతిపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. కర్ణంవానిపాలెం నిర్వాసితులకు త్వరలోనే పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. గత జన్మభూమిలో ఇచ్చిన హామీ మేరకు దువ్వాడ స్టేషన్ రహదారి విస్తరణ, జాతీయ రహదారి విద్యుదీకరణ పనులు చేపట్టామని తెలిపారు. ఉక్కు ఆర్.కార్డుల సమస్య, ఫార్మాసిటీ నిర్వాసితుల ఉపాధి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. జోనల్ కమిషనర్ సోమన్నారాయణ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. జన్మభూమి ప్రత్యేక అధికారి సకలరెడ్డి, పౌరసరఫరాల శాఖ ఎఎస్‌వో భీమశంకరరావు, ఎఎంహెచ్‌వో జయరాం, ఈఈ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

సభలో గందరగోళం..

జన్మభూమిలో తెదేపా, వైకాపా నాయకుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటు చేసుకుంది. ఫార్మాసిటీ నిర్వాసితుల ఉపాధి విషయమై 56వ వార్డు తెలుగు యువత అధ్యక్షుడు కర్రి దశేంద్ర మాట్లాడుతుండగా వైకాపా నాయకులు గుర్రం శ్రీను, నక్కా రమణబాబులు అడ్డు తగిలారు. ఎమ్మెల్యే పల్లా కలుగజేసుకుని ఆరోపణలు చేసుకోవడానికి రాజకీయ వేదిక కాదని, ఏవైనా సమస్యలు ఉంటే వినతి పత్రం అందించాలని కోరారు.

ఆటోనగర్, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా తుంగ్లాంలో శనివారం జన్మభూమి వార్డు ఇన్‌ఛార్జి ఏఈ సుమిత్ర ఆధ్వర్యంలో ఖోఖో, కబడ్డీ వంటి పోటీలను నిర్వహించారు. స్థానిక యువత క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. తెదేపా నాయకులు కాకి గోవిందరెడ్డి పోటీల ఏర్పాట్లను సమీక్షించారు.

నేడు జీవీఎంసీ 65వ వార్డులో జన్మభూమి

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 65వ వార్డులో జన్మభూమి-మాఊరు కార్యక్రమం అక్కిరెడ్డిపాలెంలో నేడు నిర్వహించనున్నట్లు వార్డు తెదేపా నాయకులు గుమ్మడి కల్యాణ్ తెలిపారు. జన్మభూమి ప్రత్యేక అధికారి, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. వార్డు ప్రజలు పాల్గొని సమస్యలను, సలహాలను తెలియజేయాలని కల్యాణ్ కోరారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలుచోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించారు. నడుపూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీలను హెచ్‌ఎం పీవీఎస్ఎస్ఎస్ ఆంజనేయ పరిశీలించారు. ఉపాధ్యాయులు నారాయణ, రమణమ్మ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

* గాజువాక 50, 63, 64 వార్డుల్లో తెలుగు మహిళలు, జన్మభూమి కమిటీ సభ్యులు ముగ్గుల పోటీలు, స్వచ్ఛత, ఓడీఎఫ్ కార్యక్రమం నిర్వహించారు.



నడుపూరు పాఠశాల ఆవరణలో ముగ్గులను పరిశీలిస్తున్న హెచ్ఎం ఆంజనేయ తదితరులు

ఉక్కు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో యాజమాన్యం తాత్సరం చేయడం తగదని శనివారం హెచ్ఎంఎస్ నాయకులు డి. అప్పారావు, జి.గణపతిరెడ్డి ఉక్కు యాజమాన్యానికి హితవు పలికారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు.





హెచ్‌ఆర్‌ఏ చెల్లింపునకు అంగీకారం హర్షణీయం

ఉక్కునగరం, న్యూస్‌టుడే: నూతన బేసిక్‌పై 20 శాతం హెచ్‌ఆర్‌ఏను చెల్లించేందుకు విశాఖ ఉక్కు యాజమాన్యం అంగీకరించడం హర్షణీయమని గుర్తింపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంధం వెంకటరావు, మంత్రి రాజశేఖర్ అన్నారు. సంఘం కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు మూడు రోజుల్లో 3 నెలల బకాయిలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఒక్కో కార్మికుడికి రూ.1,400-3,100 వరకు ప్రతి నెలా లబ్ధి చేకూరనున్నట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా అధికారులకు, ఇతర కార్మిక సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. సంపూర్ణం, మురళీరాజు, రామచంద్రరావు, గౌరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2,150కి చేరుకున్న ఓబీసీ సభ్యత్వం

ఉక్కునగరం, న్యూస్‌టుడే: ఉక్కు కర్మాగారంలో పని చేస్తున్న ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యత్వం శనివారం నాటికి 2,150కి చేరుకున్నట్లు సంఘం ప్రతినిధులు కోమటి రవి శంకర్, నమ్మి తాతారావు, చంద్రరావు, ఎన్.అప్పలరాజు తెలిపారు. కర్మాగారంలో సుమారు 5,000 మంది ఉద్యోగులు ఉండగా ఇప్పటి వరకూ 2,150 మంది సభ్యులుగా నమోదు చేసుకున్నారన్నారు. ఈ నెల 31 వరకు ఉక్కు యాజమాన్యం గడువు ఇచ్చిందని, త్వరలోనే మిగతా వారు సభ్యత్వం తీసుకోవాలని వారు కోరారు.

ఇగ్నోలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

శ్రామికనగర్ (గాజువాక), న్యూస్‌టుడే: ఇగ్నోలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు గడువును ఈనెల 31 వరకు పొడిగించినట్లు ఎంవీఆర్ కళాశాల స్పెషల్ స్టడీ సెంటర్ కో-ఆర్డినేటర్ ఎస్.వి. కృష్ణ తెలిపారు. పీజీ, యూజీ, డిప్లొమా సర్టిఫికేట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఫీజు రియంబర్స్‌మెంటు ఉంటుందన్నారు. వివరాలకు ఎంవీఆర్ కళాశాలలోని ఇగ్నో సెంటర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

గాజువాక, న్యూస్‌టుడే: జాతీయ రహదారి చినగంట్యాడ కూడలి వద్ద శనివారం మధ్యాహ్నం టెక్కలి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బ్రేకులు పనిచేయకపోవడంతో త్రుటిలో పెను ప్రమాదమే తప్పింది. గాజువాక పోలీసుల వివరాల ప్రకారం.. విశాఖ ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి ఉదయం 11.30 గంటలకు రాజమండ్రికి 9 మంది ప్రయాణికులతో బస్సు బయలుదేరింది. బస్సు చినగంట్యాడ సిగ్నల్ కూడలికి వచ్చే సరికి బ్రేకులు ఫెయిలైనట్లు గుర్తించిన డ్రైవర్ నారాయణ ఎంతో చాకచక్యంగా చేతి బ్రేకును ఉపయోగించాడు. దీంతో ముందు భాగంలో నిలిచి ఉన్న లారీని ఢీకొని బస్సు ఆగిపోయింది. ఈ ప్రమాదంలో బస్సు క్యాబిన్ నుజ్జయింది. డ్రైవర్ స్టీరింగ్ రాడ్ మధ్యలో చిక్కుకోవడంతో స్థానికులు బయటకు తీశారు. అదృష్టవశాత్తూ ఎవరికీ ఏమీ ప్రమాదం జరగలేదు. ఆర్టీసీ సిబ్బంది క్రేన్ సాయంతో బస్సును పక్కకు తప్పించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొని వ్యాన్ ధ్వంసం

గాజువాక, న్యూస్‌టుడే: గాజువాక పోలీసు ఠాణా కూడలి వద్ద శనివారం పెయింటింగ్ డబ్బాలు కలిగిన వ్యాను అదుపు తప్పడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. పోలీసుల ప్రకారం.. శ్రీనగర్ నుంచి పెయింటింగ్ డబ్బాలతో పాతగాజువాక వైపు వ్యాను వస్తుండగా ఒక్కసారిగా బ్రేకులు ఫెయిలవడంతో ముందు ఉన్న లారీని ఢీకొని వ్యాను ఒక పక్కకు ఒరిగింది. దీంతో వ్యానులో ఉన్న డబ్బాలు నేలపై పడడంతో పెయింటింగ్ అంతా నేలపాలైంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శ్రీను రెండు కాళ్లు విరిగిపోయినట్లు పోలీసులు తెలిపారు. బాధితున్ని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాజువాక పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన ఆర్టీసీ బస్సు ముందు భాగం



గాజువాక పోలీసు ఠాణా కూడలి వద్ద..



విశాఖ తూర్పు

మత్స్యకారులకు క్షమాపణ చెప్పాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : మత్స్యకారులపై దురుసుగా మాట్లాడిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారికి బహిరంగ క్షమాపణ తెలియజేయాలని వైకాపా జిల్లా అధికార ప్రతినిధి పీతలమూర్తియాదవ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని కలిసిన మత్స్యకారులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడటం బాధాకరమన్నారు.

అలరించిన అన్నమయ్య గాత్రకచేరి

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే : ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఎం.ఎం.టి.సి. త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన అన్నమయ్య సంకీర్తనా గాత్రకచేరి ఆహూతులను అలరించింది. వారణాసి వేంకటేశ్వరశర్మ, బుక్కపట్నం కృష్ణమాచారిలు వేంకటేశ్వరస్వామి దివ్య చరిత్రను పాటలరూపంలో కళ్ల ముందు ఉంచారు. ప్రతీరోజూ స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, అర్చనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యదర్శి సావిత్రి తెలిపారు.

సమస్యలతో సహవాసం..

శిథిలాల్లోనే నివాసం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే :

బీటలు వారిన గోడలు.. దెబ్బతిన్న కిటికీలు.. శిథిలమైన మరుగుదొడ్లు.. పైపుల లీకులు.. తలుపులు లేని క్వార్టర్లు.. కూలిపోయే స్థితిలో గోడలు, అడవిని తలపించే తుప్పలు.. తుప్పల్లో పాములు.. ఇదీ ఆంధ్రా విశ్వవిద్యాలయంలోని ఉద్యోగుల క్వార్టర్ల పరిస్థితి. కొందరు ఉద్యోగులు చిన్న చిన్న మరమ్మతులు చేసుకొని అక్కడే కాలం వెళ్లదీస్తున్నారు.

దారుణంగా ఏయూ ఉద్యోగుల క్వార్టర్లు

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్లేయుల కాలంలో కట్టిన పలు నిర్మాణాల్లో కొన్ని నేడు శిథిల స్థితిలో ఉన్నాయి. మరి కొన్ని వినియోగానికి అనువుగా లేవు. ఆచార్యులు, ఉద్యోగుల నివాస సముదాయాలు (క్వార్టర్లు) చాలావరకు శిథిలమయ్యాయి. ఆచార్యులు, బోధనాధికారులకు మద్దిలపాలెం, సిరిపురం, శివాజీపాలెం, సాగర తీరంలో దాదాపు 120 క్వార్టర్లు నిర్మించారు. బోధనేతర ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బందికి దాదాపు 208 క్వార్టర్లు ఉన్నాయి. వీటిలో చాలావరకు నేడు దెబ్బతిన్నాయి. కొన్ని శిథిలం కావడంతో కూల్చేశారు. మరి కొన్ని తుప్పలతో నిండి విషసర్పాలకు, అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయి. మరి కొన్ని నివాసాలు శ్లాబ్‌లు లీకయి వర్షాల సమయంలో నీళ్లు చేరుతున్నాయి. గోడలు బీటలు వారి ఉన్నాయి. తలుపులు.. కిటికీలు పాడయ్యాయి. మరుగుదొడ్లు శిథిలమయ్యాయి. సమస్యలకు నివాస గృహాలు చిరునామాగా మారాయి. ప్రధానంగా కనీస నిర్వహణ లేకపోవడం వల్ల కొన్ని క్వార్టర్లు మరీ అధ్వానంగా మారాయి.



పిచ్చి మొక్కలతో నిండి నిరుపయోగంగా మారిన ఏయూ ఆచార్యుల క్వార్టర్



క్వార్టర్ లోపల స్థితి

సమస్యలతోనే సహవాసం..

విశాఖలో సదుపాయాలతో కూడిన ఇళ్లలో నివాసం ఉండాలంటే అద్దె ధరలు అధికం. సాధారణ అద్దెలకు ఇళ్లు కావాలంటే దూరప్రాంతాలకు వెళ్లాలి. నిర్ణీత సమయంలోగా విధులకు హాజరవ్వాలంటే అందుబాటు దూరంలోనే ఉండాలి. అదే క్వార్టర్లలో ఉంటే సమయం ఆదా అవుతుందన్న ఉద్దేశంతో నివాసానికి అనుకూలంగా లేకపోయినా చాలామంది ఆచార్యులు, ఉద్యోగులు ఈ క్వార్టర్లలోనే ఉంటున్నారు. ఉద్యోగుల నుంచి అద్దె వసూలు చేస్తున్నా సదుపాయాలపై కనీస చర్యలు లేవు. దీంతో విధిలేని పరిస్థితుల్లో చాలామంది ఉద్యోగులు కొద్దిపాటి మరమ్మతులు చేసి నివాసానికి అనువుగా మార్చుకొని కాలం వెళ్లదీస్తున్నారు. మరి కొందరు సొంత సొమ్ములతో పూర్తి స్థాయి మరమ్మతులు చేయడమే కాక రంగులు సైతం వేసుకొని నివాసం ఉంటున్నారు. సొంత సొమ్ములతో బాగు చేసిన క్వార్టర్లను ఆయా కారణాల వల్ల అధికారులు ఇతరులకు కేటాయిస్తున్న సందర్భాల్లో నష్టపోతున్నారు.

బహుళ అంతస్థులు నిర్మాణాలు...



ఆచార్యులు, ఉద్యోగులకు నివాస సముదాయాలు చాలా అవసరం. ప్రస్తుత క్వార్టర్లలో ఇబ్బందులు చాలానే ఉన్నాయి. ఇందుకు ప్రత్యామ్నాయంగా బహుళ అంతస్థుల నిర్మాణాలకు రెండేళ్ల కిందటే ప్రతిపాదించాం. సముద్ర తీర ప్రాంతం కావడం వల్ల తుప్పుపట్టి నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. ప్రతి ఏటా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఆచార్యులు, అధికారులకు 3 పడక గదుల ఫ్లాట్‌లు, సిబ్బందికి రెండు పడక గదుల ఫ్లాట్‌లను నిర్మించ దలిచాం. రూ.2 కోట్లకు బడ్జెట్ సిద్ధం చేశాం. శివాజీపాలెంలోని ఏయూ ఇంటర్నేషనల్ వసతి గృహానికి ఎదురుగా రెండు స్థలాలు ఉన్నాయి. ఇక్కడ నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. త్వరలో నిర్మాణాలు కార్యరూపం దాల్చుతాయి.

– ఆచార్య వి.ఉమామహేశ్వరరావు, రిజిస్ట్రారు, ఆంధ్ర విశ్వవిద్యాలయం



శిథిల స్థితిలో...

ఆసుపత్రి నిర్మాణానికి రూ. 22.35 లక్షల విరాళం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పరవాడలో 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి మైలాన్ ల్యాబొరేటరీ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ. 22.35 లక్షల విరాళం అందించింది. మైలాన్ ల్యాబొరేటరీ సంస్థ ప్రతినిధులు వి.మోహన్, సునీల్‌వాద్వా, వెంకటఅచ్యుతరాజు, సరస్వతిరావు, బ్రహ్మాజీలు శనివారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి చెక్కును అందించారు.



కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు చెక్కును అందచేస్తున్న మైలాన్ ల్యాబొరేటరీ సంస్థ ప్రతినిధులు

దయాల్‌నగర్ కాలనీ సందర్శన

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే : ఆరోవార్డు విశాలాక్షినగర్ పరిధిలోని దయాల్‌నగర్ కాలనీని పాతనగరంలోని క్వీన్‌మేరీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సందర్శించారు. ఇక్కడ తయారవుతున్న సేంద్రియ రువుల గురించి తెలుసుకున్నారు. కాలనీలోని సబ్బుల తయారీ యూనిట్లను పరిశీలించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పేరి సుబ్బారావు, కె.రామం, పి.కమల తదితరులు పాల్గొన్నారు.



సబ్బుల తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థినులు

వేలిముద్రలు లేకుండా సరకులివ్వాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : చౌకధరల దుకాణాల ద్వారా అందజేస్తున్న చంద్రన్న సంక్రాంతి కానుకలు లబ్ధిదారుల వేలిముద్రలు లేకుండా సరకులు అందజేయాలని సీపీఐ నాయకుడు పడాల గోవింద్ డిమాండ్ చేశారు. శనివారం మద్దిలపాలెం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రేషన్‌డిపోల్లో నిత్యావసర సరుకులు రద్దుచేసి కేవలం బియ్యం ఒక్కటే అందజేస్తున్నారన్నారు. వేలిముద్రలతో సంబంధ లేకుండా సంక్రాంతి సరకులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, పౌరసరఫరాల శాఖాధికారులు వీటిపై దృష్టిసారించాలని కోరారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు పడాల.గోవింద్

కోడి పందేలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వండి



పోలీసులు స్వాధీనం చేసుకున్న కోళ్లు

ఆరిలోవ, న్యూస్‌టుడే: కోడి పందేలను నిర్వహిస్తే ఎవరైనా సరే సమాచారం ఇవ్వాలని ఆరిలోవ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖరావు కోరారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. శనివారం మూడో వార్డు పరిధిలోని బి.ఎన్.ఆర్.నగర్ వద్ద కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. షేక్ ఖలీల్, షేక్ మస్తాన్‌లపై కేసు నమోదు చేశామన్నారు. కోడి పందేలు, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమాచారాన్ని తన ఫోన్ నెంబరు 94906 24815కు ఇవ్వవచ్చని తెలిపారు.

ప్రథమలో సీజీహెచ్ఎస్ ప్రారంభం

ఇసుకతోట(ఎం.వి.పి.కాలనీ), న్యూస్‌టుడే: వెంకోజీపాలెం దరి ప్రథమ ఆసుపత్రిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఆరోగ్య పథకం (సి.జి.హెచ్.ఎస్.) నమోదు, ఒపీడీ ఛాంబర్లు, వార్డులను శనివారం రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోగకరమన్నారు. ప్రథమ ఆసుపత్రి ఎం.డి. డాక్టర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఐవిఎఫ్, ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్ మినహాయించి మిగిలిన అన్ని వైద్య సదుపాయాలను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, తెదేపా ప్రధాన కార్యదర్శి సి.వి.పట్టాభిరామ్, డాక్టర్ ఆదినారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

బాధితురాలి దరఖాస్తులను పరిష్కరించాం :కలెక్టరు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, సాంఘిక సంక్షేమశాఖ డి.డి. రమణమూర్తిపై విశాఖ ఎంవీపీ పోలీసులు ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఘటనపై కలెక్టరు స్పందించారు. శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బాధిత యువతి కేసుకు సంబంధించి దరఖాస్తు పరిష్కారం, పరిహారం చెల్లింపులో ఎలాంటి ఆలస్యం జరగలేదని స్పష్టం చేశారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో ఎప్పటికప్పుడు సరైన చర్యలను తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశాలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ కేసుల విచారణ, పరిష్కారానికి చర్యలను తీసుకుంటున్నామని చెప్పారు. 'తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన ఆకుల శివన్నారాయణమూర్తిపై బాధిత మహిళ ఎం.వి.పి.పోలీసు స్టేషన్‌లో 2016 ఆగస్టు 12న ఫిర్యాదు చేసింది. ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. పరిహారం కోసం ఆ ఎఫ్ఐఆర్ ప్రతిని జత చేసి బాధిత మహిళ 2016 ఆగస్టు 26న సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తు చేసింది. దీనిపై పోలీసు కమిషనర్ కార్యాలయం 2016 సెప్టెంబరు 17న ఇచ్చిన సమాచారం పరిశీలించి 2016 సెప్టెంబరు 23న బాధితురాలికి రూ. 25 వేలు మంజూరు చేశాం. ఇది చాలదని, ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం ఆర్థిక సహాయం ఇవ్వాలని ఆమె అదే ఏడాది అక్టోబరులో దరఖాస్తు చేసింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇచ్చిన న్యాయ సలహా మేరకు 2016 డిసెంబరు 10న మరో రూ. 3.50 లక్షలు మంజూరు చేశాం. 2017 జనవరి 7న ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేశాం' అని కలెక్టరు వివరించారు.

విశాఖ తూర్పు

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: ప్రభుత్వ జన్మభూమి - మావూరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం ఎంవీపీకాలనీ ఎ.ఎస్.రాజా మహిళా జూనియర్ కళాశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జి.వి.నారాయణమూర్తి, అధ్యాపకులు యు.వి.ఎస్.ఎన్.మణికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఆరోగ్య పరీక్షలు

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: కళా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. శుక్రవారం ఉదయం ఎంవీపీకాలనీ ఆళ్వార్‌దాస్ మైదానంలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో భాగంగా వైద్యులు రోగులను పరిశీలించి వారికి ఆరోగ్యపరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రమణమూర్తి, తెదేపా నాయకులు ఎన్.సత్తిబాబులు పర్యవేక్షించారు.

యువత సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : యువత సేవాభావంతో పనిచేయాలని ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. శనివారం పిఠాపురం కాలనీలో ఉన్న ఆయన నివాసంలో అవసరమైన అభాగ్యులకు పాతదుస్తులు సేకరించి వారికి అందేంచేందుకు సంస్థలు ముందుకు వచ్చాయి. వీటికి సంబంధించిన గోడపత్రికను ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆవిష్కరించారు. విద్యార్థి దశనుంచే సేవాకార్యక్రమాలు అలవర్చుకోవాలని కోరారు.

దొరికిన బాలుడు

దుర్గాబజార్, ఆరిలోవ, న్యూస్‌టుడే: రెండు రోజుల క్రితం అదృశ్యమైన బాలుడి ఆచూకీ దొరికింది. పాఠశాలకు వెళ్లిన బాలుడు తిరిగి రాలేదని ఆరిలోవ పోలీసులకు మూడో వార్డు పరిధిలోని క్రాంతినగర్‌లో నివాసం ఉంటున్న లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఎస్.సతీష్ (10) పెదగదిలిలోని ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన బాలుడు తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా, ఎలాంటి ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. యాచక వృత్తిలో ఉంటున్న బాలురను చేరదీస్తున్న జనరేషన్ యువ సంస్థ ప్రతినిధులకు ఈ బాలుడు హనుమంతువాక పరిసరాల్లో దొరకడంతో వారు పోలీసులకు అప్పగించారు. బాలుడు తిరిగి తమ వద్దకు చేరడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆచూకీ లభ్యం

మతి స్థిమితం లేని ఓ వ్యక్తి హనుమంతువాక కూడలిలో వీరంగం సృష్టించిన సంఘటనలో సదరు వ్యక్తి కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తిగా పోలీసులు రూఢీ చేసుకున్నారు. అక్కడ అదృశ్యం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు విశాఖలో కూడా వెతుకుతున్నారు. పోలీసుల అదుపులో ఉన్న వ్యక్తి ఫోన్ నెంబరు చెప్పగలగడంతో వెంటనే బంధువులకు పోలీసులు సమాచారం అందించారు. శనివారం బంధువులకు అప్పగించారు.

14 మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పేకాడుతున్న 14 మంది జూదరులను టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులుచేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.1.12 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి టాస్క్‌ఫోర్సు పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాబాగార్డెన్స్ ఆర్.ఆర్.గ్రాండ్ హోటల్లో శనివారం ఉదయం గుట్టుగా పేకాడుతున్నారని సమాచారం మేరకు ఏసీపీ చిట్టిబాబు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న 14 మందిని అదుపులోకి తీసుకొని సంబంధిత స్టేషన్‌కు అప్పగించారు. సంఘటనా స్థలంలో రూ.1.12 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

అర్హులందరికి పక్కా ఇళ్లు మంజూరు చేస్తాం

జన్మభూమిలో ఎమ్మెల్యే వెలగపూడి



చంద్రన్న కానుకలు అందజేసిన జేసీ, ఎమ్మెల్యే

ఎం.వి.పి.కాలనీ, న్యూస్‌టుడే: అర్హులందరికి పక్కా ఇళ్లు దఫదఫాలుగా పూర్తిచేసి దరఖాస్తుదారులకు అందజేస్తామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శనివారం ఉదయం ఎంవీపీకాలనీ ఆళ్వార్ దాస్ మైదానంలో 7, 8 వార్డుల జన్మభూమి-మావూరు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జేసీ సృజన మాట్లాడుతూ జన్మభూమిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం కింద ఇళ్లను నిర్మించి ఇవ్వటానికి ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్, జెడ్పీ నల్లనయ్య, ప్రత్యేక అధికారి అనూరాధ, తెదేపా ప్రధాన కార్యదర్శి సి.వి.పట్టాభి రామ్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడోవార్డులో జన్మభూమి

విశాలాక్షినగర్ : మూడో వార్డు పరిధిలోని పాతపందుల ఫారం సంజయ్‌గాంధీకాలనీ సామాజిక భవనంలో నేడు ఉదయం 9 గంటల నుంచి జన్మభూమి-మాఊరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

9 మందికి గాయాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : పిచ్చికుక్క స్వైరవిహారం చేసి కనిపించిన వారిపై దాడులు చేసింది. పలువురు పిల్లలను కరిచింది. పెదవాల్తేరు బజారువీధిలో శనివారం ఈ సంఘటన జరిగింది. బాధితులకు ఆసుపత్రికి తీసుకెళ్లి వ్యాక్సిన్లు వేయించారు.

ఎన్.ఆర్.ఐ పేరెంట్స్ సమావేశం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : బీచ్‌రోడ్డు వై.ఎం.సి.ఎ. సమావేశ మందిరంలో శనివారం ఎన్.ఆర్.ఐ పేరెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సమీర్ ఆనంద్ ఆహారపు అలవాట్లు, అనారోగ్య సమస్యలు వాటి పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు. అనంతరం మోహన్స్ డయాబెటీస్ సంస్థ ద్వారా ఎన్.ఆర్.ఐ పేరెంట్స్‌కు ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించారు.

సీఐ వెంకటరావుపై మరో మహిళ ఫిర్యాదు

అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆరోపణ

ఈనాడు, విశాఖపట్నం: ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న అభియోగంపై ఇటీవల సస్పెన్షన్‌కు గురైన విశాఖ మూడోపట్టణ సి.ఐ. బెండి వెంకటరావుపై తాజాగా మరో మహిళ ఫిర్యాదు చేశారు. ఆమె శనివారం నగర పోలీస్ కమిషనర్ యోగానంద్‌ను కలిసి తనను వెంకటరావు అసభ్యపదజాలంతో దూషించారని చెప్పారు. దీని ఆధారంగా సీఐపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆమె ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల ప్రకారం....

నగరానికి చెందిన ఓ యువతి ఐటీ సంస్థలో పని చేస్తున్నారు. మొదటి భర్త నుంచి విడాకులు తీసుకున్న ఆమె.. తనలానే విడాకులు తీసుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను 2012లో వివాహం చేసుకున్నారు. అనంతరం ఉద్యోగం వదిలేశారు. రెండో భర్త కొద్దిరోజులు బాగానే ఉన్నా.. తరువాత ఆమెకు దూరమయ్యారు. నాటి నుంచి ఆమె విశాఖలోని తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. తనకు, తన పిల్లల పోషణ నిమిత్తం న్యాయస్థానంలో మనోవర్తి కోసం దావా వేశారు. నెలకు రూ. 22 వేల చొప్పున ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ ఆదేశాలను ఆమె భర్త పట్టించుకోలేదు. బాధితురాలు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లడంతో అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత మూడో పట్టణ పోలీసులపై పడింది. బాధితురాలు మూడోపట్టణ సి.ఐ. బెండి వెంకటరావుకు పరిస్థితి వివరించారు. భర్త ఉద్యోగాన్ని కూడా వదిలేసి ఎక్కడున్నాడో తెలియకపోవడంతో బాధితురాలు నగరంలోనే ఉన్న తన అత్తమామల ఇంటికెళ్లి నిరసనదీక్షకు దిగారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మరిది మూడోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అతనికే అండగా నిలిచి బాధితురాలిదే తప్పన్నట్లు వ్యవహరించారు. కేసు పెడతామని బెదిరించారు. అయినా బాధితురాలు దీక్షను కొనసాగించారు. ఆమె మరిది, మరికొందరు వ్యక్తులు ఆమెపై దాడి చేసి దుస్తులు చింపి గాయపరిచారు. దీంతో బాధితురాలు సి.ఐ. బెండి వెంకటరావుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా ఆమెనే తిట్టడంతో నిర్ఘాంతపోయారు. మహిళ అని కూడా చూడకుండా అభ్యంతరకర పదజాలంతో దూషించారు. తరువాత కొందరు పోలీసులను పంపించారు. వారు బాధితురాలి పరిస్థితి చూసి వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె తన మరిది మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. ఆ కేసుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా ఆమెకు తెలియని పరిస్థితి. మరిది మాత్రం విదేశాలకు వెళ్లిపోయారు. ఆ కేసు ఏమైందన్న విషయం తనకు తెలియదని సీపీ యోగానంద్‌కు ఆమె వివరించారు.

ఈ ఆఫీస్‌పై అవగాహన

ధారపాలెం, ఆరిలోవ, న్యూస్‌టుడే: ఈ ఆఫీస్ కార్యక్రమాలను అన్ని పాఠశాలలు, కళాశాలల్లో అమలు చేయాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. ఒకటో వార్డు పరిధిలోని శ్రీకృష్ణాపురం గురుకుల పాఠశాలలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగిత రహితంగా పాలనా వ్యవహారాలు జరిగేలా అన్ని పాఠశాలల ప్రిన్సిపల్లు శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపల్లు రూపావతి, శేషుకుమారి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పంపిణీ

విశాలాక్షినగర్: ఆరోవార్డు విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ విద్యాకేంద్రంలో టైఅండ్ డై, బ్లాక్‌ప్రింటింగ్ కోర్సులు పూర్తిచేసిన యువతకు శనివారం కేంద్ర హస్తకళల మంత్రిత్వశాఖ అధికారి మనోజ్ ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఎం.గురుప్యారా, కేఎస్ ప్రసాదరావు, దక్షిణామూర్తి, వారణాసి జ్యోతి తదితరులు మాట్లాడారు.

పూలంగి సేవలో వేంకటేశ్వరుడు



ఆరిలోవ: రెండో వార్డు పరిధిలోని ఆరిలోవ రెండో సెక్టరు భరత్‌నగర్ పద్మావతి అలివేలుమంగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా శనివారం పూలంగి సేవ నిర్వహించారు. వేంకటేశ్వరస్వామిని వివిధ పుష్పాలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ప్రత్యేక పూజలకు పరిసర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు హాజరయ్యారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పైడి అప్పన్న కార్యక్రమాలను పర్యవేక్షించారు.



స్వామివారి తిరువీధిలో పాల్గొన్న డాక్టర్ అన్నవరపు రామస్వామి, నిర్వాహకులు జీఆర్కేప్రసాద్ తదితరులు

అలరించిన త్యాగరాజస్వామి కీర్తనలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : త్యాగరాజ ఆరాధన ట్రస్టు, విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ(కళాభారతి) ఆధ్వర్యంలో పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆరురోజులపాటు నిర్వహిస్తున్న త్యాగరాజ మహోత్సవ వేడుకలు రెండోరోజు ఘనంగా జరిగాయి. శనివారం స్వామివారికి తిరువీధి, పంచరత్న సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉదయం నుంచి కళాకారులు సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిపై ఊరేగించి తిరువీధి కార్యక్రమం చేపట్టారు. సుమారు వందమంది కళాకారులు తిరువీధి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కళాభారతి ప్రాంగణంలో స్వామి వారికి పంచరత్న సేవా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సీఎస్ఎన్ రాజు, జీఆర్కే ప్రసాద్(రాంబాబు), ఐవీఎల్‌శాస్త్రి, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, మోహన్‌దాస్, జగత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉత్తరం

శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : తాటిచెట్లపాలెం వెంకటేశ్వరకాలనీలో కొలువైన శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి వేద పండితులు ప్రత్యేక పూజలు, సింధూరార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద భక్తి గీతాల ఆలాపన జరిగింది.

వాసవీ క్లబ్ వనిత వైజాగ్ ఫెమినా నూతన కార్యవర్గం

సీతంపేట, న్యూస్‌టుడే: వాసవీ క్లబ్ వనిత వైజాగ్ ఫెమినా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం శనివారం ఇక్కడ ఓ హోటల్‌లో నిర్వహించారు. అధ్యక్షురాలిగా వి.నిర్మల, కార్యదర్శిగా కె.పుష్ప, కోశాధికారిగా సి.హెచ్.చందన ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.రవికుమార్ హాజరయ్యారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నాం..

35, 36, 37వ వార్డుల జన్మభూమి - మాఊరు కార్యక్రమంలో మంత్రి గంటా

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కైలాసపురంలోని డి.ఎల్.బి. గ్రౌండ్‌లో శనివారం జరిగిన 35, 36, 37వ వార్డుల జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విశాఖ పార్లమెంట్ సభ్యులు కంభంపాటి హరిబాబు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం విశాఖకు ఐఐఎం, పెట్రోలియం వర్శిటీ వంటి ప్రతిష్ఠాత్మక వర్శిటీలు తీసుకువచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ పథకాల అమలుకు అన్ని మండల, గ్రామ, వార్డుల స్థాయిలో సాధికార మిత్రలను ఏర్పాటు చేయాలన్నారు. దీనికి సంబంధించి ఒక ప్రణాళిక తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సాముహిక సీమంతాలు, ముఖ్యమంత్రి సహాయ నిధికింద 8 మందికి చంద్రన్న బీమా చెక్కులను, కొందరికి చంద్రన్న సంక్రాంతి కానుకలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ హరి నారాయణ్, అదనపు కమిషనర్ మూర్తి, జోనల్ కమిషనర్ రమణ మూర్తి, తెదేపా నాయకులు దువ్వారపు రామారావు, నజీర్, సింగంపల్లి అమ్మోరు, గంకల అప్పారావు, కె. కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి గంటా శ్రీనివాసరావు

జన్మభూమిపై అవగాహన ర్యాలీ



ర్యాలీగా తరలివెళ్తున్న ముక్కా ఈశ్వరీ, తారా పద్మజ తదితరులు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: 5వ విడత జన్మభూమి - మా ఊరు కార్యక్రమంలో భాగంగా మౌలిక సదుపాయాలు అనే అంశంపై అవగాహన కల్పించేందుకు ర్యాలీని నిర్వహించారు. శనివారం ఉదయం 12వ వార్డు చిన్నూరులో వార్డు తెదేపా యువత అధ్యక్షుడు ముక్కా కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో చిన్నూరు, రామకృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఎ.ఇ., జన్మభూమి కన్వీనర్ తారా పద్మజ పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గులు, నృత్య పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా వార్డు అధ్యక్షురాలు ముక్కా ఈశ్వరీ, కార్యదర్శి పి.లక్ష్మణ, వై.రమణ, వి.నాగలక్ష్మీ, జె.ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ నంబరు ప్లేటుతో కారులో గంజాయి రవాణా

జెర్రిపోతులపాలెం వద్ద పట్టుకున్న పోలీసులు

జెర్రిపోతులపాలెం (వేపగుంట), న్యూస్‌టుడే : నకిలీ నెంబరు ప్లేటుని తగిలించి గంజాయిని రవాణా చేస్తున్న ఓ కారుని పెందుర్తి పోలీసులు శనివారం పట్టుకున్నారు. పెందుర్తి సీఐ మురళి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెందుర్తి శివారు సబ్బవరం నుంచి నరవ వైపు వేగంగా వస్తున్న కారు ఓ మోటారు సైకిలిస్టుని ఢీకొట్టింది. గస్తీలో ఉన్న పోలీసులు గమనించి కారుని పట్టుకునేందుకు ప్రయత్నించారు. డ్రైవరు మరింత వేగంతో కారును నడిపి జెర్రిపోతులపాలెం సమీపంలో అదుపు తప్పి పక్కనే ఉన్న టాటా ఏసీ వాహనాన్ని ఢీకొట్టాడు. పోలీసులు, స్థానికులు వెంబడించి కారుని నిలుపుదల చేశారు. డ్రైవరు, మరో వ్యక్తి పరారైనట్లు పోలీసులు చెబుతున్నారు. కారును పరిశీలించగా అది కేరళకు చెందినదని, ఏపీ రిజిస్ట్రేషన్ నంబరుతో నడుపుతున్నట్టు తేలింది. లోపల కాగితం కవర్లతో తయారు చేసిన ప్యాకెట్లు కనిపించాయి. వాటిని విప్పి చూడగా 270కేజీల గంజాయి ఉన్నట్లు నిర్ధారించారు. పోలీసులు సరకును స్వాధీనం చేసుకుని స్టేషనుకు తరలించారు. కారు డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. అయితే పోలీసులు ఈ విషయాన్ని నిర్ధారించడం లేదు.



సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ మురళి

8న వైజాగ్ సంక్రాంతి వేడుకలు

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: వీ టీం ఈవెంట్స్, వరుణ్ మారుతీ సంయుక్త ఆధ్వర్యంలో వైజాగ్ సంక్రాంతి పేరిట ఈ నెల 8వ తేదీన వేడుకలు నిర్వహిస్తున్నామని వీటీం. సి.ఇ.ఒ. వీరుమామ పేర్కొన్నారు. శనివారం ఉదయం శంకరమఠంరోడ్డులోని వి.టీ.o కార్యాలయంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈవెంట్స్ హెడ్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ ముగ్గులపోటీ, ఆడవారికి కుండ నడక పోటీ, ఆడపిల్లలకు సంప్రదాయ వస్త్రాల పోటీ, మగ పిల్లలకు హరిదాసు, సంప్రదాయ వస్త్ర పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీ, ఉమాబద్రి, సుశీల, పల్లవి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

డ్రా పద్ధతిలో స్టాల్స్ కేటాయింపు

గురుద్వారా, న్యూస్‌టుడే : సీతమ్మధార రైతుబజార్‌ను మార్కెటింగ్ శాఖ డీడీ సుధాకర్ శనివారం ఉదయం సందర్శించారు. తొలుత డ్వాక్రా, పూలు, కొబ్బరికాయల వ్యాపారులకు సంబంధించి డ్రా తీసి ఆయన చేతుల మీదుగా కూపన్లు అందజేసి స్టాల్స్ కేటాయించారు. తదుపరి బజార్‌లో గల కూరగాయల్ని పరిశీలించారు. డ్వాక్రా మహిళలు, రైతులు వినియోగదారులకు ఏ విధంగా అమ్మకాలు సాగిస్తున్నారనే విషయాన్ని తనిఖీచేశారు.



డ్వాక్రా మహిళలకు స్టాల్స్ కూపన్‌లు అందజేస్తున్న డీడీ సుధాకర్, ఈవో నారాయణ, సిబ్బంది

తడి-పొడి వేరు చేయకుంటే జరిమానా

గురుద్వారా, న్యూస్‌టుడే : బహుళ అంతస్తుల్లో ఉండే వారు చెత్తను తడి చెత్త- పొడి చెత్త వేరు చేసి సిబ్బందికి ఇవ్వాలని.. లేకుంటే జరిమానా తప్పదని జోన్-2 వైద్యాధికారిణి లక్ష్మీతులసీ హెచ్చరించారు. శనివారం 11వ వార్డులోని టీపీటీ, పీఅండ్‌టీకాలనీలు, సీతమ్మధార ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ తీరును ఆమె తనిఖీ చేశారు. ముఖ్యంగా బహుళ అంతస్తుల్లో చెత్తను వేరు చేయకుండా ఇస్తున్నారని, దీంతో సిబ్బందికి ఇబ్బంది ఎదురౌతుందన్నారు.

ప్రథమలో సీజీహెచ్‌ఎస్ ప్రారంభం

ఇసుకతోట(ఎం.వి.పి.కాలనీ), న్యూస్‌టుడే: వెంకోజీపాలెం దరి ప్రథమ ఆసుపత్రిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఆరోగ్య పథకం (సి.జి.హెచ్.ఎస్.) నమోదు, ఒపీడీ ఛాంబర్లు, వార్డులను శనివారం రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోగకరమన్నారు. ప్రథమ ఆసుపత్రి ఎం.డి. డాక్టర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఐవిఎఫ్, ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్ మినహాయించి మిగిలిన అన్ని వైద్య సదుపాయాలను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, తెదేపా ప్రధాన కార్యదర్శి సి.వి.పట్టాభిరామ్, డాక్టర్ ఆదినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

ఘనంగా గ్యార్మీ ఉత్సవాలు

మాధవధార, న్యూస్‌టుడే: ముస్లింలు నిర్వహించే పండగలు శాంతికి, స్నేహభావానికి ప్రతి రూపాలని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. శనివారం మర్రిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్‌లో ఉన్న మజీద్-ఆల్-ఖాదీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ముందుగా కాలనీలో ఉన్న దర్గా వద్ద నమాజ్ చేశారు. మర్రిపాలెంలో ఉన్న ముస్లిం సమస్యలు పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ముస్లింలందరు ఘనంగా సత్కరించారు.

రూ.20 లక్షలతో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే : ముప్పై అయిదో వార్డు కప్పరాడలో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఉన్న సులభ్ కాంప్లెక్స్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దాన్ని తొలగించి, కొత్తది నిర్మించాలని స్థానిక ప్రజలు కొంతకాలంగా అధికారులను కోరుతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు కాలనీ నాయకులు దీనిపై విజ్ఞప్తి చేయగా, నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇక్కడ సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి జీవీఎంసీ అధికారులు రూ.20 లక్షల నిధులు విడుదల చేసి పనులు గుత్తేదారులకు అప్పగించారు. సంబంధిత పనులు ఇటీవల ప్రారంభమయ్యాయని జీవీఎంసీ ఎ.ఇ. సత్యనారాయణ తెలిపారు. మూడు నెలలో పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.



కప్పరాడలో సులభ్‌కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్న దృశ్యం

యువజనోత్సవం గోడపత్రిక విడుదల

సీతంపేట, న్యూస్‌టుడే : ఇండియా యూత్ ఫర్ సొసైటీ(ఐ.వై.ఎఫ్.ఎస్) ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఈనెల 12న నిర్వహించనున్నారు. శనివారం ఉదయం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో ఉత్సవానికి సంబంధించిన గోడపత్రికను సంస్థ విడుదల చేసింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహనదాస్ ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈనెల 12న ఉదయం 6.30గంటలకు ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం నుంచి ఉడాపార్కు వరకు, తిరిగి కాళీమాత ఆలయం వరకు 5కె రన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు ప్రారంభిస్తారన్నారు. ఐ.వై.ఎఫ్.ఎస్ సభ్యులు ముమ్మన జగదీష్‌కుమార్, ఆకుల సావిత్రిదేవి, ఎండ్రెడ్డి అప్పల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న ఆచార్య బాలమోహనదాస్

విశాఖ దక్షిణం

కోడి పందేలు నిర్వహిస్తే సమాచారం ఇవ్వండి

ఆరిలోవ: కోడి పందేలను నిర్వహిస్తే ఎవరైనా సరే సమాచారం ఇవ్వాలని ఆరిలోవ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముఖరావు కోరారు. శనివారం మూడో వార్డు పరిధిలోని బి.ఎన్.ఆర్.నగర్ వద్ద కోడి పందేలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. షేక్ ఖలీల్, షేక్ మస్తాన్‌లపై కేసు నమోదు చేశామన్నారు. సమాచారాన్ని 94906 24815కు ఇవ్వవచ్చన్నారు.

కళ్లుగప్పి తెచ్చేస్తున్నారు!


విశాఖ రైల్వేస్టేషన్‌లో కమర్షియల్ ట్యాక్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రెడీమేడ్ వస్త్రాల బేల్స్ →

- ఇప్పటివరకు రూ.కోటి విలువైన సరకు పట్టివేత
- రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న తనిఖీలు

న్యూస్‌టుడే, రైల్వేస్టేషన్

విశాఖ రైల్వేస్టేషన్‌లోని పార్సిల్ కార్యాలయంతో పాటు పలు రైళ్లపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మెరుపుదాడి చేసిన సంగతి పాఠకులకు విదితమే. ఏ విధమైన పన్నులు చెల్లించకుండా ఆయా రైళ్లలో రవాణ అవుతోన్న పార్సిళ్లపై వాణిజ్య పన్నుల శాఖ అధికారులు శనివారం కూడా దాడులు కొనసాగించారు. హౌవ్‌డా ఇతర ప్రాంతాల నుంచి విశాఖ చేరుకొనే పార్సిళ్ల వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. అధికారికంగా బిల్లులు ఉన్న వస్తువులను విడిచిపెడుతోన్న అధికారులు బిల్లులు లేని పార్సిళ్లపై దృష్టి సారిస్తున్నారు. సంక్రాంతి పర్వదినాలు ముందుడటంతో వందలాది రెడీమేడ్ వస్త్రాలు రైలు మార్గం ద్వారా నగరానికి చేరుకుంటున్నాయి. వీటిలో బిల్లులు చెల్లించనివి కూడా ఉంటున్నాయని పసిగట్టిన వాణిజ్యపన్నుల శాఖ అధికారులు కమిషనర్ ఆదేశాల మేరకు స్టేషన్‌లో కాపుకాసిన వస్త్ర దుకాణాలు, పుట్‌పాత్ వ్యాపారుల వద్దకు చేరుకునే బేళ్లను రైల్వేస్టేషన్‌లో స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. గత మూడు రోజుల్లో దాదాపు రూ.కోటి విలువైన రెడీమేడ్ వస్త్రాల ప్యాకెట్లను సీజ్ చేసినట్లు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు శనివారం తెలిపారు. వారి దగ్గర నుంచి దాదాపు రూ. 10 లక్షల వరకూ పన్నులు, అపరాధ రుసుములు వసూలు చేశామన్నారు. పన్నులు చెల్లించకుండా ఏ వస్తువులను రవాణా చేసినా అపరాధ రుసుములు చెల్లించకతప్పదని హెచ్చరించారు. మరోవైపు రైల్వే పార్సిల్ కార్యాలయంలో సక్రమ మార్గంలో పార్సిళ్ల రవాణా జరగడం లేదని దానిపై కూడా దృష్టి సారిస్తామన్నారు. ఇంకోవైపు రైల్వే అధికారులు సీజ్ చేసిన సరకును ప్లాట్‌ఫారాలపై వదిలేయడంతో అవన్నీ నిండిపోయి ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. వాటిని అక్కడి నుంచి తక్షణమే తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు రైల్వే అధికారులను కోరుతున్నారు. దీంతో పాటు బుక్ చేసుకొని వచ్చిన వ్యాగన్లు సైతం స్టేషన్లో ఉండిపోవడంతో రాకపోకలు సాగించే రైళ్లకు తీవ్ర అంతరాయం కలుగుతున్నట్టు రైల్వే అధికారులు చెబుతున్నారు.


విశాఖ రైల్వేస్టేషన్‌లో వస్త్ర వ్యాపారుల నుంచి వివరాలు సేకరిస్తున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు

భర్తపై మహిళ ఫిర్యాదు

పూర్ణామార్కెట్, న్యూస్‌టుడే: ఏడాది క్రితం వివాహం చేసుకొన్న వ్యక్తి ఇప్పుడు ఎలాంటి సంబంధం లేదని తప్పించుకుంటున్నాడని ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదుపై మహిళా పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బర్మాక్యాంపు సమీపంలో నివసిస్తోన్న శైలజ భర్త చనిపోవడంతో టిఫిన్ దుకాణాం నడుపుతూ జీవిస్తోంది. కప్పరాడకు చెందిన వ్యక్తి పెద్దాడ సునీల్‌కుమార్ వచ్చి శైలజతో పరిచయం పెంచుకున్నాడన్నారు. పరిచయం ప్రేమగా మారడంతో 2016 ఆగస్టులో పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారని వివరించారు. ఏడాది పాటు కాపురం చేసి తర్వాత కనిపించకుండా వెళ్లిపోయాడని పేర్కొన్నారు. భార్య ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసును నమోదు చేసిన పోలీసులు అదుపులోకి తీసుకోగా బాధితురాలితో ఎలాంటి సంబంధం లేదని చెప్పడంతో ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మహిళా పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారని తెలిపారు.

ఎన్నికల వ్యవస్థపై అవగాహన కోసం పోటీలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఎన్నికల వ్యవస్థపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించేందుకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి.చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించారు. పోటీల నిర్వహణకు సంబంధించి విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు, వృత్తివిద్యాశాఖ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బందితో శనివారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25 జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గం, జిల్లాస్థాయుల్లో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 18న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఉంటాయని, 21న జిల్లా స్థాయిలో జరుగుతాయన్నారు. జిల్లా స్థాయి తర్వాత రాష్ట్ర స్థాయిలో ఈనెల 24న విజయవాడలో జరిగే పోటీలకు పంపుతామన్నారు. ఎన్నికల విభాగం పర్యవేక్షకులు బి.సూర్యనారాయణమూర్తి, ఉప తహసిల్దార్ రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


జాతీయ ఓటర్ల దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై సిబ్బందితో సమీక్షిస్తున్న డీఆర్వో సి.చంద్రశేఖర్‌రెడ్డి

ఆకట్టుకున్న సంక్రాంతి వేడుక

పూర్ణామార్కెట్, న్యూస్‌టుడే: టౌన్‌కొత్తరోడ్డు సమీపంలో గల బీబీవీ పాఠశాలలో శనివారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. బురుజుపేట మహిళా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా చిన్నారులు వివిధ వేషధారణల్లో చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వేంకటేశ్వర స్వామి, హరిదాసులు, పిట్టలదొర, రైతులు, గంగిరెద్దులు, పులివేషాలు, సోదెమ్మ వంటి వేషాలు అందర్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పిండి వంటలు వండటంతో పాటుగా చిన్నారులపై బోగి పండ్లు వేయడం, ముగ్గుల పోటీలు వంటివి నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


వివిధ వేషధారణల్లో పాఠశాల చిన్నారులు

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ కోరారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మత్స్యకారులు చేస్తోన్న రిలే దీక్షల శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ దుర్భర జీవనం సాగిస్తోన్న మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు పీసీ అప్పారావు, బర్రి కొండబాబు, గరికిన గౌరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం!

మహారాణిపేట, న్యూస్‌టుడే: జన్మభూమి- మాఊరు కార్యక్రమంలో భాగంగా శనివారం పాతనగరంలోని వాసవి జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రిన్సిపల్ డీఆర్ఎస్ గుప్తా జెండా ఊపి ప్రారంభించారు. జన్మభూమి- మాఊరు కార్యక్రమ ప్రాధాన్యతను వలంటీర్లు స్థానికులకు వివరించారు. పాతపోస్టాఫీసు, కోటవీధి, అబూసరంగ్ వీధి, థామ్సన్ వీధుల్లో ర్యాలీగా పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పరిచారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె.సత్యనారాయణ, శ్రీరాం, జయలక్ష్మి, సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముద్ర రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: వీధి విక్రయదారులకు ముద్ర రుణాలు వరం లాంటివని ఎంపీ కె.హరిబాబు అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ సిండికేట్ బ్యాంకులో రుణాల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ అర్హులకు రుణాలు అందించారు. ఎంపీ మాట్లాడుతూ నగరంలోని 16 వేల చిరువ్యాపారులకు రుణాలు అందజేస్తామన్నారు. వాటితో వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. సిండికేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎం.విజయబాబు మాట్లాడుతూ డాబాగార్డెన్స్ సిండికేట్ బ్యాంకులో 74 మందికి రూ. 48 లక్షల మేర రుణాలను అందజేశామన్నారు. వాటిని సక్రమంగా చెల్లించి మళ్లీ రుణాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ నరసింహమూర్తి, రూపాకుల రవికుమార్, పీవీ నారాయణరావు, రాజగోపాల్, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రతిభ కనపరిచిన అధికారులకు సన్మానం

కార్పొరేషన్: నగరంలో ముద్ర రుణాలు అందజేయడంలో ప్రతిభ కనపరిచిన బ్యాంకు అధికారులను ఎంపీ హరిబాబు సన్మానించారు. శనివారం సాయంత్రం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ జీవీఎంసీ యూసీడీ విభాగం ద్వారా నగరంలో 10 వేల మంది వీధి వ్యాపారులను గుర్తించి, వారిలో రుణాలు అవసరమైనవారి దరఖాస్తులు పరిశీలించి రుణాలు మంజూరు చేయాలన్నారు. ఇప్పటి వరకు 1081 దరఖాస్తులు పరిశీలించి 661 మందికి రుణాలు మంజూరు చేశామన్నారు. ఒక్కో బ్యాంకు శాఖ కనీసం 20 మందికి రుణాలిస్తే నగరంలో వ్యాపారులందరికీ రుణాలు మంజూరవుతాయన్నారు. అనంతరం కెనరా బ్యాంకు అధికారులను ఎంపీ సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, కమిషనర్ హరినారాయణన్, యూసీడీ పీడీ శ్రీనివాసన్ పాల్గొన్నారు.


ముద్ర రుణాలను అందజేస్తున్న ఎంపీ హరిబాబు

ఆసుపత్రి నిర్మాణానికి రూ. 22.35 లక్షల విరాళం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పరవాడలో 30 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి మైలాన్ ల్యాబొరేటరీ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రూ. 22.35 లక్షల విరాళం అందించింది. మైలాన్ ల్యాబొరేటరీ సంస్థ ప్రతినిధులు వి.మోహన్, సునీల్‌వాద్వా, వెంకటఅచ్యుతరాజు, సరస్వతిరావు, బ్రహ్మాజీలు శనివారం కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి చెక్కును అందించారు.


కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు చెక్కును అందచేస్తున్న మైలాన్ ల్యాబొరేటరీ సంస్థ ప్రతినిధులు

విశాఖ దక్షిణం

సంగీతంతో హృదయోల్లాసం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: చక్కని పాటలు వింటే మనసుకు ఉల్లాసం చేకూరితుందని టి.సుబ్బరామిరెడ్డి సేవాపీఠం నిర్వాహకులు ఎస్‌కే బాషా, వీఎస్‌రావు అన్నారు. శనివారం డాబాగార్డెన్స్ ప్రేమసమాజంలో ఇందుశ్రీ ఆర్ట్స్ కల్చరల్ ఆధ్వర్యంలో కమలహాసన్ హిట్ చిత్రాల సినీ సంగీత విభావరిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాషా, వీఎస్‌రావులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.





పాతజైలు రోడ్డులో గల మహిళ కళాశాల సమీపంలో గోడపై చిత్రాలను అందంగా తీర్చిదిద్దుతున్న చిత్రకారులు

గోడ... కొంగొత్త జాడ...

విశాఖ మహానగరంలో ఎంతో చరిత్ర కలిగిన పాతజైలు రోడ్డు ఇక కొత్తగా దర్శనమివ్వనుంది. రహదారికి సమీపంలో ఉన్న మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలల ప్రహరీ రహదారిపై నుంచి రాకపోకలు సాగించే వారికి రంగు రంగుల చిత్రాలు కనువిందు చేయనున్నాయి. గత నాలుగైదు రోజులుగా ఆయా గోడలకు కొత్త రంగులు వేసిన కొందరు చిత్రకారులు ఆయా గోడలపై అందమైన శీతాకోక చిలుకలతో పాటు పుష్పాల చిత్రాలను గీస్తూ అందంగా తయారు చేస్తున్నారు. దీంతో కళాశాలలు మరింత అందంగా ప్రకాశిస్తున్నాయి. అయితే చిత్రకారులు ఈ పనులు పూర్తి చేస్తే సంక్రాంతి నాటికి ఆయా పరిసరాలు కొత్తరూపును సంతరించుకోనున్నాయి.

–న్యూస్‌టుడే, డాబాగార్డెన్స్

‘మత్స్యకారుల పట్ల సీఎం తీరు బాధాకరం’

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై మాట్లాడడానికి వెళ్లిన మత్స్యకారుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరించిన తీరు బాధాకరంగా ఉందని మత్స్యకారుల సాధన సమితి సభ్యులు, న్యాయవాది పుక్కళ్ల నాగరాజు ఆక్షేపించారు. శనివారం డాబాగార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖకు వచ్చిన ముఖ్యమంత్రితో తమ గోడను విన్నవించుకుందామని వెళితే మత్స్యకారులపై ఆయన అసహనం వ్యక్తంచేశారన్నారు. గత కొన్ని రోజులుగా దీక్షలు చేస్తోన్న వారిపై కనీసం జాలి చూపించకుండా నిర్లక్ష్యంగా మాట్లాడారన్నారు. ఇప్పటికైన మత్స్యకారులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశాన్ని త్వరితగతిని పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలలో కోస్తా మత్స్యకార సంఘం అధ్యక్షులు శాంతారాం, మూగి శ్రీరామమూర్తి, నెయ్యిల నాగభూషణ్, బడే గౌరీశ్వరి పాల్గొన్నారు.

ప్రథమలో సీజీహెచ్‌ఎస్ ప్రారంభం

ఇసుకతోట(ఎం.వి.పి.కాలనీ), న్యూస్‌టుడే: వెంకోజీపాలెం దరి ప్రథమ ఆసుపత్రిలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ ఆరోగ్య పథకం (సి.జి.హెచ్.ఎస్.) నమోదు, ఒపీడీ ఛాంబర్లు, వార్డులను శనివారం రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఉపయోగకరమన్నారు. ప్రథమ ఆసుపత్రి ఎం.డి. డాక్టర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఐవిఎఫ్, ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్ మినహాయించి మిగిలిన అన్ని వైద్య సదుపాయాలను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, తెదేపా ప్రధాన కార్యదర్శి సి.వి.పట్టాభిరామ్, డాక్టర్ ఆదినారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

ఏర్పాట్లు చేస్తున్న జీవీఎంసీ

కార్పొరేషన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఆధ్వర్యంలో చేపడుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాలతో నగర పాఠశాలల్లో వినూత్న మార్పులు వస్తున్నాయి. రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖ నారాయణ పాఠశాలలు, విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తుండగా, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ విద్యార్థుల్లో పరిశుభ్రత పెంచేలా, అలవాటు చేసేలా కార్యక్రమాలు రూపొందిస్తుండటంతో మున్సిపల్ పాఠశాలల విద్యార్థుల అలవాట్లలో మార్పులు వస్తున్నాయి. జీవీఎంసీ పాఠశాలలో పరిశుభ్రత పట్ల ప్రత్యేకయాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రధానోపాధ్యాయులచే దానిని ప్రతి రోజూ అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టింది. దీంతో నిత్యం పాఠశాలల్లో మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

రూ. 3 కోట్ల వ్యయంతో...: నగరంలోని 27 ఉన్నత పాఠశాలలు, 126 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 126లో పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు, వాటికి విద్యుత్తు సరఫరా, మంచినీరు అందేలా చేయడానికి జీవీఎంసీ రూ. 3 కోట్లు ఖర్చు చేసింది. మరో రూ. 80లక్షల వ్యయం చేయాల్సి ఉంది. వేసవి సెలవుల్లో మరమ్మతు పనులు చేపట్టి వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని కమిషనర్ హరినారాయణన్ తెలిపారు. ఈ నేపథ్యంలో అత్యంత పరిశుభ్రత గల పాఠశాలలుగా నగరంలోని మధురానగర్ పాఠశాలకు ఇప్పటికే జాతీయస్థాయిలో స్వచ్ఛపాఠశాల అవార్డు లభించింది. విద్యార్థినీ విద్యార్థులకు, వేర్వేరుగాను, వికలాంగులకు అందుబాటులో ఉండేలా మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు, మధ్యాహ్న భోజనం ముగిసిన తరువాత, ముందు, ఆటలాడి తరగతి గదికి వెళ్లే విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడానికి ప్రత్యేక ఏర్పాట్లు జీవీఎంసీ చేపట్టింది. మరో పక్క పాఠశాలల భవనాలపై సౌర ప్యానెళ్ల ఏర్పాటు, తరగతి గదిలో డిజిటల్ తరగతి గదులు, విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాట్లు చేయడంతో వచ్చే విద్యాసంవత్సరం మున్సిపల్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలున్నాయి.



విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకోవడానికి చేసిన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ హరినారాయణన్

బాధితురాలి దరఖాస్తులను పరిష్కరించాం

కలెక్టరు ప్రవీణ్‌కుమార్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ డి.డి. రమణమూర్తిపై విశాఖ ఎంవీపీ పోలీసులు ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఘటనపై కలెక్టరు స్పందించారు. శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బాధిత యువతి కేసుకు సంబంధించి దరఖాస్తు పరిష్కారం, పరిహారం చెల్లింపులో ఎలాంటి ఆలస్యం జరగలేదని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో ఎప్పటికప్పుడు సరైన చర్యలను తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశాలు ఎప్పటికప్పుడు నిర్వహిస్తూ కేసుల విచారణ, పరిష్కారానికి చర్యలను తీసుకుంటున్నామని చెప్పారు. ‘తనను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన ఆకుల శివన్నారాయణమూర్తిపై బాధిత మహిళ ఎం.వి.పి.పోలీసు స్టేషన్‌లో 2016 ఆగస్టు 12న ఫిర్యాదు చేసింది. ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. పరిహారం కోసం ఆ ఎఫ్ఐఆర్ ప్రతిని జత చేసి బాధిత మహిళ 2016 ఆగస్టు 26న సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుల కార్యాలయంలో దరఖాస్తు చేసింది. దీనిపై పోలీసు కమిషనర్ కార్యాలయం 2016 సెప్టెంబరు 17న ఇచ్చిన సమాచారం పరిశీలించి 2016 సెప్టెంబరు 23న బాధితురాలికి రూ. 25 వేలు మంజూరు చేశాం. ఇది చాలదని, ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం ఆర్థిక సహాయం ఇవ్వాలని ఆమె అదే ఏడాది అక్టోబరులో దరఖాస్తు చేసింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇచ్చిన న్యాయ సలహా మేరకు 2016 డిసెంబరు 10న మరో రూ. 3.50 లక్షలు మంజూరు చేశాం. 2017 జనవరి 7న ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేశాం’ అని కలెక్టరు వివరించారు.

సీఐ వెంకటరావుపై మరో మహిళ ఫిర్యాదు

అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆరోపణ

ఈనాడు, విశాఖపట్నం: ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న అభియోగంపై ఇటీవల సస్పెన్షన్‌కు గురైన విశాఖ మూడోపట్టణ సి.ఐ. బెండి వెంకటరావుపై తాజాగా మరో మహిళ ఫిర్యాదు చేశారు. ఆమె శనివారం నగర పోలీస్ కమిషనర్ యోగానంద్‌ను కలిసి తనను వెంకటరావు అసభ్యపదజాలంతో దూషించారని చెప్పారు. దీని ఆధారంగా సీఐపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆమె ఇచ్చిన ఫిర్యాదులోని వివరాల ప్రకారం....

నగరానికి చెందిన ఓ యువతి ఐటీ సంస్థలో పని చేస్తున్నారు. మొదటి భర్త నుంచి విడాకులు తీసుకున్న ఆమె.. తనలానే విడాకులు తీసుకున్న ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను 2012లో వివాహం చేసుకున్నారు. అనంతరం ఉద్యోగం వదిలేశారు. రెండో భర్త కొద్దిరోజులు బాగానే ఉన్నా.. తరువాత ఆమెకు దూరమయ్యారు. నాటి నుంచి ఆమె విశాఖలోని తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. తనకు, తన పిల్లల పోషణ నిమిత్తం న్యాయస్థానంలో మనోవర్తి కోసం దావా వేశారు. నెలకు రూ. 22 వేల చొప్పున ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ ఆదేశాలను ఆమె భర్త పట్టించుకోలేదు. బాధితురాలు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లడంతో అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. దాన్ని అమలు చేయాల్సిన బాధ్యత మూడోపట్టణ పోలీసులపై పడింది. బాధితురాలు మూడోపట్టణ సి.ఐ. బెండి వెంకటరావుకు పరిస్థితి వివరించారు. భర్త ఉద్యోగాన్ని కూడా వదిలేసి ఎక్కడున్నాడో తెలియకపోవడంతో బాధితురాలు నగరంలోనే ఉన్న తన అత్తమామల ఇంటికెళ్లి నిరసనదీక్షకు దిగారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న మరిది మూడోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అతనికే అండగా నిలిచి బాధితురాలిదే తప్పన్నట్లు వ్యవహరించారు. కేసు పెడతామని బెదిరించారు. అయినా బాధితురాలు దీక్షను కొనసాగించారు. ఆమె మరిది, మరికొందరు వ్యక్తులు ఆమెపై దాడి చేసి దుస్తులు చింపి గాయపరిచారు. దీంతో బాధితురాలు సి.ఐ. బెండి వెంకటరావుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా ఆమెనే తిట్టడంతో నిర్ఘాంతపోయారు. మహిళ అని కూడా చూడకుండా అభ్యంతరకర పదజాలంతో దూషించారు. తరువాత కొందరు పోలీసులను పంపించారు. వారు బాధితురాలి పరిస్థితి చూసి వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె తన మరిది మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులపై ఫిర్యాదు చేశారు. ఆ కేసుపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో కూడా ఆమెకు తెలియని పరిస్థితి. మరిది మాత్రం విదేశాలకు వెళ్లిపోయారు. ఆ కేసు ఏమైందన్న విషయం తనకు తెలియదని సీపీ యోగానంద్‌కు ఆమె వివరించారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తాం!

‘జన్మభూమి’ సభలో ఎమ్మెల్యే వాసుపల్లి

పూర్ణామార్కెట్, న్యూస్‌టుడే: ప్రజారోగ్యాన్ని ప్రభుత్వం ప్రాధాన్యరంగంగా తీసుకుని ఏటా బడ్జెట్‌లో రూ. వేల కోట్లు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలోని ఇందిరాప్రియదర్శిని మైదానంలో జరిగిన అయిదో విడత జన్మభూమిలో సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆరోగ్య సేవ, ముఖ్యమంత్రి సహాయ నిధితో పేద ప్రజల ఆరోగ్యానికి నూరు శాతం భరోసా నిస్తోందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వ గృహాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, రుణాలు ఇతర సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందించడానికే జన్మభూమి నిర్వహిస్తున్నామన్నారు. దక్షిణ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు దీర్ఘకాలికంగా వేధిస్తోన్న కాలుష్యం, ట్రాఫిక్, పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి పక్కాగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కార్యక్రమంలో గర్భిణీలకు సీమంతం చేశారు. అర్హులకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ, హరిబాబు, ప్రత్యేక అధికారి ఎం.ఎం.నాయక్, జీవీఎంసీ యూసీడీ పీడీ శ్రీనివాసన్, జోనల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

విశాఖ పశ్చిమం

గోపాలపట్నంలో సినిమాలు

నరసింహ: **ఇన్సిడియస్ (తెలుగు),** శ్రీనరసింహ: **అమెజాన్ అడ్వంచర్,** శంకర: **ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి),** సుకన్య: **హలో,** సౌజన్య: **ది లాస్ట్ హర్రర్,** సత్యం: **ఒక్క క్షణం,** మౌర్య: **సారథి,** **శ్రీహరిపురంలో సినిమాలు :** ఎస్వీసీ లిఖిత: **ఎంసీఏ (మిడిల్ క్లాస్ అబ్బాయి)**

నీటి ఎద్దడి వస్తే... ఆదుకునేదెవరు..?

నిబంధనలకు విరుద్ధంగా బోరులు తవ్వుతున్నారని గ్రామస్తుల ఆందోళన



బహుళ అంతస్తు భవన ప్రాంగణంలో పరిస్థితిని సమీక్షిస్తున్న జోన్-4 జెడ్సీ రమణమూర్తి, స్థానికులు

కరాస, న్యూస్‌టుడే : నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్న బోరులతో భవిష్యత్తులో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉందని 41వ వార్డు పంచగ్రామల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారు తెలిపిన వివరాల మేరకు... పాత ఐటీఐ కూడలి సమీపంలో సుమారు 360 ప్లాట్స్‌తో నిర్మించిన బహుళ అంతస్తు భవన ప్రాంగణంలో గతంలోనే అనుమతులు లేకుండా నాలుగు బోరుబావులు తవ్వారు. దాంతో స్థానికులంతా నీటి ఎద్దడి వస్తుందని ఆందోళన చేశారు. ఈ ఘటనపై స్పందించిన అధికారులు తనిఖీలు నిర్వహించి... కేవలం రెండు బోరులను మాత్రమే వినియోగించుకోవాలని, మరో రెండింటిని సీజ్ చేశారు. భవిష్యత్తులోనూ అనుమతి లేకుండా బోర్లు వేయరాదని అప్పట్లోనే భవన యజమానిని అధికారులు హెచ్చరించారు. మళ్లీ తాజాగా రెండు రోజుల కిందటే రెండు బోర్లను తవ్వేశారు. విషయం తెలుసుకున్న స్థానికులు ఎమ్మెల్యే గణబాబుకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో జీవీఎంసీ జోన్-4 జెడ్సీ రమణమూర్తి వెళ్లి బోర్ల ఏర్పాటును పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకం చేపట్టరాదని పనులను నిలిపేయించారు. తవ్విన బోర్లు వినియోగంలోకి వస్తే... తుమ్మడపాలెం, సుభాష్‌నగర్, సిద్ధార్థనగర్, భవానీగార్డెన్స్, సంకురపేట, గజపతినగర్, శ్రీరాంనగర్‌కు నీటి ఎద్దడి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

✦ ఈ ఘటనపై జోన్-4 జెడ్సీ రమణమూర్తి వివరణ కోరగా... గ్రామ ప్రజల ఫిర్యాదు మేరకు శుక్రవారమే బోరు బావులను పరిశీలించామన్నారు. ప్రస్తుతానికి నిర్మాణ పనులు నిలిపివేయించామన్నారు.

ఉపకరణాలతో విద్యాబోధన సులువు

కరాస, న్యూస్‌టుడే : విద్యా ఉపకరణాలతోనే బోధన సులువుగా సాగుతుందని 104 ఏరియా కేవీ-2 ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. బాబూరావు అన్నారు. శనివారం కేవీలో ఏర్పాటు చేసిన విద్యా ఉపకరణాల ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు ఉపకరణాల సాయంతో బోధిస్తేనే ఫలితం ఉంటుందన్నారు. అనంతరం ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులు తయారు చేసిన ఉపకరణాలను ప్రదర్శనగా ఉంచారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. పాఠశాల ఇంఛార్జి మురళీకృష్ణ, ఉపాధ్యాయులు ఇందిర, సంజుకుమారి తదితరులు పాల్గొన్నారు.



బోధన ఉపకరణాలను ప్రదర్శిస్తున్న కేవీ-2 విద్యార్థులు

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

మల్కాపురం, న్యూస్‌టుడే : విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మల్కాపురం విద్యుత్తు విభాగం ఏఈ కృష్ణ అన్నారు. జీవీఎంసీ 49వ వార్డు పరిధిలోని విద్యుత్తు ఉపకేంద్రంలో శనివారం ఎల్ఈడీ బల్బుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గతంలో అందించిన బల్బులు పని చేయకపోతే... వాటిని తీసుకొచ్చి కొత్తవి తీసుకెళ్లాలని సూచించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్కాపురం విద్యుత్తు ఉపకేంద్రం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మల్కాపురం ఉపకేంద్రంలో ఎల్ఈడీ బల్బులు పంపిణీ చేస్తున్న ఏఈ కృష్ణ

ఉన్నత లక్ష్యంతో యువత ముందుకు సాగాలి

మల్కాపురం, న్యూస్‌టుడే : ఉన్నత లక్ష్యంతో యువత ముందుకు సాగాలని మల్కాపురం లా అండ్ ఆర్డర్ సీఐ కేశవరావు అన్నారు. జీవీఎంసీ 45వ వార్డు సింధియా దరి హిందుస్థాన్ షిప్‌యార్డు డిగ్రీ కళాశాలలో శనివారం జన్మభూమి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రాథమిక దశ నుంచే విద్యార్థులంతా మంచి నడవడికను అలవాటు చేసుకోవాలన్నారు. నేర చరిత్రకు దూరంగా ఉంటూ, మత్తు పదార్థాలకు బానిసలుగా మారొద్దన్నారు. ట్రాఫిక్ సీఐ ఎల్ భాస్కరరావు మాట్లాడుతూ... ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనాలు నడపొద్దని, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించకూడదని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.సర్వేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ ఇంఛార్జి గోపినాథ్, షిప్‌యార్డు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుగుణవతి తదితరులు పాల్గొన్నారు.



షిప్‌యార్డు డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ కేశవరావు

ఇండోర్ స్టేడియం నిర్మాణ పనుల పరిశీలన



ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వుడా వీసీ బసంత్‌కుమార్, ఎమ్మెల్యే పి.గణబాబు తదితరులు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సుమారు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను శనివారం వుడా వీసీ బసంత్‌కుమార్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పరిశీలించారు. ముందుగా వారిద్దరూ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో సుమారు రూ. 50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ బసంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు శారీరక వ్యాయమం అవసరమని, అందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గణబాబు సూచించారు. కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శికి స్వాగతం

ఎన్ఏడీకూడలి(గోపాలపట్నం), న్యూస్‌టుడే : ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ శనివారం నగరానికి వచ్చారు. ఉదయం విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు సంఘం సభ్యులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, జిల్లా అధ్యక్షుడు పి.రమణ, మసేన్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.



అమర్‌జిత్‌కు స్వాగతం పలుకుతున్న ఏఐటీయూసీ నాయకులు

సేవా భావాన్ని అలవర్చుకోవాలి

మల్కాపురం, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచే యువత సామాజిక సేవాభావాన్ని అలవాటు చేసుకుని, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల అధ్యాపకురాలు సిస్టర్ జయశీల అన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారిణి ఈపీఎస్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సామాజిక సేవలతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వారం రోజుల పాటు వార్డుల్లో నిర్వహించే శిబిరాల్లో భాగంగా వలంటీర్లంతా క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను తెలుసుకోవాలన్నారు. ఆ నివేదికలను అధికారులకు అందించి... సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు వై.అనసూయదేవి, డి.నాగమణి, ఎ.ఆదిలక్ష్మి, వై.జెస్సీ తదితరులు పాల్గొన్నారు.



సెయింట్‌ఆన్స్ కళాశాలలో మాట్లాడుతున్న సిస్టర్ జయశీల

అప్పన్నస్వామికి బంగారు హృదయలక్ష్మీ హారం



బంగారు హృదయలక్ష్మి హారాన్ని ఈవో రామచంద్రమోహన్‌కు అందజేస్తున్న దొడ్డి కిరణ్ కుటుంబసభ్యులు

సింహాచలం, గోపాలపట్నం, న్యూస్‌టుడే: సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నృసింహ స్వామికి జీవీఎంసీ 66వ వార్డు వైకాపా అధ్యక్షుడు దొడ్డి కిరణ్ శనివారం రూ. 31 లక్షల విలువైన బంగారు హృదయ లక్ష్మీ హారాన్ని వితరణగా ఇచ్చారు. స్వామిపై ఉన్న భక్తితోనే 721 గ్రాముల బంగారంతో హారాన్ని తయారు చేయించి, ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశామని దాత దొడ్డి కిరణ్ తెలిపారు. కార్యక్రమంలో వైకాపా నగర అధ్యక్షుడు మళ్ల విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు కిరణ్ ఆధ్వర్యంలో కొత్తపాలెం నుంచి సింహాచలం శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు.

కూరగాయల ధరలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : గోపాలపట్నం రైతుబజారులో కూరగాయల ధరలు ఆదివారం కింద విధంగా కొనసాగుతాయని బజారు ఎస్టేట్ అధికారి కె.వరహాలు శనివారం తెలిపారు.

కూరగాయలు(కిలో..)ధర(రూ.ల్లో)

పాతఅల్లం - **34,** కొత్తఅల్లం - **34,** ఆనపకాయ - **12,** ఆగాకర దేశవాళి - **64,** ఆగాకర హైబ్రిడ్ - **42,** అరటికాయ - **6,** బీట్‌రూట్- **20,** బీన్స్ - **30,** బీర - **44,** బెండ - **30,** బరబాటి - **30,** తెల్లవంగ - **24,** నల్లవంగ - **18,** వెల్లంకి - **30,** క్యారెట్ - **36,** మట్టిక్యారెట్ - **36,** గాజర్ క్యారెట్- **36,** క్యాలీఫ్లవర్ - **12,** క్యాబేజి-**12,** క్యాప్సికం - **34,** మట్టిచేమ - **28,** కడిగిన చేమ -**34,** ములగ - **75,** దొండ- **26,** దోస - **14,** గోరుచిక్కుడు - **24,** వెల్లుల్లి - **42,** కీరదోస- **16**, కాకర - **28,** కర్రపెండ్లం - **20,** మిర్చి- **28,** బంగాళదుంపలు- **8,** పాతఉల్లి- **42,** కొత్తఉల్లి- **42,** టమాటా దేశవాళి - **10,** కంద - **30,** ముల్లంగి- **16,** పొట్లకాయ - **16,** కరేపాకు - **40,** నిమ్మకాయలు - **35,** చిలగడదుంపలు- **20,** బీన్స్‌పిక్కలు- **62,** దేముడుచిక్కుడు- **32,** స్వీట్‌కార్న్ - **22.**

నేడు యారాడలో 'జన్మభూమి- మా ఊరు'

మల్కాపురం(యారాడ), న్యూస్‌టుడే : యారాడ గ్రామంలో ఆదివారం 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వార్డు తెదేపా అధ్యక్షుడు పిల్లా అచ్చారావు తెలిపారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఇతర అధికారులు హాజరయ్యే సభకు స్థానికులు అధిక సంఖ్యలో రావాలన్నారు. సభలో వివిధ సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



తెదేపాతోనే పారదర్శక పాలన



49వ వార్డు జన్మభూమి సభలో మాట్లాడుతున్న జోన్-4 టౌన్‌ప్లానింగ్ ఏఈ ఉమామహేశ్వరావు

వివిధ వార్డుల్లో 'జన్మభూమి- మా ఊరు' సదస్సులు

మల్కాపురం, న్యూస్‌టుడే : తెలుగుదేశం ప్రభుత్వంతోనే పారదర్శక పాలన సాధ్యమవుతుందని, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అర్బన్ జిల్లా తెదేపా సమన్వయ కర్త శీరం పైడిరాజు అన్నారు. జీవీఎంసీ 46వ వార్డు శ్రీహరిపురం దరి గుల్లలపాలెంలో శనివారం వార్డు యూసీడీ సీవో తులసి అధ్యక్షతన జరిగిన జన్మభూమి- మా ఊరు సభలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ పాఠశాలల సూపర్‌వైజర్ రమణికుమారి, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, జన్మభూమి కమిటీ సభ్యురాలు హేమలత, చంద్రన్న బీమా కో-ఆర్డినేటర్ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

★ జిల్లాలోనే పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని 49వ వార్డు తెదేపా అధ్యక్షుడు మజ్జి సోమేష్ అన్నారు. వార్డు పరిధి దుర్గానగర్‌లో టౌన్‌ప్లానింగ్ ఏఈ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మభూమి సభలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు తెదేపా నాయకులు, వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టరు సత్యనారాయణ, వార్డు యూసీడీ సీవో కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

★ జీవీఎంసీ 45వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో వార్డు జన్మభూమి నోడల్ అధికారి, జోన్-4 జీవీఎంసీ వర్క్స్ విభాగం ఏఈ ఉషారాణి అధ్యక్షతన జరిగిన జన్మభూమి సభలో వార్డు తెదేపా అధ్యక్షుడు పిల్లా అచ్చారావు మాట్లాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టరు శివప్రసాద్, వార్డు యూసీడీ సీవో ప్రసాద్, బిల్లు కలెక్టరు సూర్య తదితరులు పాల్గొన్నారు.



45వ వార్డు ఏకేసీకాలనీ జన్మభూమి సభలో మాట్లాడుతున్న వార్డు తెదేపా అధ్యక్షుడు పిల్లా అచ్చారావు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 66వ వార్డు వెంకటాపురం మూడుగుళ్ల వద్ద శనివారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో మంత్రి గంటా, ఎంపీ హరిబాబు, ఎమ్మెల్యే గణబాబు గర్భిణీలకు సీమంతాలు చేసి, వివిధ పథకాలను చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమానికి హాజరైన అతిథులు, ప్రజలతో వుడా వీసీ బసంత్‌కుమార్ జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆరో జోన్ ఇంఛార్జి జెడ్సీ సత్యనారాయణరావు, జన్మభూమి ప్రత్యేకాధికారి వర్మ, ఇతర అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న చిన్నారులు



66వ వార్డు సమావేశానికి హాజరై ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు

★ జీవీఎంసీ 67, 42వ వార్డుల్లో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో ఏఈ ఏడుకొండలు మాట్లాడారు. కాలనీల్లోని మౌలిక సదుపాయలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 67వ వార్డులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా వార్డుల తెదేపా అధ్యక్షులు నమ్మి శ్రీనివాసరావు, కామాకుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

★ జీవీఎంసీ 42వ వార్డు ఎన్ఏడీ కొత్తరోడ్డులో ఆదివారం జన్మభూమి- మా ఊరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వార్డు తెదేపా అధ్యక్షుడు కామాకుల నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి లోకేష్‌కు స్వాగతం

గోపాలపట్నం, న్యూస్‌టుడే : రాష్ట్ర మంత్రి నారా లోకేష్ శనివారం నగరానికి చేరుకున్నారు. విశాఖపట్నం విమానాశ్రయంలో అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఇతర నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆదివారం జిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన నగరానికి వచ్చారని తెదేపా నాయకులు తెలిపారు.



నారా లోకేష్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తదితరులు

వైకాపాలో చేరికలు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 68వ వార్డు వైకాపా అధ్యక్షుడు గొర్లె అప్పలస్వామి ఆధ్వర్యంలో శనివారం రాత్రి బాజీకూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో 67, 68వ వార్డుల్లోని వివిధ పార్టీల కార్యకర్తలు వైకాపాలో చేరారు. పార్టీ నగర అధ్యక్షుడు మళ్ల విజయ్‌ప్రసాద్ వారికి పార్టీ కండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మళ్ల విజయ్‌ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా సైనికుల్లా కృషి చేయాలన్నారు. అనంతరం బత్తుల ఆగ్నేయకుమార్ ఆధ్వర్యంలో ఇంకొందరు వైకాపాలో చేరారు.



పార్టీలో చేరిన కార్యకర్తలతో వైకాపా నగర అధ్యక్షుడు మళ్ల విజయప్రసాద్ తదితరులు

ఎన్ఏడీ పైవంతెన నిర్మాణ పనులు వేగవంతం

ఎన్ఏడీకూడలి(గోపాలపట్నం), న్యూస్‌టుడే : ఎన్ఏడీ కొత్తరోడ్డు కూడలిలో నిర్మించ తలపెట్టిన పైవంతెన నిర్మాణ పనులు వేగంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు శనివారం రాత్రి జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్ హరినారాయణన్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్, వుడా వీసీ బసంత్‌కుమార్ తదితరులు ఎన్ఏడీకూడలికి చేరుకున్నారు. వంతెన నిర్మాణంలోని పిల్లర్ల ఏర్పాటుకు శుక్రవారం విజయనిర్మాణ్ సంస్థ సిబ్బంది వేసిన మార్కింగ్‌ను, వంతెన మ్యాప్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విడతల వారీగా భాగాలను విభజించి వంతెన నిర్మాణానికి ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులతో చర్చలు నిర్వహిస్తామన్నారు.



ఎన్ఏడీ పైవంతెన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, వుడా వీసీ బసంత్‌కుమార్, ఎమ్మెల్యే గణబాబు, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్ తదితరులు

కార్మికులకు కనీస పని భద్రత కల్పించాలి

మర్రిపాలెం, న్యూస్‌టుడే : ఊర్వశికూడలి దరి సుభాష్‌నగర్ దిగువ రోడ్డులోని రైల్వే కోచ్ కేర్ సెంటరులో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న కార్మికులకు కనీస పని భద్రత కరవైందని రైల్వే ఒప్పంద ఉద్యోగుల సంఘం ప్రతినిధి, సిటు నాయకులు ఎన్.సింహాచలం ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కోచ్ కేర్ సెంటరు వద్ద కార్మికులతో కలిసి నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. స్థానిక గుత్తేదారు సంస్థలో పదేళ్లుగా 260 మంది కార్మికులు రైళ్ల బోగీల శుభ్రత పనులు చేస్తున్నా... పని భద్రత, కనీస వేతనాలు లేకపోవడం దారుణమన్నారు. దీనికితోడు ఇటీవల కాంట్రాక్టును దక్కించుకున్న కొత్త సంస్థ 50 మంది కార్మికులను విధుల నుంచి అన్యాయంగా తొలగించిందని ఆరోపించారు. వెంటనే తొలగించిన కార్మికుల్ని విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాధిత కార్మికులు, కంచరపాలెం సిటూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న రైల్వే ఒప్పంద ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

నేర వార్తలు

మల్కాపురం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 45వ వార్డు కాకరలోవలో అనుమతి లేకుండా మద్యం అమ్మకాలు చేపడుతున్న పైరెడ్డి అప్పలనరసమ్మ ఇంట్లో శనివారం ఉదయం పోలీసులు తనిఖీలు నిర్వహించి 30 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ★ సింధియా కూడలి నుంచి షిప్‌యార్డుకు వెళ్లే మార్గంలో శనివారం ఓ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను ట్రాక్టర్ వెనక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న పాండ్యన్ ప్రకాశ్ కుడి కాలికి గాయమైందని పోలీసులు తెలిపారు. ఈ రెండు ఘటనలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నెమరంబాబు తెలిపారు.

